శనివారం

06-9-2025

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 346

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

థాయ్ నూతన ప్రధానిగా అనుతిన్

బ్యాంకాక్: థాయిలాండ్ తదుపరి ప్రధానిగా అనుతిన్ చార్న్‌విరాకుల్‌ను అక్కడి పార్లమెంట్ ఎన్నుకుంది. మాజీ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రను రాజ్యాంగ న్యాయస్థానం పదవి నుంచి తొలగించిన నేపథ్యంలో కొత్త ప్రధాని ఎన్నిక అనివార్యమైంది. షినవత్ర నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వంలో భూమ్ జైతై పార్టీకి చెందిన అనుతిన్ పనిచేశారు. కేవలం రెండేళ్లలో థాయిలాండ్‌కు మూడో ప్రధాని రావడం గమనార్హం. కంబోడియా సెనేట్ అధ్యక్షుడు హన్‌సేన్‌తో షినవత్ర ఫోనులో మాట్లాడటం, సరిహద్దు వివాదాలు తీవ్రంగా ఉన్న సమయంలో కీలక విషయాలు పంచుకున్న తీరు వివాదాస్పదమైంది. దానిపై విచారణ జరిపిన దేశ రాజ్యాంగ న్యాయస్థానం షినవత్ర తీరు నైతిక ప్రమాణాలను ఉల్లంఘించడమేనని తేల్చి చెప్పింది.

పంజాబ్‌కు అక్షయ్ రూ.5 కోట్ల విరాళం

ముంబై: వర్షాలు, వరదలతో అతలాకుతలమైన పంజాబ్‌కు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ రూ.5 కోట్ల విరాళం ప్రకటించారు. ఇది విరాళం కాదు ప్రజా సేవగా భావిస్తున్నానన్నారు. డొనేషన్ పదమే తనకు నచ్చదని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. ఇతరులకు సాయం చేసే అవకాశం వస్తే అదృష్టంగా భావిస్తానన్నారు. పంజాబ్‌కు చిన్న సాయం చేశానంతే అని చెప్పారు. గతంలో తమిళనాడు రాజధాని చెన్నైను వరదలు ముంచెత్తినప్పుడు, కొవిడ్ సమయంలోనూ అక్షయ్ తన వంతు సాయం చేశారు. 'భారత్ కీ వీర్'లో భాగంగా సైనిక కుటుంబాలకు మద్దతిచ్చారు.

నా గెలుపుపై సందేహం వద్దు

రాజ్యాంగ విలువులు కాపాడాలనే తపన

52 ఏళ్లుగా రాజ్యాంగం పట్టుకు తిరుగుతున్నా

'ఇండియా' ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి

పట్నా: దేశంలో ప్రమాదక పరిస్థితులు నెలకొన్నాయని, రాజ్యాంగ విలువులు కాపాడాలనే తపనతో ప్రతిపక్షాల మద్దతుతో ఉప రాష్ట్రపతి ఎన్నికకు సిద్ధమయ్యాయని జస్టిస్ సదుర్శన్ రెడ్డి వెల్లడించారు. భవిష్యత్‌లో ఏ పార్టీలో చేరే ఉద్దేశం తనకు లేద న్నారు. ప్రస్తుతం ఏ పార్టీతో ముడిపడి లేనని చెప్పారు. రాజ్యాంగ విలువుల పరిరక్షణకు కట్టుబడటం అన్నది తన ఐదు దశాబ్దాల న్యాయ వృత్తి నేర్పిందని, 'ఇండియా' ఉప రాష్ట్రపతి వెల్లడించారు. బీహార్ రాజధాని పట్నాలో ఆర్‌జేడీ నాయకుడు తేజస్వి యాదవ్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో జస్టిస్ రెడ్డి మాట్లాడుతూ ఉప రాష్ట్రపతిగా తన ఎన్నిక తథ్యమన్నారు. ప్రతి ఒక్కరి మద్దతు తనకు లభిస్తుందనిన్నారు. 'ఈ ఎన్నికల్లో గెలవబోతున్నా. ఈ విషయంలో సందేహమే వద్దు. అందరి మద్దతు లభిస్తుందన్న విశ్వాసం ఉంది' అని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి అన్నారు. ఉప రాష్ట్రపతి

- మిగతా 2 లో

సరైన దారిలో విద్యా వ్యవస్థ

- అందుకే ఆ శాఖ నిర్వహిస్తున్నా
- రాష్ట్ర పునర్నిర్మాణంలో టీచర్ల సేవలు అవసరం
- మట్టిలో మాణిక్యాలను వెలికి తీయండి
- గురుపూజోత్సవంలో సీఎం రేవంత్

విశాలాంధ్ర–హైదరాబాద్: గత పాలకుల నిర్లక్ష్యం వల్ల విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ వ్యవస్థను సరైన దారిలో పెట్టాలనే ఉద్దేశంతోనే విద్యా శాఖను తన దగ్గర పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

గురువారం గురుపూజోత్సవం సందర్భంగా స్థానిక శిల్పకళా వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయి ప్రసంగించారు. ముందుగా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి సీఎం పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రులు చాలా మంది రెవెన్యూ, ఆర్థిక శాఖ, నీటిపారుదల శాఖలను వారి దగ్గర పెట్టుకుంటారు కానీ నేను మీ సోదరుడిగా విద్యా శాఖను తన దగ్గరే పెట్టుకున్నానని స్పష్టం చేశారు. నేనే స్వయంగా విద్య శాఖను పర్యవేక్షిస్తున్నందున నేను ఉంటే విద్యా శాఖ బాగుపడుతుందనో, పేద పిల్లలు బాగుపడుతారనో కొందరు నాపై విమర్శలు చేస్తున్నారని, విద్యా శాఖ ఇంకెవరికైనా ఇవ్వాలని విమర్శిస్తున్నారని తెలిపారు. కానీ విద్యా శాఖలో సమస్యలు అర్థం చేసుకుని పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నానన్న విషయాన్ని విమర్శకులు గుర్తించాలన్నారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అందిస్తామని చెప్పి పదేళ్లు గడిచింది... మరి అది అమలు జరిగిందా అనేది మీరే ఆలోచించుకోవాలన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రతీ పల్లెకు జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే అన్నారు. ఆనాడు బడికి వచ్చే పిల్లల్నే కాదు తల్లిదండ్రులను ప్రభావితం చేసి ఉద్యమం వైపు నడిపించింది ఉపాధ్యాయులే అని గుర్తు

- మిగతా 2 లో

తెలంగాణలో 'మెడికల్' ఉత్పత్తి యూనిట్

సీఎంతో జర్మన్ కంపెనీ బృందం భేటి

2 లో

కోతుల దాడిలో రెండేళ్ల పాప మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్, సీతాపూర్ గ్రామంలో వానర సేన దుర్మార్గానికి ఒడిగట్టింది. ఓ ఇంట్లోకి చొరబడి, నిద్రపోతున్న రెండేళ్ల పాపను గాయపరచడమే కాకుండా ఆమెను లాక్కెళ్లి ఇంటిపైన ఉన్న నీళ్ల డ్రమ్ములో పడేశాయి. కుటుంబసభ్యులు బయట పని చేసుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగింది. పాప ఏడుపు వినిపించడంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతకగా నీళ్ల డ్రమ్ములో కనిపించింది. వెంటనే ఆస్పత్రికి తరలిస్తే పాప మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తమ గ్రామంలో కోతుల బెడద గురించి

- మిగతా 2 లో

'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం

పరిశ్రమలకు అన్ని విధాలా అనుకూలం

పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పురోగతికి తోడ్పడండి

గల్ఫ్ పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం

విశాలాంధ్ర – హైదరాబాద్ : 'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం కావాలని గల్ఫ్ పారిశ్రామికవేత్తలు, ప్రవాస భారతీయులను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ వీకెండ్ -దుబాయ్ 2025'లో భాగంగా యూఏఈలో నిర్వహించిన సౌత్ ఇండియన్ బిజినెస్ అచీవర్స్ అవార్డు(సైబా)ల ప్రదానోత్సవానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా నిలుస్తున్న తెలంగాణ పురోగతిని, భవిష్యత్ ప్రణాళికలను ఆయన వివరించారు. 'భౌగోళిక విస్తీర్ణంలో 11... జనాభా పరంగా తెలంగాణ 12వ స్థానంలో ఉంది. అయినా... దేశ జీడీపీలో తమ వాటా ఐదు శాతం కంటే ఎక్కువే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీఎస్‌డీపీ వృద్ధి రేటు 8.2 శాతంగా నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. గత 18 నెలల్లో తెలంగాణ లైఫ్ సైన్సెస్, ఈవీ, ఏరోస్పేస్, లాజిస్టిక్స్, ఏఐ, పునరుత్పాదక ఇంధనం తదితర రంగాల్లో రూ.3.28 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. ఎలీ లిల్లీ లాంటి అనేక ప్రపంచ దిగ్గజ సంస్థలు తెలంగాణను తమ గమ్యస్థానంగా మార్చుకున్నాయి. ఇప్పటికే యూఏఈ

- మిగతా 2 లో

3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

- యువ తెలంగాణ ప్రపంచంతో పోటీ
- విద్యారంగంపై ఊహకందని పెట్టుబడులు
- ఐఎస్‌బీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర – హైదరాబాద్ : తెలంగాణ రైజింగ్- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనగా రాష్ట్రం వేగంగా పరుగులు తీస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)లో శుక్రవారం 'మోతిలాల్ ఓస్వాల్ ఎగ్జిక్యూటివ్ సెంటర్'ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... యువ రాష్ట్రం ప్రపంచంతో పోటీపడుతుందని, రాష్ట్ర అభివృద్ధికి ఐఎస్‌బీ విద్యార్థులు సహకరించాలని కోరారు. విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య ఉచితంగా అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఒక్కో పాఠశాల నిర్మిస్తున్నామని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 104 పాఠశాలల నిర్మాణం ప్రారంభించినట్టు వివరించారు. విద్యార్థులు కళాశాలల నుంచి బయటికి రాగానే... ఉద్యోగం పొందేలా స్కిల్ యూనివర్సిటీలో సిలబస్ రూపొందించి అమలు చేస్తున్నట్టు తెలిపారు. తాను ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సింగిల్ టీచర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియంలో చదువుకున్నానని, రాసుకునేందుకు పలకలు కూడా లేక పోవడంతో మా గురువులు ఇసుక పైనే అక్షరాలు దిద్దిన సందర్భాన్ని డిప్యూటీ సీఎం గుర్తు చేసుకున్నారు. గురుపూజ దినోత్సవం రోజున తాను ఈ స్థానానికి రావడానికి కృషి చేసిన గురువర్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఒక్క సంవత్సరంలోనే ఐఎస్‌బీ దాదాపు 200 ప్రోగ్రాముల ద్వారా ఆరువేల మందికి పైగా ప్రొఫెషనల్స్‌కు శిక్షణ ఇవ్వడం గొప్ప విషయం అన్నారు. ప్రభుత్వం ఐఎస్‌బీని ఒక విద్యాసంస్థ గానే కాదు, భాగస్వామిగా చూస్తుందని తెలిపారు. సెంటర్ ఫర్ అనలిటికల్ ఫైనాన్స్ మాతో కలిసి "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగస్వామ్యం అవుతోందన్నారు. విద్య అనేది కేవలం ప్రొఫెషనల్స్ తయారు చేయడమే కాకుండా, సమాజం... మానవత్వం

- మిగతా 2 లో

కోటి మందిని చంపుతాం

- ముంబైలో మానవ బాంబులు సిద్ధం
- బెదిరింపు మెయిల్‌తో అప్రమత్తం

ముంబై: ముంబైకి బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో కలకలం రేగింది. దీంతో పోలీసులు, భద్రతా బలగాలు అప్రమత్తమయ్యారు. 34 వాహనాల్లో మానవబాంబులు నగరంలోకి ప్రవేశించాయని పేర్కొంటూ శుక్రవారం ముంబై ట్రాఫిక్ కంట్రోల్ రూమ్‌కు బెదిరింపు సందేశం వచ్చింది. 'ముంబైలోకి 14 మంది పాక్ ఉగ్రవాదులు చొరబడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో 34 వాహనాల్లో మానవబాంబులు ఏర్పాటు చేశాం. వారి వద్ద 400 కిలోల ఆర్డీఎక్స్ ఉంది. ఇప్పుడు మేము చేపడుతున్న భారీ పేలుళ్లు మొత్తం ముంబై నగరాన్ని కుదిపేస్తాయి' అని మెయిల్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. 'లష్కర్ ఏ జిహాదీ' అనే ఖాతా నుంచి ఈ బెదిరింపు మెయిల్ వచ్చినట్లు వెల్లడించారు. తాను పాక్‌కు చెందిన జిహాదీ గ్రూప్ సభ్యుడిగా మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నాడు. దీంతో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు. నగరంలో భారీగా భద్రతా

- మిగతా 2 లో

సబ్‌జైలు నుంచి ఇద్దరు ఖైదీల పరారీ

విశాలాంధ్ర–అనకాపల్లి: అనకాపల్లి జిల్లా చోడవరం సబ్‌జైలు నుంచి ఇద్దరు ఖైదీలు సినిమా ఫక్కీలో తప్పించుకుపోయారు. జైలులో వంట పని కోసం ఖైదీలను వినియోగించేందుకు బయటకు తీసుకొచ్చిన సమయంలో మాడుగుల చోరీ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బెజవాడ రాము హెడ్ వార్డర్ రాజుపై సుత్తితో దాడి కి పాల్పడ్డాడు. అనంతరం హెడ్‌వార్డర్ వద్ద ఉన్న తాళాల గుత్తి తీసుకుని... ప్రధాన ద్వారం తాళం తీసి పరారయ్యాడు. అతన్ని వెతికేందుకు అని చెప్పి... ఫించను డబ్బు కాజేసిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న పంచాయతీ మాజీ కార్యదర్శి నక్కా రవికుమార్ కూడా జైలు నుంచి పారిపోయాడు.

అమెరికా రక్షణ శాఖ ఇకపై యుద్ధ శాఖ

2 లో



బీజేపీది భస్మాసుర హస్తం

- టీడీపీ, జనసేనకూ బీఆర్‌ఎస్ గతే
- నారాయణ విమర్శ

బీజేపీ భస్మాసుర హస్తం లాంటిదని, ఆ పార్టీతో కలిసిన ఏ రాజకీయ పక్షమైనా అంతరించిపోవడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు.

2 లో

కొమురయ్య సేవలు చిరస్మరణీయం

- హక్కుల సాధన ఆ మహానుభావుడి పుణ్యమే
- సంఘటిత పోరాటంతో సింగరేణిని కాపాడుకోవాలి
- 'మనుబోతుల' వర్ధంతి సభలో కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో – కొత్తగూడెం: కొమురయ్య త్యాగాలు... పోరాటాల ఫలితంగానే నేడు సింగరేణి కార్మికులు హక్కులు అనుభవిస్తున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. నేడు కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణిపై కొమరయ్య స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సింగరేణిలో ఎంతో మంది ఉద్యమ నాయకుల ప్రాణత్యాగాలతో సాధించుకున్న హక్కులను పరిరక్షించుకుంటూ, సమస్యలను పరిష్కరించుకుంటేనే కొమురయ్యకు మనమిచ్చే నిజమైన నివాళి అని కూనంనేని స్పష్టం చేశారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యుడు, యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సాయుధ పోరాట యోధులు

- మిగతా 2 లో

ఉప ఎన్నికలు ఖాయం

- గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి
- లేకుంటే మరోసారి సుప్రీంకు వెళ్తాం
- పాలనలో విఫలమైన కాంగ్రెస్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి: కేటీఆర్

2 లో

భారత్‌కు దూరమయ్యాం

ట్రంప్ పశ్చాత్తాపం

వాషింగ్టన్: భారత్‌కు దూరమయ్యామంటూ పశ్చాత్తాపం వ్యక్తం చేసేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఒక పోస్టు పెట్టారు. ఇటీవల చైనాలో జరిగిన షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీఓ) సందర్భంగా రష్యా, భారత్, చైనా దేశాధినేతలు కలిసి ఉండటాన్ని విమర్శించారు. భారత్‌ను, రష్యాను కోల్పోయామని, అవి చైనా గుప్పెట్లోకి వెళ్లిపోయాయని ట్రంప్ వ్యాఖ్యానించారు. షాంఘై సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కలిసివున్న ఫొటోను సామాజిక మాధ్యమంగా పంచుకున్నారు. కొద్ది కాలంగా అమెరికా-భారత్ సంబంధాలు తీవ్ర ఒత్తిడికి లోనవుతుండటం, తాజాగా సుంకాలపై వివాదం దృష్ట్యా 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. 'కుట్రబుద్ధిగల చైనాకు మనం భారత్, రష్యాను కోల్పోయినట్లు కనిపిస్తోంది. ఈ దేశాలు భవిష్యత్‌లో సుసంపన్నంగా కలిసి మెలిసి ఉండాలి' అని ట్రంప్ వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. రష్యాతో చమురు కొనుగోళ్ల నెపంతో భారతదేశ ఉత్పత్తులపై అదనంగా 25 శాతం అంటే మొత్తం 50 శాతం సుంకాన్ని ఆగస్టు 27వ తేదీ నుంచి ట్రంప్ అమల్లోకి తేవడంతో అమెరికా అన్యాయంగా వ్యవహరిస్తోందని భారత్ పేర్కొంది. కేవలం తమపైనే ఇలాంటి చర్యలు ఎందుకని ప్రశ్నించింది. కుట్రబుద్ధిను కలిగివున్న దేశంగా ట్రంప్ చెప్పే చైనాపై చర్యలు ఏవంటూ నిలదీసింది. రష్యా నుంచి అధికంగా చమురు కొనుగోలు చేసే చైనాపై ఎలాంటి ఆంక్షలు విధించకుండా భారత్‌పై సుంకాలతో ట్రంప్ సర్కారు విరుచుకుపడటం విమర్శలకు తావిచ్చింది. ఇదే అంశాన్ని కొద్ది రోజుల కిందట రష్యా రాజధాని మాస్కోలో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ప్రస్తావించారు.

ఇదీ లోకం!



పశ్చిమ దళాలను వదలం

భద్రతా హామీలు రష్యాకు అవసరమే: పుతిన్

వ్లాదివోస్టోక్: ఉక్రెయిన్‌లో పశ్చిమ దేశాల దళాలే తమకు చట్టబద్ధమైన లక్ష్యాలు అవుతాయని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం భావి భద్రతాపై చర్చిస్తున్నట్లు కీవ్ మిత్రులను హెచ్చరించారు. యుద్ధం అంతమైన తర్వాత 26 దేశాలు ఉక్రెయిన్‌కు భద్రతాపరంగా హామీలు ఇస్తాయని, భూతలం, గగనతలం, సముద్రతలంలో సహకారాన్ని అందిస్తాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ ప్రకటన నేపథ్యంలో పుతిన్ స్పందించారు. ఉక్రెయిన్ నాటో సభ్యదేశంగా చేరకూడదన్న ఉద్దేశంతోనే యుద్ధానికి దిగినట్లు రష్యా ఇప్పటికే చాలా సందర్భాల్లో పేర్కొన్నది. ఇదే విషయాన్ని పుతిన్ తాజాగా గుర్తుచేశారు. పశ్చిమ దేశాల దళాలు ఉక్రెయిన్‌లో కనిపిస్తే... ప్రత్యేకించి సైనిక చర్యలు కొనసాగుతున్న వేళలో రంగ ప్రవేశం చేస్తే... విధ్వంసం సృష్టించేందుకు వాటినే లక్ష్యాలుగా చేసుకుంటామని వ్లాదివోస్టోక్‌లో ఆర్థిక ఫోరం సందర్భంగా ఉక్రెయిన్ మిత్రదేశాలకు పుతిన్ హెచ్చరిక చేశారు. శాంతి నెలకొల్పే దిశగా చర్చల్లో పురోగతి కనిపిస్తే... దీర్ఘకాల శాంతికి నిర్ణయాలు జరిగితే ఆ దళాలు ఉక్రెయిన్‌లో ప్రత్యక్షం అవ్వడానికి అర్థం ఉండదన్నారు. భద్రతా హామీలు రష్యా, ఉక్రెయిన్ రెండింటికి లభించాలని అన్నారు. 'గంభీరంగా చర్చలు జరపని పక్షంలో ఈ ఒప్పందాలు అమల్లోకి తెస్తామని మరోమారు స్పష్టంచేస్తున్నా' అని పుతిన్ తేల్చిచెప్పారు. కీలక అంశాలపై ఉక్రెయిన్‌తో ఏకాభిప్రాయం కుదరడం ఆచరణసాధ్యం కాదు కాబట్టే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో నేరుగా భేటీ అవ్వడం వ్యర్థమన్నారు. అలాగనీ చర్చలకు తాను పూర్తి విరుద్ధం కాదని, మాస్కోలో జెలెన్‌స్కీకి ఆతిథ్యం ఇచ్చేందుకు సిద్ధమని పుతిన్ తెలిపారు. 'నేను ముందే చెప్పా... నేను సిద్ధంగా ఉన్నా. దయచేసి రండి. మేము పని పరిస్థితులు, భద్రతను కల్పిస్తాం. నూటికి నూరు శాతం హామీనిస్తున్నా. కానీ సమావేశం కోసం వేరే ఎక్కడికో వెళ్లాలని వాళ్లు చెప్పినట్లయితే మా నుంచి చాలా ఎక్కువగా ఆశిస్తున్నారనే చెప్పగలను' అని పుతిన్ వెల్లడించారు. ఇదిలావుంటే పుతిన్‌తో మాస్కోలో సమావేశంపై జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. 'ఎలాంటి సమావేశాలకైనా సిద్ధమే కానీ, యుద్ధం ఆపడం పుతిన్‌కి

ఇష్టం లేదనిపిస్తోంది.ఆయన మాటల మనిషి... ఆయన చెప్పేది ఎవరూ నమ్మరు' అని వ్యాఖ్యానించారు.

ఉక్రెయిన్ భద్రతకు 26 దేశాల హామీ: మాక్రాన్

ఉక్రెయిన్‌కు అండగా నిలిచేందుకు 26 దేశాలు ముందుకొచ్చాయని, యుద్ధం అనంతరం ఆ దేశానికి భద్రతాపరంగా హామీలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ వెల్లడించారు. భూమి, ఆకాశం, సముద్రంలో అంతర్జాతీయ దళాల సహకారం ఉక్రెయిన్‌కు సమకూర్చేందుకు ఆ దేశాలు సంకల్పించాయని కీవ్ మిత్రపక్షాలతో సదస్సు అనంతరం మాక్రాన్ తెలిపారు. సమీప భవిష్యత్‌లో అమెరికా తరపున హామీలు ఖరారు అవుతాయన్నారు. సదస్సు తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తాను, యూరప్ నాయకులు, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఫోన్ చర్చలు జరిపినట్లు తెలిపారు. సదస్సులో 35 నాయకులు పాల్గొన్నారని చెప్పారు. యుద్ధం ఆగిన రోజు భద్రతా హామీలు అమల్లోకి స్తాయని జెలెన్‌స్కీతో కలిసి పారిస్‌లోని ఎలిసే ప్యాలెస్ వద్ద విలేకరుల సమావేశంలో మాక్రాన్ మాట్లాడారు. మరికొన్ని దేశాలు బాహ్య మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని కూడా ఆయన చెప్పారు. కీవ్ దళాలకు శిక్షణ, సామగ్రి సమకూర్చేందుకు సముఖత వ్యక్తంచేసినట్లు తెలిపారు. ఏయే దేశాల మద్దతు ఉక్రెయిన్‌కు ఉన్నదో ఆయన వెల్లడించలేదు. జెలెన్‌స్కీ మాట్లాడుతూ ఏయే దేశాలు ఏ విధంగా భద్రతాపరంగా హామీలు ఇవ్వగలవు, వేటికి సహకరించగలవు, ఎందులో భాగస్వాములు కాగలవు అన్నది చర్చిస్తున్నామన్నారు. భద్రతాపరంగా హామీలు ఇచ్చేందుకు 26 దేశాలు అంగీకరించాయని చెప్పారు. అయితే తమ దేశం క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్న దృష్ట్యా చాలా కాలం తర్వాత ఇటువంటి కీలక పరిణామం చోటుచేసుకున్నదన్నారు.

అమెరికా రక్షణ శాఖ ఇకపై యుద్ధ శాఖ

ట్రంప్ సర్కారు నిర్ణయం: త్వరలో ఉత్తర్వులపై అధ్యక్షుడి సంతకం

వాషింగ్టన్: పరిపాలన, ఇతర దేశాలతో సంబంధాలు, పన్నుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనేక మార్పులు చేశారు. ఇప్పుడు అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ (రక్షణ శాఖ)ను 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్ (యుద్ధ శాఖ)'గా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేయనున్నారు. గతంలోనే ఈ పేరుతో మంత్రిత్వ శాఖ ఉండగా 1947 క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' పేరును అమెరికా తొలగించింది. మళ్లీ దానిని పునరుద్ధరిస్తూ పెంటగాన్ పేరు మార్చేందుకు అధ్యక్షుడు సిద్ధమయ్యారు. 'పీట్ హెగ్సెత్ తరచూ అమెరికా రక్షణ శాఖ అంటూ సంబోధిస్తుంటారు. అది నాకు నచ్చలేదు. రక్షణ అనే పదం ఎందుకు? గతంలో పిలిచినట్లుగా 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్' అని పిలుద్దాం. అది శక్తిమంతమైన పదం. ఆ శక్తితోనే అమెరికా ప్రపంచ యుద్ధాలలో విజయం సాధించింది. ప్రతి విషయంలో ముందుంది. ఇప్పుడు మళ్లీ అదే పేరుతో ముందుకు వెళదాం' అని ట్రంప్ అన్నారు. పాలకవర్గ సభ్యులు మద్దతు ఇవ్వడంతో పేరు మార్పుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. ప్రస్తుతం అమెరికా రక్షణ మంత్రిగా పీట్ హెగ్సెత్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న విషయం విదితమే.

మూడు యుద్ధాలు ఆపా: ట్రంప్

తాను శాంతి దూతగా ప్రచారం చేసుకునే ట్రంప్ మాట మార్చేశారు. తాను ఆపినది ఏడు కాదు మూడు యుద్ధాలేనని చెప్పుకున్నారు. ప్రముఖ టెక్ సంస్థల అధిపతులు, సీఈవోలకు ట్రంప్ దంపతులు శ్వేతసౌధంలో విందు ఇచ్చిన క్రమంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై ప్రశ్నకు బదులిస్తూ 'మీకు తెలుసా.. నేను ఇప్పటి వరకు మూడు యుద్ధాలు ఆపా' అని అన్నారు. ఆ దేశాలన్నీ మూడు దశాబ్దాలుగా ఘర్షణల్లో ఉన్నాయని చెప్పారు. ఆ యుద్ధాలు ఆపలేరని తనతో చాలా మంది అనేకసార్లు చెప్పారని, వాటిని ఆపి చూపించానని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం క్లిష్టతరంగా ఉన్నా దాన్ని ఆపుతానంటూ దీమాగా చెప్పారు. భారత్-పాక్ యుద్ధాన్ని ఆపానంటూ ట్రంప్ పదేపదే పేర్కొనడం తెలిసిందే. భారత్- పాక్ మధ్య కాల్పుల విరమణలో మూడో దేశ ప్రమేయం లేదని భారత ప్రధాని మోదీ తెలిపారు. థాయిలాండ్-కంబోడియా, ఇజ్రాయిల్-ఇరాన్, ఇజ్రాయిల్-హమాస్, రవాండా-డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, సెర్బియా-కొసావో, ఈజిప్ట్-ఇథియోపియా మధ్య ఘర్షణలను ట్రంప్ ఆపారని శ్వేతసౌధం ప్రచారం చేయగా, ట్రంప్‌కు నోబెల్ శాంతి పురస్కారం ఇవ్వాలంటూ కొందరు నామినేట్ కూడా చేశారు.

నా గెలుపుపై సందేహం వద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల ప్రధానమైనదని, దీనికి పార్టీ విప్ వర్తించదని, ఓటింగ్ కూడా రహస్యంగా జరుగుతుందని తెలిపారు. ఉప రాష్ట్రపతిగా తనకు అన్ని పార్టీల నుంచి మద్దతు కోరుతున్నట్లు చెప్పారు. ఇండియా ఐక్య సంఘటన అభ్యర్థిగా దేశంలోని 63 శాతం మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఉప రాష్ట్రపతిగా పోటీ అవకాశం వచ్చినప్పుడు కాదనలేకపోయాను.ఎందుకంటే 'ఇండియా'లో భాగంగా లేని ప్రతిపక్ష పార్టీలు కూడా మద్దతు ఇస్తుంటే ఎలా కాదంటాను!' అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. 52 ఏళ్లగా రాజ్యాంగం ప్రతి జేబులో పెట్టుకొని తిరుగుతున్నట్లు తెలిపారు. తన జేబులో రాజ్యాంగం ఉండటాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గమనించారని, ఇలా 52 ఏళ్లుగా చేస్తున్నాను... ఇది మీరు ఇచ్చినది కాదని ఆయనతో సరదగా అన్నానని జస్టిస్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. ఇటీవల కాలంలో రాహుల్ రాజ్యాంగం ప్రతిని వెంట తీసుకెళుతుండటంతో ఇది ప్రస్తావనార్హమంటూ చిరునవ్వు చిందించారు.

కొమురయ్య సేవలు చిరస్మరణీయం

(మొదటిపేజీ తరువాయి)

మనుబోతుల కొమురయ్య 29వ వర్ధంతిని ఏఐటీయూసీ, సీపీఐ అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రుద్రంపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అక్కడే యూనియన్ కొత్తగూడెం బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించారు. కూనంనేని మాట్లాడుతూ సింగరేణి కార్మికవర్గానికి కొమురయ్య చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. నేడు కార్మికులు అనుభవిస్తున్న ప్రతి హక్కు వెనుక పోరాటం, త్యాగం ఉందని కొనియాడారు. సింగరేణిలో ఎనిమిది గంటల పనివిధానాన్ని సాధించిన ఘనత ఆయనదేనన్నారు. కాంట్రాక్టు విధానానికి ఆ మహానుభావుని పోరాటాల ఫలితంగానే స్వస్తి చెప్పారన్నారు. చీకటి బావుల్లో పనిచేసే మహిళా కార్మికులకు భూమిపైనే ఉద్యోగాలు కల్పించడంలోనూ, బాల కార్మిక వ్యవస్థకు ఆనాడే కొమురయ్య స్వస్థి పలికించాడని కొనియాడారు. రేగే, జాదవ్ కమిటీల ద్వారా, ముజుందాస్, దాస్ గుప్తా, రఘునాథ్ రెడ్డి అవార్డుల ద్వారా, పలు జాతీయ వేతన ఒప్పందాలు, సమ్మెపోరాటాల ద్వారా కార్మికులకు ఎన్నో హక్కులు సాధించిపెట్టిన ఘనత కేవలం కొమరయ్యకే దక్కుతుందన్నారు. అయితే నేటి పాలకులు, సింగరేణి యాజమాన్యం తిరోగమనరీతిలో పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కాంట్రాక్టీకరణ, ప్రైవేటీకరణవైపు వేగంగా అడుగులు వేయడం శోచనీయమన్నారు. ఇలాంటి విధానాలకు చరమగీతం పాడటానికి కార్మికులంతా సంఘటితంగా పోరాడి సింగరేణి సంస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కోరిమి రాజ్ కుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర కమిటీ నాయకులు జి. వీరాస్వామి, వై.వి. రావు, వంగ వెంకట్, వి. మల్లికార్జున్, ఎస్.వి. రమణమూర్తి, ఎస్. సుధాకర్, జె. గట్టయ్య, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, కిష్టాఫర్, ఎస్.నాగేశ్వర్రావు, సముద్రాల సుధాకర్, హుమాయూన్, కృష్ణయ్య, సందెబోయిన శ్రీనివాస్, తోట రాజు, డాక్టర్ శైలజ, సాత్విక్ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

కోసం నాయకులను తీర్చిదిద్దాలన్నది తమ ప్రజా ప్రభుత్వ సంకల్పం అని తెలిపారు.

స్కిల్స్ యూనివర్సిటీ ప్రారంభమైన తొలి ఏడాదిలోనే వందలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందన్నారు. మొదటి దశలో 58 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ రూ.11 వేల కోట్లకు పైగా పెట్టుబడితో, విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దడానికి, అకాడమిక్ నుంచి పోటీ పరీక్షల వరకు నిర్మితమవుతున్నాయని వివరించారు. ఉత్తమ నాయకులు అంటే ఉత్తమ విద్యార్థులే అని అభివర్ణించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ...నిరంతరం నేర్చుకోవడానికి ఇష్టపడతారని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఐఎస్‌బీలో ఐదు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని నిర్వాహకులను డిప్యూటీ సీఎం కోరారు. మోతిలాల్ ఓస్వాల్ డీన్ మదన్ పిల్లుట్ల, ప్రభాత్ సిన్హా, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'రైజింగ్ తెలంగాణ'లో భాగస్వామ్యం

(మొదటిపేజీ తరువాయి)

పెట్టుబడిదారులు రూ.రెండు వేల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టారు. ఇది తెలంగాణ - దుబాయ్ మధ్య రోజురోజుకీ బలపడుతున్న వాణిజ్య సంబంధాలకు చిహ్నంగా భావిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చే వారిని మేం కేవలం వ్యాపారవేత్తలుగా మాత్రమే చూడటం లేదు. మా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామిగా పరిగణిస్తున్నామని అన్నారు. ఏఐ, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, డిజిటల్ ఎకానమీ, స్మార్ట్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, లాజిస్టిక్స్, వేర్ హౌజింగ్, ట్రేడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, ఫుడ్ ప్రాసెసింగ్, ఈవీ, ఏరో స్పేస్, డిఫెన్స్ మాన్యుఫాక్చరింగ్ తదితర రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటాం. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు.

బీజేపీది భస్మాసుర హస్తం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: బీజేపీ భస్మాసుర హస్తం లాంటిదని, ఆ పార్టీతో కలిసిన ఏ రాజకీయ పక్షమైనా అంతరించిపోవడం ఖాయమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ రెండుగా చీలిపోవడాన్ని ఉదాహరణగా పేర్కొంటూ... ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన పార్టీలకు కూడా భవిష్యత్తులో ఇదే గతి పడుతుందని ఆయన హెచ్చరించారు. ఏపీలోని రాజకీయ పార్టీలు ప్రధాని మోదీకి దాసోహమయ్యాయని నారాయణ తీవ్రస్థాయిలో విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి కేంద్రానికి సాగిలపడుతున్నాయని దుయ్యబట్టారు. ముఖ్యంగా, విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కొందరు కావాలనే ప్లాంట్‌ను దెబ్బతీసి... నష్టాల్లోకి నెట్టి... ఆ తర్వాత అమ్మకానికి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని నారాయణ అన్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న కుట్ర అని ఆయన అభిప్రాయ పడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపైనా నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. జీఎస్టీ పేరుతో బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలను నిలువునా లూటీ చేసిందని ఆరోపించారు. తొమ్మిదేళ్ల పాటు కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టి... ఇప్పుడు బీహార్, తదితర రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ముందు జీఎస్టీలో మార్పులు చేయడం ప్రజలను మోసగించడమేనని మండిపడ్డారు. జీఎస్టీ స్వరూపాన్ని పూర్తిగా మార్చాలని, లేకపోతే రాబోయే రోజుల్లో ప్రజలు మరిన్ని ఇబ్బందులు పడతారని ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలపైనా నారాయణ మండిపడ్డారు. నక్సల్స్‌ను చంపుతామని అమిత్ షా అంటున్నారని, కానీ వారిని చంపడం ద్వారా వారి సిద్ధాంతాన్ని ఎలా మారుస్తారని ప్రశ్నించారు. గిరిజనుల ఆస్తులు కాజేయడానికే నక్సల్స్ ఏరివేత పేరుతో నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని... వ్యతిరేక గళం వినిపించిన వారిని 'ఆపరేషన్ కగార్' పేరుతో అడ్డు తొలగించుకుంటున్నారని తీవ్ర విమర్శలు చేశారు.

చత్తీస్‌గఢ్‌లో 'ఎన్‌హెచ్‌ఎం' సమ్మె

14,678 మంది ఒప్పంద సిబ్బంది సామూహిక రాజీనామా

రాయ్‌పూర్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) చత్తీస్‌గఢ్ ఒప్పంద ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం పోరాడుతున్నారు. ఇదే క్రమంలో 14వేల మందికిపైగా ఒప్పంద అధికారులు, ఉద్యోగులు శుక్రవారం సామూహిక రాజీనామాలు సమర్పించారు. డిమాండ్ల సాధన పోరుకు సారథ్యం వహించిన 25 మందిని విధుల్లో నుంచి తొలగించడానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా 14,678 మంది ఎన్‌హెచ్‌ఎం అధికారులు, ఉద్యోగులు తమ రాజీనామాలను సమర్పించారు. 16వేల మంది ఒప్పంద కార్మికులు నిరవధిక దీక్ష చేపట్టారని, వారు రాజీనామాలకు సిద్ధంగా ఉన్నారని, చత్తీస్‌గఢ్ ప్రదేశ్ కర్మచారీ సంఘ్ నాయకుడు హేమంత్ కుమార్ సిన్హా వెల్లడించారు. తమ భవిష్యత్ కార్యాచరణను శనివారం రాయ్‌పూర్‌లో నిర్వహించే విలేకరుల సమావేశంలో ప్రకటిస్తామని తెలిపారు. మెరుగైన పని పరిస్థితులు, సేవల క్రమబద్ధీకరణ తదితర డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 18వ తేదీ నుంచి సిబ్బంది ఆందోళన చేస్తున్నారు. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం మానేసి, కఠిన చర్యలకు ప్రభుత్వం ఉపకరించిందని సంఘ్ నాయకులు వెల్లడించారు. ఉద్యోగుల సమ్మె కారణంగా ఆరోగ్యపరంగా అనేక సేవలు నిలిచిపోయినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఒప్పంద కార్మికుల 10 డిమాండ్లలో నాలుగింటిని ఆగస్టు 13న అంగీకరించినట్లు రాష్ట్ర ఆరోగ్య కమిటీ తెలిపింది. మరో మూడు డిమాండ్ల పరిశీలన కోసం కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. అనేక నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా ఆందోళనకు దిగిన ఉద్యోగులు విధులకు హాజరు కాలేదని, అందుకోసమే 25 మందిని తొలగించినట్లు ఒక అధికారి వెల్లడించారు. 'విధులకు హాజరయ్యేందుకు చట్ట ప్రకారం ఉన్న అవకాశాలు ఇచ్చినప్పటికీ అలా జరగలేదు కాబట్టి ఒప్పంద నియామకాన్ని తక్షణమే రద్దు చేస్తున్నాం' అని సెప్టెంబరు 3న టెర్మినేషన్ ఆర్డర్ జారీ అయింది.

సరైన దారిలో విద్యా వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. పదేళ్లుగా టీచర్ల బదిలీలు జరగలేదు, 2017 నుంచి టీచర్ల నియామకాలు జరగలేదన్నారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కేవలం 55 రోజుల్లో 11 వేల టీచర్ల నియామకాలు పూర్తి చేశామని చెప్పారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్న ఆలోచన ఆనాటి పాలకులకు ఎందుకు రాలేదన్నారు. విద్యను లాభసాటి వ్యాపారంగా మార్చుకుని ఆధిపత్యం చెలాయించాలని ఆనాటి పాలకులు ప్రయత్నిం చారని, ప్రొఫెసర్లను నియమించకుండా విశ్వవి ద్యాలయాలను నిర్వీర్యం చేశారని విమర్శిం చారు. ఉస్మానియా, కాకతీయ వైభవాన్ని కోల్పోయే పరిస్థితి ఆనాడు తీసుకొచ్చారని, మీ ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని తెలిపారు. మీ సంఘాలు ఎప్పుడు వచ్చినా సమస్యలు విని పరిష్కరించే ప్రయత్నం చేశామని వివరించారు. ఎక్కడైనా కొంత ఆలస్యం కావచ్చు కానీ సమస్య పరిష్కరించకుండా ఉండలేదన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో మీ సేవలు అవసరమని, తెలంగాణలో 27 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 24 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 10 వేల ఇతర పాఠశాలల్లో 34 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎక్కువ విద్యావంతులు, సామాజిక బాధ్యత తెలిసిన వారని అన్నారు. టీచర్లకు జీతాలు ఇచ్చి చేతులు దులుపుకుంటే సరిపోదు... మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని... అందుకే అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యత అప్పగించామని వివరించారు. ప్రతి ఏటా పాఠశాలల నిర్వహణకు రూ.130 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. చదువొక్కటే పేదల తల రాతను, రాష్ట్రం తలరాతను మారుస్తుందని తెలిపారు. టీచర్లు అంటే ఒక కుటుంబ పెద్దగా భావించండి అని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో మధ్యాహ్నం భోజన సమయంలో పిల్లలతో కలసి ఉపాధ్యాయులు భోజనం చేయాలని... అప్పుడే తప్పులు జరగకుండా ఉంటాయని చెప్పారు. గతంలో ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గేదన్నారు. కానీ మన ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 3 లక్షలు పెరిగిందని అన్నారు. ఇందులో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుదామని ప్రతినబూనుదామని పిలుపునిచ్చారు. ప్రపంచ దేశాలతో పోటీ పడేలా మన విద్యార్థులను తీర్చిదిద్దుదామన్నారు. తెలంగాణకు ఒక నూతన విద్యా విధానం అవసరం ఎంతైనా ఉందని, పేద పిల్లల జీవితాలను మార్చేలా ఆ విధానం ఉండాలని సూచించారు. అందుకే విద్యా విధానాన్ని రూపొందించేందుకు ఒక కమిటీని నియమించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాల విద్యనే కాదని... నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. వరల్డ్ బెస్ట్ మోడల్‌గా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. నిరుద్యోగ యువతకు నైపుణ్యాన్ని అందించేందుకు స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని అన్నారు. 65 ఐటీఐలను టాటా కంపెనీతో కలిసి జాయింట్ వెంచర్‌గా ఏటీసీలుగా నవీకరించామని, దేశ ప్రతిష్టను పెంచేలా తెలంగాణలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మట్టిలో మాణిక్యాలను వెలికి తీయండి.. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలపై ఆసక్తి ఉన్న వారికి గుర్తించి ప్రోత్సహించండి... చదువుతోనే కాదు... క్రీడల్లో రాణించినా మంచి భవిష్యత్ ఉంటుందని అవగాహన కల్పించండని సూచించారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి లాంటి తప్పు దారిలో పడకుండా చూడాల్సిన బాధ్యత మీపై ఉందని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ఈగల్ ఫోర్స్‌ను తీసుకువచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, యూనివర్సిటీ వీసీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉప ఎన్నికలు ఖాయం

విశాలాంధ్ర - హైదరాబాద్: భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని బంగారు పళ్లెంలో పెట్టి కాంగ్రెస్ చేతిలో పెట్టామని కానీ ఇచ్చిన హామీలు, సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, తమకు పరిపాలన చేతకావడం లేదని, అన్ని పథకాలు అమలు చేయలేమని నేరుగా చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 21 నెలల్లోనే ప్రజల నుంచి సంపూర్ణ వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు. సీఎం... పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిక్షణం కేసీఆర్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ. 2.80 లక్షల కోట్ల అప్పు మాత్రమే చేసిందని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని గుర్తు చేశారు. అయితే, ఈ 21 నెలల కాలంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ. 2.20 లక్షల కోట్ల పైగా అప్పులు చేసిందని, ఆ అప్పుతో ఏ ఒక్క సంక్షేమ పథకం లేదా అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. యూరియా సంక్షోభంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనుమానాలకు దారితీస్తోందని కేటీఆర్ అన్నారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, రాబోయే ఆరు నెలల్లో ఉప ఎన్నికలు రావడం ఖాయమని అన్నారు. గడువులోగా స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే మరోసారి సుప్రీంకోర్టుకు వెళ్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఉప ఎన్నికల్లో బాన్సువాడలో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఓడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఇదిలా ఉండగా... కేసీఆర్ నివాసంలో పలువురు కాంగ్రెస్ నేతలు, వందలాది మంది కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వీరిలో ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కోటగిరి వల్లేపల్లి శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ బాన్సువాడ నార్ల రత్న కుమార్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బొట్టె గజేందర్, మాజీ సర్పంచ్ పద్మ మొగులయ్య, బంజా గంగారాం, కురలేపు నగేష్, మాజీ కో-ఆప్షన్ హకీమ్ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో 'మెడికల్' ఉత్పత్తి యూనిట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : మెడికల్ పరికరాల ఉత్పత్తి యూనిట్‌ను తెలంగాణలో ప్రారంభించేందుకు జర్మన్ కంపెనీ ముందుకు వచ్చింది. ఈ మేరకు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జర్మనీకి చెందిన బీఈబీఐజీ మెడికల్ కంపెనీ చైర్మన్, సీఈవో జార్జ్ చాన్ ప్రతినిధి బృందం కలిసింది. తెలంగాణలో మెడికల్ పరికరాల ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం తెలిపారు. అనువైన స్థలం, ఇతర అంశాలకు సంబంధించి అధ్యయనం చేసి రిపోర్టు అందించాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ ఎక్విప్ మెంట్‌తో పాటు, క్యాన్సర్ చికిత్సకు ఉపయోగపడే రేడియేషన్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు.

కోటి మందిని చంపుతాం

(మొదటిపేజీ తరువాయి)

బలగాలను మోహరించినట్లు అధికారులు పేర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయడానికి బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను మోహరించినట్లు అధికారులు తెలిపారు. సోదాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి పేలుడు పదార్థాలు లభించలేదన్నారు. నగరంలో అనుమానాస్పద కదలికలను గుర్తిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ముంబై పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కోతుల దాడిలో రెండేళ్ల పాప మృతి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జిల్లా, అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆరోపించారు. కోతులు తరచూ చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తుంటాయన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే చిన్నారి ప్రాణాలు కోల్పోయిందని, అటవీశాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రష్యా చమురు కొనుగోలు ఆగదు: సీతారామన్



న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. భారత తన సొంత ప్రయోజనాలకనుగుణంగా ఇంధన ఎంపికలు చేసుకుంటుందని ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. 'రష్యా చమురు కొనుగోలు కొనసాగుతుంది. మన అవసరాలకు తగినది కొంటాం. చమురును ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలనే నిర్ణయం మనదే' అని అమెరికా సుంకాల వేళ భారత వైఖరిని సీతారామన్ వెల్లడించారు. ఎగుమతిదారుల కోసం ఉపశమన చర్యల ప్యాకేజీని త్వరలో ప్రకటిస్తామన్నారు. తాజా సుంకాలతో ప్రభావితమైన పరిశ్రమలను ఈ ప్యాకేజీ ఆదుకుంటుందని తెలిపారు. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై అదనంగా 25 శాతం కలిపి 50శాతం సుంకాలను అమెరికా విధించిన విషయం తెలిసిందే.

దేశ భవిష్యత్తుకు దిక్సూచి ఉపాధ్యాయుడే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : దేశ భవిష్యత్తుకు ఉపాధ్యాయుడేనని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో గురుపూజోత్సవం జిల్లా విద్యాశాఖ అధికారి హెచ్‌విఎన్‌పి దక్షిణామూర్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీంద్రరావు, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్రంలో మన జిల్లా ఎస్‌ఎస్సి ఫలితాల్లో మొదటి స్థానం సాధించినందుకు ఉపాధ్యాయులు అందరికీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక పుస్తకం మనసును మార్చగలదు. కానీ ఒక ఉపాధ్యాయుడు జీవితాన్ని మార్చగలడని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్‌రావు, మాట్లాడుతూ మన మొదటి గురువు మన తల్లిదండ్రులు తరువాత ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సేవలను గౌరవిస్తూ ఉన్నానని, ఉపాధ్యాయుడు విద్యార్థికి గురువు మాత్రమే కాక, మార్గదర్శకుడు, ప్రేరణ దాత కూడా, మీ అందరి నిబద్ధత, కృషి పట్ల నేను గర్విస్తున్నాను. ఈ సందర్భంగా ఎంపిక చేయబడిన 12 మంది ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు, అప్పారావు, సంతోష్, ఆజాద్, పూర్ణ చందర్, ఉమామహేశ్వర్, సతీష్, శ్రీనివాస్, వివిధ మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తు తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

విశాలాంధ్ర - నల్గొండ బ్యూరో : దేశాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం, దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమ్మానాన్నల తర్వాత స్థానం గురువుకే దక్కిందని, అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే మహత్తర వ్యక్తి గురువని కొనియాడారు. రాధాకృష్ణ సేవలు దేశానికి చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణలో విద్యారంగాన్ని పటిష్టం చేసేందుకు ప్రభుత్వం బలమైన చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. ప్రతి ఒక్కటి 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, మొదటి పాఠశాల పనులు నల్గొండలో ప్రారంభమయ్యాయని చెప్పారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకం, మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలు చేపట్టి బోధన నాణ్యతను పెంపొందిస్తున్నామని తెలిపారు. నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనని అన్నారు. మంత్రి వెంకటరెడ్డి తన సొంత నిధులతో ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నారని, ఇది ఇతరులకు ఆదర్శమని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి వల్ల జిల్లాలో విద్యార్థుల నమోదు గత సంవత్సరం కంటే 12 శాతం పెరిగిందని వెల్లడించారు. భవిత కేంద్రాలు విజయవంతంగా నడవడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, మైనింగ్ ఆదాయంలో 70 శాతం నిధులను విద్యాభివృద్ధికి వినియోగిస్తున్నామని తెలిపారు. ఎంఎల్సీ శంకర్ నాయక్, నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సమాజానికి దిశానిర్దేశం చేసేది ఉపాధ్యాయులే అని, అవార్డులతో సంబంధం లేకుండా నిరంతరం విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, డీఈఓ బిక్షపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

ఎమ్మెల్యేలు కూనంనేని, జారే, కలెక్టర్ జితేష్ వి పాటిల్.

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : భావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దటమే కాకుండా సమాజాన్ని దిశా నిర్దేశం చేసే స్థాయిలో ఉపాధ్యాయులు పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభి వృద్ధికై నిరంతరం ఉపాధ్యాయులు పాటుపడాలి కోరారు. శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి బి. నాగలక్ష్మి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలొ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా కూనంనేని పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయుడనేవారు నిరంతరం విద్యార్థులుగా నేర్చుకుంటూనే తరగతి గదిలో విద్యార్థుల సర్వతోముఖాభి వృద్ధి కోసం పాటుపడాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ప్రతీ విషయాన్నీ ముందుగా అధ్యయనం చేసి పట్టు పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ పాల్గొని మాట్లాడారు. తాను ఉపాధ్యాయుడుగా చేసిన రోజులను స్మరించుకుంటూ, ఉపాధ్యాయుల బోధనా విధానాలను బట్టే విద్యార్థుల జీవితాల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. అలాంటి ఉపాధ్యాయులే చిరస్థాయిగా గుర్తుండిపోతారని తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక అయిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయులు అందరు తన దృష్టిలో ఉత్తమ ఉపాధ్యాయులే అన్నారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చెర్మన్ పసుపులేటి వీరబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాభివృద్ధి కోసం ఒక ప్రత్యేక విజన్ తొ కార్యాచరణ రూపొందిస్తున్నారని తెలిపారు. ఎం ఈ వో నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 57 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ను గుర్తించమన్నారు. వారికి శాలువా, ప్రశాంస పత్రాలు, జ్ఞాపిక లను అందచేస్తున్నట్లు తెలిపారు. ట్రైనీ కలెక్టర్ సౌరభ శర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని అన్నారు. తనకు గురువు ఈ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అని కొనియాడారు. కాగా జిల్లా కలెక్టర్ నిర్దేశించిన విత్తనాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన 23 మండలాల లోని ప్రథమ స్థానంలో నిలిచిన 23 పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఈ సందర్భంగా సత్కరించడం జరిగింది. అలరించాయి. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కో ఆర్డినేటర్ లు నాగరాజ శేఖర్, సైదులు, సతీష్, అన్నమణి, పరీక్షల విభాగం అధికారి మాధవరావు, డీసిఇబి సెక్రెటరీ నీరజ, ఎంఈఓ మధురవాణి, హెచ్ఎం లు పద్మలత, రమాదేవి, నిర్వహణ బాధ్యులు జంకిలాల్, బాలాజీ, నరేష్, ప్రేమ్, ప్రెస్ ఇంచార్జ్ షేక్ దస్తగిరి, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి కలెక్టర్ సన్మానం

విశాలాంధ్ర - కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ పరిమి నవీన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యలో నూతన సృజనాత్మక పద్ధతులలో బోధన, విద్యార్థులకు మోటివేషనల్ గైడ్‌గా, వ్యవహరిస్తూ, తెలుసుకున్న విషయాలను పాటిస్తూ, ఇంటర్, పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించుటకు వారి కృషి, విద్యార్థుల సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధికి శ్రమిస్తున్నందుకు గాను జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ పాఠశాల సర్వతోముఖాభివృద్ధిలో, విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించుటలోను ప్రిన్సిపల్ పరిమి నవీన్ పాత్రప్రముఖమైనదని కొనియాడారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. గ్రామస్తులు ఎస్ఎంసి మాజీ చైర్మన్ పిచ్చయ్య, కాంగ్రెస్ అధ్యక్షులు గండి శ్రీనివాస్, దినేష్, అశోక్ అమ్మ ఆదర్శ పాఠశాల, శారద, మాజీ చైర్మన్ శిరీష, తదితరులు అభినందించారు.

ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి

విశాలాంధ్ర - సూర్యాపేట : ముస్లిమ్స్ పండుగ మీలాదిన్నబి సందర్భంగా ప్రభుత్వ ప్రైవేటు స్కూల్స్ అన్నిటికీ సెలవు ప్రకటించడం జరిగింది. సూర్యాపేటలో ఉన్నటువంటి శ్రీ చైతన్య స్కూలు ప్రిన్సిపాల్ ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా స్కూల్ నిర్వహించి టీచర్స్ డే నాడు టీచర్స్ తోనే చాకిరి చేయించుకోవడం జరిగింది. ప్రభుత్వ సెలవులు కూడా పట్టించుకోకుండా టెన్త్ క్లాసు విద్యార్థులకు దాదాపు 100 మందికి సెషన్స్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. సూర్యాపేటలో ఉన్నటువంటి ఉపాధ్యాయ సంఘాలు వెళ్లి ప్రిన్సిపాల్‌ని అడగడంతో మేము అలాగే నిర్వహిస్తాము మీరు ఏమైనా చేసుకోండి అని మాట్లాడటం గమనార్హం. బాధ్యతారాహిత్యంగా ప్రవర్తిస్తున్నటువంటి శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ మీద చర్యలు తీసుకోవాలని కోరుతూ సూర్యాపేట టిపిటిఎల్ఎఫ్ సభ్యులందరూ ధర్నా చేశారు.

ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అమర్ నగర్ చౌరస్తా వద్ద గల స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి ఉపాధ్యాయులు, స్థానిక నాయకులతో కలిసి పెద్దపల్లి శాసన సభ్యులు చింతకుంట విజయరమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెద్దపల్లి సిరి ఫంక్షన్ హాల్లో పెద్దపల్లి రెసిడెన్షియల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణ రావును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తదుపరి ఉత్తమ ప్రతిభ కనబరిచి పెద్దపల్లిలో నివాసం ఉంటున్న 70 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సన్మానించారు. డీసీఈబీ సెక్రటరీ వాలుక హనుమంతు, పెద్దపల్లి మండల విద్యాధికారి సురేందర్ కుమార్, గవర్నమెంట్ ఎగ్జామ్స్ అసిస్టెంట్ కమీషనర్ రాంరెడ్డి, సీనియర్ హెడ్ మాస్టర్ చాట్ల ఆగయ్య, పెద్దపల్లి రెసిడెంట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ వేగోళం సత్యనారాయణ, ట్రెజరర్ కర్రే ప్రవీణ్, ఉపాధ్యక్షులు మహేందర్ రెడ్డి, రామస్వామి, కార్యవర్గ సభ్యులు కిషన్‌రెడ్డి, సంపత్ రెడ్డి, కనకయ్య, ఫణిందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జన వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : ఖానాపూర్ పట్టణంలోని మహేంద్ర సంఘం గడ్డిజాతికి చెందిన మెదరుల గణపతి నిమర్జన వేడుకలు, హిందూ సంప్రదాయ బద్ధంగా అడవి బిడ్డల ఆదివాసీల గుస్సాడి నృత్యాల మధ్య గణపతి నిమ్మజ్జనం జరుపుకున్నారు. పట్టణ మహేంద్ర సంఘం అధ్యక్షులు మధిరే రాము ఉపాధ్యక్షులు ఏనుగందుల హరీష్ తెలంగాణ, మహేంద్రా సంఘం, వర్కింగ్ ప్రెసిడెంట్, మాదిరే సత్యనారాయణ, జర్నలిస్ట్ మదిరే శ్రీనివాస్, పెద్దులు, నర్సయ్య, సత్తిష్‌లు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల మండల పరిధిలోని పెంచికల్ దిన్న గ్రామ పీఏసీ ఎస్ వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. పంటకాలం కావడంతో ఎరువులపై డిమాండ్ పెరగడంతో ఉదయం నుంచే రైతులు క్యూల్లో నిలబడ్డారు. ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే యూరియాను విక్రయిస్తుండగా, సరిపడా స్టాక్ లభించకపోవడంతో కొంతమంది రైతులు నిరాశ చెందారు. రైతులకు ఎరువు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని పీఏసీ ఎస్ అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనపు యూరియా స్టాక్ త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

పేదలకు అండగా డాక్టర్ రామనర్సయ్య

విశాలాంధ్ర - తొర్రూరు: తన పుట్టిన రోజు సందర్భంగా పేద ప్రజలకు సహాయం చేయాలనే మంచి మనసుతో శుక్రవారం తొరూరు మున్సిపల్ పట్టణ కేంద్రంలోని కంటయాపాలెం రోడ్డులో ఉన్న పేద కుటుంబం, భార్య భర్తలు వారికి పిల్లలు లేరని, వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని గుర్తించి వారికి బియ్యం, నిత్యవసర సరుకులు, గుడిసె మీద కప్పుకోవడానికి టార్పాలిన్‌ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న పిడిజిలు డాక్టర్ రాజేందర్ రెడ్డి, లక్ష్మీనరసింహారావు, క్లబ్ పెద్దలతో కలిసి లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ సూర్నం రామ నరసయ్య అందజేసినట్లు తెలిపారు. ఎక్కడ అవసరం ఉంటే అక్కడ తక్షణం స్పందించి సహాయం అందజేస్తున్న డాక్టర్ రామ నరసయ్యను పిడిజిలు డాక్టర్ రాజేందర్ రెడ్డి, లక్ష్మీనరసింహారావు, క్లబ్ పెద్దలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిస్టిక్ ఎవల్యూషన్ చైర్మన్ రేగురి వెంకన్న, పిఆర్‌సి తమ్మెర విశ్వేశ్వరరావు, క్లబ్ సెక్రెటరీ ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ బోనగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అనేక హక్కులు సాధించిన గొప్ప నాయకుడు కొమురయ్య

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: బొగ్గు గని కార్మికుల పెన్షన్‌తో పాటు కార్మికులకు అనేక హక్కులు సాధించిన గొప్ప నాయకుడు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి మాజీ ప్రధాన కార్యదర్శి అమరజీవి మనుబోతుల కొమురయ్య అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లయ్య, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అన్నారు. శుక్రవారం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, ఎఐటియుసి. ఆర్జీ వన్ బ్రాంచి ఆధ్వర్యంలో గనులు, డిపార్ట్మెంట్‌లలో, గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కొమురయ్య 29వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటాలకు కార్మికులు, ఏఐటియుసి నాయకులు, కార్యకర్తలు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణిలో ఏఐటియుసి యూనియన్ స్థాపించిన వ్యవస్థాపకుల్లో కొమురయ్య ఒకరని, నలబై ఏళ్లకు పైగా యూనియన్‌కు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ బొగ్గు గని కార్మికుల సమస్యలతో పాటు పెన్షన్ సాధించిన మహానేత కొమురయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కనకరాజు, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఆఫీస్ బేరర్స్ సంకె అశోక్, సయ్యద్ సోహేల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ వన్ అధ్యక్షులు ఎంఎ గౌస్‌తో పాటు ఆయా గనులు, డిపార్ట్మెంట్‌లకు చెందిన పిట్ కార్యదర్శులు, ఆఫీస్ బేరర్స్ అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ములుగు జిల్లాల్లో గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో: జిల్లా కేంద్రంలోని తోపు కంటలో ములుగు, వెంకటపూర్ మండలాలకు సంబంధించిన, 150 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉంది. అదేవిధంగా ముళ్లకట్ట, ఏటూరునాగారం నందు 250 గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసే అవకాశం ఉంది. ఏటూరు నాగారం, మంగపేట, వాజెడ్ మండలాలకు సంబందించిన అన్ని గణేష్ విగ్రహాలు నిమజ్జనం చెయ్యడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చెయడం జరిగింది. డీపీవో ఓ దేవరాజు, మున్సిపల్ కమిషనర్ సంపత్, ములుగు తహసిల్దార్ విజయభాస్కర్, ఏటూరునాగారం మండలం స్పెషల్ ఆఫీసర్ రాంపతి, ఏటూరునాగారం, వాజెడ్ ఎంపీడీఓలు శ్రీనివాస్, శ్రీకాంత్, ఎంపీవో కుమార్, ఏటూరునాగారం పంచాయతీ కార్యదర్శి రమాదేవి, ఏటూరునాగారం, వాజెడు పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడబ్ల్యూలు, గజ ఈత గాళ్ళు పాల్గొన్నారు.

ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : మెదక్ జిల్లా వ్యాప్తంగా వినాయక నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగుతోంది. చంద్ర గ్రహణం దృష్టిలో పెట్టుకొని 9 రోజులకే వినాయక నిమజ్జనం చేయాలని నిర్వాహకులు నిర్ణయం తీసుకున్నారు. గురువారం రాత్రి చాలా మండపాల వద్ద ప్రత్యేక పూజల అనంతరం ప్రతిమలను జరిపిన తర్వాత లడ్డూ, నోట్ల దండలు వేలం వేయగా భక్తులు పోటీ పడ్డారు. శుక్రవారం వినాయక ప్రతిమలు కొంటూరులో నిమజ్జనం చేశారు. రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి జ్ఞాపిక అందజేశారు. సాయినగర్ కాలనీ గణేష్ మండలి ఆధ్వర్యంలో రాందాస్ చౌరస్తాలో కాశీ పండితులతో మహా హారతి ఆకట్టుకుంది. నిమజ్జనం ఆదివారం వరకు కొనసాగనుంది. వినాయక శోభయాత్ర, నిమజ్జన కార్యక్రమాలను కలెక్టర్ రాహుల్ రాజ్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో రామాయంపేట, మెదక్ మండలం కొంటూర్ వద్ద వినాయక నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలించారు. ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు వినాయక నిమజ్జనం సందర్భంగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. చెరువులను స్వయంగా పరిశీలించారు. ముఖ్యంగా కోంటూరు నిమజ్జనం పాయింట్‌ను సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

యూనియన్ కొమురయ్య భవన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కొత్తగూడెం : అమరజీవి యూనియన్ కొమురయ్య కార్మిక వర్గానికి నేడు అనుభవిస్తున్న హక్కులు దక్కేవికావని, ఎన్నో త్యాగాల ఫలితంగా సింగరేణి నిలబడ కలిగిందని వక్తలు వెల్లడించారు. శుక్రవారం అమరజీవి కార్మిక నాయకుడు కొమురయ్య 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని బావుల, డిపార్ట్‌మెంట్ల లో, యూనియన్ కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి కార్మికులు ఘన నివాళులర్పించారు. రుద్రంపూర్‌లో కొత్తగా నిర్మించిన కొమురయ్య భవన్‌ను కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, కునంనేని ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు ఏఐటీయూ సీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య కోరిమి రాజ్ కుమార్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషాలు పాల్గొని మాట్లాడారు. 1940లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్‌ను స్థాపించి ఎన్నో పోరాటాలు చేసి అనేక హక్కులను సాధించారని ఒక్కొక్కటిగా వివరించారు. అనాడు కమ్యూనిస్టు నాయకులైన దేవూరి శేషగిరి రావు, మక్దుం మొయినుద్దీన్, రాజ్ బహద్దూర్ గౌర్, కె.ఎల్. మహేంద్ర వంటి యోధులతో కలిసి అనేక ఉద్యమాలు నిర్వహించి, కార్మికుల కోసం ప్రభుత్వంతో పోరాడి అనేక చట్టాలు సాధించారని గుర్తు చేశారు. కొమురయ్య ఒక్క పిలుపు ఇస్తే బొగ్గుబాయిల నుండి ఒక్క బొగ్గు పెల్ల కూడా బయటకు రాకుండా కార్మికులు సమ్మె చేసి సమస్యలను పరిష్కరించుకునేవారని వివరించారు. అయినప్పటికీ తన జీవితమంతా కార్మిక వర్గ పోరాటాలకు అంకితం చేశారన్నారు. నాయకులు మల్లికార్జున్, వంగ వెంకట్, రమణ మూర్తి, వీరాస్వామి, గట్టయ్య, సుధాకర్, రాములు, శేషగిరి రావు, శ్రీనివాస్, నాగేశ్వర రావు, వీరయ్య, హీరాలాల్, హుమాయూన్, మధు కృష్ణ, శ్రీనివాస్ కమల్, ప్రసాద్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు మండలం భూపతి పేట ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇంజపూరి నీరజకు మండల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నిక కావడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ చింతనూరు కృష్ణమూర్తి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు నీరజను ఘనంగా సన్మానించారు. నీరజ గత 23 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో రాణించడం జరుగుతుందని. గ్రామస్తులందరూ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి ఉత్తమ అవార్డులు ఎన్నో అందుకోవాలని కోరుకున్నారు.

8న కలెక్టర్ కార్యాలయ ముట్టడిని విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 8వ తేదీన జరగనున్న కలెక్టర్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ప్రజలను పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడుచర్లలో ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల సమయంలో నాటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12,000 "ఆత్మీయ భరోసా" అందిస్తామని హామీ ఇచ్చినా ఇంతవరకు అమలు కాలేదని గుర్తు చేశారు. మున్సిపల్ కేంద్రాల్లో ఉపాధి హామీ పథకం విస్తరణ, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో కూలీలకు ప్రాధాన్యం, వారి పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య, ఆరోగ్య భరోసా వంటి అంశాలు ఇంకా పెండింగ్లోనే ఉన్నాయని విమర్శించారు. అలాగే ఉపాధి కూలీలకు సంవత్సరానికి కనీసం 200 రోజులు పని కల్పించి రోజుకు రూ.700 వేతనం చెల్లించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధనకై కలెక్టరేట్ ముట్టడిని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం

విశాలాంధ్ర - తుంగతుర్తి : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ ఎర్ర హరికృష్ణ, రిటైర్డ్ ఉద్యోగులు కేతిరెడ్డి రవీందర్ రెడ్డి, కాస మల్లయ్య, తాళ్లపల్లి యాదగిరి, గుజ్జ రామచంద్రయ్య, బందారు రామచంద్రయ్య, అబ్బయ్య, మిట్ట గడుపుల పురుషోత్తం, మహిళా ఉపాధ్యాయురాలు ఎల్లబోయిన కృష్ణవేణి, తాళ్ల పెల్లి, విజయలక్ష్మిలను లయన్స్ క్లబ్ తుంగతుర్తి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పెన్షనర్స్ భవనంలో శుక్రవారం జాలవాలతో ఘనసన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షులుగా లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి మాట్లాడుతూ, సమాజంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేని వర్ణించారు. తుంగతుర్తి లైన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పులుసు వెంకన్న గౌడ్, లయన్స్ క్లబ్ కోశాధికారి గుండ గాని రాము లయన్స్ క్లబ్ సభ్యులు ఓరుగంటి సుభాష్, పులుసు వెంకట నారా యణ, రామాలయ చైర్మన్ ఎనగందుల సంజీవ, గిరిటైలర్స్, వీరబోయిన రాముల యాదవ్, ఎనగందుల శ్రీను, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఈగ నాగన్న, జిల్లా ఉపాధ్యక్షులు బందారు దయాకర్ పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మ దేవాలయంను సందర్శించిన కలెక్టర్

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో: ఎస్ ఎస్ తాడ్వాయి మండలంలోని మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయంను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. శబరిష్, కొత్త మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా గద్దెల ప్రకారం విస్తరణ ప్రణాళికలకు దేవాదాయ శాఖ అధికారులతో పాటు, పోలీస్ అధికారులు భద్రతా ఏర్పాట్లకు అనుగుణంగా స్థలాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎస్పి, శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం ప్రాంతం చుట్టూ కలియ తిరుగుతూ కొత్త మాస్టర్ ప్లాన్ ప్రకారం సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలు వరుస ప్రకారం విస్తరణ ప్రణాళికలు, సమ్మక్క సారలమ్మ తల్లుల దర్శనం కొరకు భక్తులు సౌలభ్యంగా క్యూలైన్‌ల ఏర్పాటు, విఐపి, వివిఐపిల, ఎంట్రీ తదితర అంశాలను క్షుణ్ణంగా చర్చించారు. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి, ములుగు డి.ఎస్.పి రవీందర్, దేవదాయ శాఖ డిఈసి హెచ్ రమేష్ బాబు, సంబంధిత అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య సేవలందిస్తున్న పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పెద్దపల్లి జిల్లా మండలం గోపయ్య పల్లి గ్రామానికి చెందిన దుర్గం మహేందర్ అనే ప్లంబర్ కార్మికుడు ప్లంబింగ్ పని చేస్తూ కట్టర్ వల్ల అతని ఎడమ పాదం తెగిపోయి లోపల నరాలు కూడా తెగి మొత్తం పాదం నుజ్జు నుజ్జు అవడం జరిగిందని. వెంటనే అతనిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. ఇలాంటి గాయం చాల జటిలము, శస్త్ర చికిత్స చేయడం కూడా చాల రిస్క్‌తో కూడుకున్నది. అయినప్పటికి ఎముకల వైద్య నిపుణులు అయినా డా. కె. శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి ఆ పేషెంట్ కు తెగిన నరాలను అతికించి విరిగిన ఎముకలను కూడ అతికించడం జరిగింది. ఇలాంటి అరుదైన కష్టమైన ఆపరేషను మన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేయడం జరిగింది. కావున పెద్దపల్లి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సేవలను వినియోగించుకోవాలి అని అస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ తెలిపారు. అలాగే అరుదైన శస్త్ర చికిత్స చేసిన డా. కె.శ్రీనివాస్ రెడ్డి, డా. కృష్ణ వేణిల వైద్య బృందాన్ని అభినందించడము జరిగింది. అలాగే ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు కూడా వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించడం జరిగిందని తెలిపారు.

మొహమ్మద్ ప్రవక్త (స) ఆశయాల సాధనే లక్ష్యం కావాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : ప్రపంచ సర్వ మానవాళి కోసం ఉద్భవించి మానవ సమాజానికి ఆచరణాత్మకంగా దిశా నిర్దేశం చేసిన మహెూన్నతులు ప్రవక్త మొహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం సమ సమాజ నిర్మాణం, ఆశయాల సాధనే లక్ష్యంగా ప్రతి ముస్లిం కార్య దీక్షలు కావాలని జామే మజిద్ కమిటీ అధ్యక్షులు ఎం డి. ఫయాజ్ ఉల్ హుస్సేన్ పిలుపునిచ్చారు. మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం పాల్వంచ పట్టణలోని జామే మస్జీద్ లో మిలాదున్నభి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక నమాజుల అనంతరం, పట్టణంలో ఉన్న పలు మజీద్‌లకు చెందిన వందలాది మంది ముస్లింలు జామే మజీద్‌కు చేరుకొని జల్సే జులూస్‌లొ పాల్గొన్నారు. పట్టణంలో సుమారు పది కిలోమీటర్ల మేరకు పెద్దఎత్తున జులుసే మొహమ్మది (శాంతి ప్రదర్శన) నిర్వహించారు. జామే మజీద్ మత గురువులైన మౌలానా సర్ఫరాజ్ ఆలం ఖాద్రి ఆధ్వర్యంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, ఇబ్రహీం ల నేతృత్వంలో భారీ శాంతి ప్రదర్శన కొనసాగింది. ఇక్కడి నుంచి ప్రారంభమైన శాంతి ప్రదర్శన శాస్త్రీ రోడ్డు, అప్సరా సెంటర్, రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్, బస్టాండ్, బీసీఎం రోడ్, అంబేద్కర్ సెంటర్, కిన్నెరసాని రోడ్ మీదుగా ప్రదర్శన తిరిగి మజీద్ కు చేరుకుంది. నటరాజ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద ఫయాజ్ మాట్లాడుతూ సుమారు 15 వందల ఏళ్ళ క్రితం మొహమ్మద్ ప్రవక్త ప్రముఖ్యమున్న మక్కలో జన్మించారని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా మాట్లాడుతూ మొహమ్మద్ ప్రవక్త సమాజానికి చేసిన బోధనలు కేవలం ముస్లింలకే పరిమితం కావన్నారు.

సంపాదకీయం

గిల్లి జోల పాడడం

ఎనిమిదేళ్ల కింద మోదీ ప్రభుత్వం అర్ధరాత్రి నిర్వహించిన పార్లమెంటు సమావేశంలో వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) బిల్లు ఆమోదించింది. అప్పుడూ ప్రతిపక్షాలు దీనిని తీవ్రంగా వ్యతిరేకించాయి. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ హయాంలో చాక్లెట్ల మీద కూడా పన్ను వసూలు చేశారన్న వితండ వాదం మోదీ నోట వినిపించింది. ఎనిమిదేళ్లు అసంబద్ధమైన జి.ఎస్.టి. పన్ను ప్రజల గోళ్లు ఊడగొట్టి వసూలు చేసిన తరవాత ఇప్పుడు ఈ వ్యవస్థలో చేసిన సంస్కరణలు ప్రజలకు అపారమైన మేలు చేస్తాయని మోదీ ప్రభుత్వం భారీ ఎత్తున ప్రచారం చేసుకుంటోంది. సంస్కరణల ప్రస్తావన ఇప్పుడు తెచ్చారంటే ఈ వ్యవస్థలో లోపాలున్నాయని ప్రభుత్వానికి అనుభవ రీత్యా రుజువైంది. బుద్ధిమంతులకు ఎప్పుడూ ఆలస్యంగానే జ్ఞానోదయం అవుతుంది. సంస్కరణల పేర ఇప్పుడు 5 శాతం, 12 శాతం జి.ఎస్.టి. విధానం మాత్రమే అమలులో ఉంటుందంటున్నారు. ఇప్పుడు సంస్కరణల స్తోత్రం పఠిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని ఇంతకు ముందు 5, 12, 18, 28 శాతం జి.ఎస్.టి. వడ్డించమని అడిగిందెవరు? జి.ఎస్.టి.వల్ల రాష్ట్రాల ఆదాయాలకు గండి పడింది. రాష్ట్రాలు జి.ఎస్.టి.లో తమ వాటా కేంద్రం నుంచి రాబట్టుకోవడానికి నెలల తరబడి వేచి చూడవలసి వచ్చింది. జి.ఎస్.టి. దెబ్బకు ప్రజల కొనుగోలు శక్తి బాగా క్షీణించింది. ఇప్పుడు రెండే స్లాబులు ఉంటాయి ఇక జనం పండగ చేసుకోవచ్చు అని మోదీ ప్రభుత్వం టముకు వేస్తోంది. మొదట జి.ఎస్.టి.బిల్లును ఆమోదించినప్పుడు నాలుగు స్లాబులు అనవసరం అని ఎంతో మంది చెప్పినా ప్రభుత్వం వినిపించుకోలేదు. ఇప్పుడే అవే సూచనలను అమలు చేసి వాటికి సంస్కరణల రంగు పూయడం ప్రభుత్వ వైఫల్యానికే నిదర్శనం. ఇప్పుడు 5, 18 శాతం అనే రెండు శ్లాబులే ఉంటాయట. దీనివల్ల ప్రజలకు కొంత ఊరట కలగవచ్చు కానీ ఎనిమిదేళ్ల పన్ను భారం మోయాల్సి వచ్చింది. ఈ నష్టాన్ని ఎవరు పూరిస్తారు? ప్రభుత్వం ఏ హామీ ఇవ్వలేదు. అసంబద్ధమైన జి.ఎస్.టి.అమలు చేసిన ప్రభుత్వం దీనివల్ల ఏం సాధించిందో మాత్రం చెప్పదు. కానీ తాము అధికారంలోకి రాక ముందు గత చరిత్రను తవ్వి పోసి విలోమ వాదనలకు పదును పెడ్తుంటారు. ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి వస్తాయి. దసరా, దీపావళి పండగలను దృష్టిలో ఉంచుకునే మోదీ ప్రభుత్వం ఈ తేదీ నిర్ణయించి ఉంటుంది. ఇదివరకు కూడా 18 శాతం స్లాబు నుంచే అత్యధిక ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ఇప్పుడూ ఆ 18 శాతం స్లాబు కొనసాగుతుంది కనక ప్రభుత్వ ఆదాయానికి ఉండే లోటు తక్కువే. ఒక వేళ అలాంటి లోటు ఏదైనా ఉందనుకున్నా అది ఎంత మేర ఉంటుందో ప్రభుత్వం చెప్పదు. ఎందుకంటే ఆ లోటు లెక్కలోది కాదు. విద్యార్థులు ఉపయోగించే పెన్సిళ్లు, కలాలు, రబ్బర్లపై పన్ను విధించి ఇప్పుడు సంస్కరిస్తున్నాం అనడం ప్రభుత్వం తన తప్పును గుర్తించినట్టు కాదు. విమర్శల ధాటికి తట్టుకోలేక ఈ పనిచేసి ఉంటుంది. ఆరోగ్య, జీవిత బీమాపై జి.ఎస్.టి. మునుపున్న 18 శాతం సుంకాన్ని మొత్తంగా ఎత్తేసినా ఆ ప్రయోజనం ప్రజలకు అందుతుందన్న భరోసా లేదు. ఆసుపత్రులు, బీమా కంపెనీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిందే. ఇదివరకు ఉన్న జి.ఎస్.టి. తగ్గడంవల్ల వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక వర్గాలకు కలిగే ప్రయోజనాన్ని ప్రజలకు "బదిలీ" చేయాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ ఆ వర్గాలకు విజ్ఞప్తి చేశారట. ఆదేశించలేదు అనేది ఇక్కడ ప్రత్యేకంగా గమనించవలసిన అంశం. అంటే ఆ వర్గాలు దయతలిస్తే ప్రజలకు ప్రయోజనం అందుతుంది. లేకపోతే లేదు. రాష్ట్రాల ప్రభుత్వాలు, ముఖ్యంగా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు జి.ఎస్.టి. భారంపై ముందు నుంచి ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఈ అంశంపై చేశామంటున్న సంస్కరణల్లో ఆ ప్రస్తావనే ఉన్నట్టు లేదు.

ప్రతిపక్షాలు ఇంతకాలంగా లేవనెత్తుతున్న అంశాలలో కొన్నింటినైనా మోదీ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం మంచిదే కాని. తప్పు ఒప్పుకునే తత్వం ఈ ప్రభుత్వానికి ఏ కోశానా లేదు. ఉదాహరణకు ఒక్క ఆరోగ్య బీమా రంగాలపై జి.ఎస్.టి.ఎత్తి వేయడంవల్ల ఏ మాత్రం ప్రయోజనం ఉంటుందో వివేచించి చూస్తే పరిస్థితి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. ఆరోగ్య బీమాపై భారీగా జి.ఎస్.టి. వడ్డించినందువల్ల ప్రభుత్వానికి ఇప్పటికే 24, 500 కోట్ల ఆదాయం సమకూర్చింది. ప్రస్తుతం ఆరోగ్య బీమాపై జి.ఎస్.టి. మొత్తంగా తొలగించారు. అయితే జనాభాలో ఎంత శాతం మందికి ఆరోగ్య బీమా తీసుకునే స్తోమత ఉందిగనక! ఆరోగ్య బీమాపై జి.ఎస్.టి. తగ్గించినందువల్ల బీమా ప్రీమియం ఏమైనా తగ్గే అవకాశం ఉందా అంటే దానికి నికరమైన సమాధానం లేదు. ఎందుకంటే ప్రజారోగ్య బాధ్యత నుంచి ప్రభుత్వం క్రమంగా తప్పుకుంటోంది. ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిని మెరుగు పరచడానికి ఇప్పటిదాకా చేసింది ఏమీ లేదు. ప్రైవేట్ ఆసుపత్రుల వ్యాపారం మాత్రం జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స సవ్యంగా ఉంటుందన్న నమ్మకం ప్రజలకు లేకుండా పోయింది. అంత మాత్రాన ప్రైవేటు ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్స అందుతుందని చెప్పలేం. ప్రభుత్వ ఆసుపత్రులలో సవ్యమైనవి లేకపోలేదు. కానీ వాటి నిర్వహణా బాధ్యతను ప్రభుత్వం విస్మరిస్తోంది. దానివల్ల వాటి పరిస్థితి మరింత కుంగి పోతోంది. ఆరోగ్య బీమాపై జి.ఎస్.టి. తొలగించారు కనక ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సా వ్యయం తగ్గుతుందని చెప్పలేం. ఇప్పటికే అనేక ప్రైవేటు ఆసుపత్రులు చికిత్సకు అయ్యే ఖర్చును పెంచేశాయి. అదీగాక ఇక మీదట నగదు రహిత చికిత్స అందుబాటులో ఉండదని ప్రైవేటు ఆసుపత్రులు ఒకటి తరవాత మరొకటి ప్రకటిస్తున్నాయి. అంటే మొదట జనం తమ చేతినుంచి డబ్బు ఖర్చు పెట్టి తరవాత బీమా కంపెనీల నుంచి తిరిగి రాబట్టుకోవాలి. అప్పుడు బీమా కంపెనీలు ఎన్ని రకాల షరతులు పెడ్తాయో, వంకలు పెడ్తాయో అందరికీ అనుభవంలో ఉన్నదే. ఆసుపత్రులకు, బీమా కంపెనీలకు మధ్య వివాదం తలెత్తితే పరిస్థితి మరింత దుర్భరం అవుతుంది. ఆసుపత్రిలో ఉన్న రోగికి ఒక్క రోజు పాటైనా బీమా సదుపాయం వర్తించకపోతే పరిస్థితి ఎంత విషమంగా ఉంటుందో సులభంగానే ఊహించుకోవచ్చు. బజాజ్ అలయంజ్ సంస్థ దగ్గర ఆరోగ్య బీమా తీసుకున్న వారికి సెప్టెంబర్ ఒకటి నుంచి నగదు రహిత చికిత్స ఉండదని ఆసుపత్రుల సంఘం ఇప్పటికే తేల్చి చెప్పింది. అంతకన్నా ఘోరం ఏమిటంటే హర్యానాలో 600 ఆసుపత్రులు ఆయుష్మాన్ భారత్ పథకం నుంచి బయటకు వచ్చేశాయి. అదేమంటే ప్రభుత్వం నుంచి డబ్బు రావడం లేదంటున్నాయి. బీమా చేయించుకోలేని వారి ఆరోగ్యానికి రక్షణ ఎక్కడి నుంచి వస్తుంది. బీమా కంపెనీలు వసూలు చేసే ప్రీమియం కేవలం జి.ఎస్.టి. మీద ఆధారపడి కాదు. జి.ఎస్.టి. సంస్కరణలు చివరికి గిల్లి జోలపాడినట్టే ఉన్నాయి.

48 గంటలు... దీర్ఘాయుష్మాన్ భవ...

నిర్జీవ... నిర్నిద్ర...నిరాపేక్ష.. నిరాకార.. నిర్వేద...నిశ్శరీర... నిర్భాగ్య రోజులు ఎప్పుడైనా కలగంటామా..! ఆ రోజుల్ని తలచుకుంటూ అవశేష జీవితాన్ని మోస్తూ నిర్వికల్ప సమాధిలోనే మిగిలిపోతామా...! ఆ సంక్షిప్త జీవితానికి అంతం దొరకదా అని గాజు పెంకులతో పరదా కట్టుకుంటాం కదా. ఆ గాజుబుడ్లన్నీ నీవైపే చూస్తూ ఉంటాయి... నీ లోతు దానికి ప్రతి నిత్యం తెలుస్తూనే ఉంటుంది. దాని లోతు తెలుసుకుందుకే నానాటికీ ఆ ఊబిలో దిగపడిపోతూ ఉంటాం. అలసిన కన్నులనుకుంటాం. అరచేయంత గాజు సీసాని పగలకొడతాం. ఆ రాత్రికి ఐదు అడుగుల తొమ్మిది అంగుళాల పొడవు, సమస్త అవయవాలు అతికించిన ఓ దేహం కొన్ని గంటల పాటు పార్థీవం అవుతుంది. అంతవరకూ నువ్వా నీ శరీరాన్ని గాండీవం అనుకుంటావు కదా. కెంజారపు చందురుడు చుక్కల చేతులు పట్టుకుని నీ నెత్తిమీద ఊరేగడానికి బయలుదేరతాడు. నీ లోలోపల భయం కూడా అతడ్ని ఓడించేందుకు భువిపై పరుగులు తీస్తూంటుంది. ఇలా నిత్యం జరుగుతూనే ఉంటుంది. భళ్లున తెల్లారుతుంది. నీ బతుకు మాత్రం తెల్లారకుండా కాల్గెట్ పేస్ట్ అవుతుంది. ఆ పెద్దాయన అజంతా అన్నట్లు శరీరం మీద శరీరాన్ని తొడుక్కుని అబద్దాలని జేబులో నింపుకుని సూర్యుడి వేలు పట్టుకుని అతని వెంట రికామీగా తిరుగుతూంటావు. పంచభూతాలకు ఆత్మలుండవు. అవి నీ ఆత్మ చుట్టూనే

చక్రవాకం

- ముక్కామల చక్రధర్

పరిభ్రమిస్తూంటాయి. ఇలా కొన్నేళ్లు తిరిగాక నీకు విసుగేస్తుంది. నీకు అసహ్యం వేస్తుంది. నీకు కోపం వస్తుంది. నీకు చిరాకు కలుగుతుంది. నీకు ఆకాశం మీద ఉమ్మేసి అది నీ మీదే పడితే బాగుండునని అనిపిస్తుంది. ఇంట్లో అద్దం వెక్కిరించదు. నిన్ను నీలా చూపిస్తుంది. జడుసుకోవు. బెంబేలెత్తిపోవు. జావగారిపోతావంతే. ఇలా మిగిలానా.. ఇలా ఈడుస్తున్నానా... ఇలా వెక్కిరించుకుంటున్నానా... ఇలా వెళ్లిపోతానా అని కోటీ తొంభై లక్షల తొంభై వేల తొమ్మిది వందల తొంభై తొమ్మిది సార్లు అనిపిస్తుంది. చిన్నప్పటి నుంచి బాటా చెప్పులే కదా.. అందుకే ఆ లెక్క చటుక్కుని గుర్తొచ్చి ఆ చెప్పు కోసం వెతుక్కుంటావు. దాని నిండా నీ జీవితంలాగే చిరుగులుంటాయి. ముఖాన్ని గోడకు కొట్టుకుందామనుకుంటావు కానీ గోడ కూడా అసహ్యించుకుని దూరం జరుగుతుంది. అదిగో... ఆ సమయంలోనే... సరిగ్గా అలాంటి నీచ స్థితిలోనే...'రెండు రోజులుందురు గాని...రండి... అంతే... 48 గంటలు మాత్రమే. కాసింత సేద తీరుదురుగాని. ఏం చేయద్దు. నాకూ సెలవులే. కబుర్లు చెప్పుకుందాం" అని శ్యామ్‌సంగ్ ఫోన్ పిలుస్తుంది. "అంటే... అదీ..." అంటూ సాగని బతుకులా మాట కూడా సాగదు. "అవన్నీ కాదు. రండి. తమ్ముడి ఇంటికేగా. వస్తున్నారు" అంటూ శ్యామ్‌సంగ్ గొంతు ఆపేస్తుంది. ఉదయాన్నే... మళ్లీ "ఎన్నింటికి బయలుదేరుతున్నారు. భోజనాలేకి రండి. కలిసి తిందాం. అంతవరకూ నేనూ తినను" అంటూ ఓ పొట్టి సమాచారం వాట్సాప్‌లో. పైన చూద్దుం కదా... తమ్ముడు అని దాచుకున్న నంబర్. కదులుతాం. హైవే కదా... "స్పీడ్ థ్రిల్స్... బట్ కిల్స్" అని ఎక్కడికక్కడ బోర్డులు. అవి చూసాక "స్పీడు కాదురా నాయనా... బతుకు స్లో... అదియునూ కిల్స్" అనిపిస్తుంది. కుడికాలు కింద ఎక్సలేటర్ నలిగిపోతూండగా... అక్కడక్కడా ప్రభుత్వం "తోలు" వొలిచేస్తున్నా పెద్దగా పట్టింపు ఉండదు. మేఘాల మీద అసహ్యం. అందుకే ఆఘరోడ్డు మీద పర్వులు పెడతాం. ఆ దరికి చేరుకుంటామా...వాళ్లని చూస్తామా. దుర్యోధనుడు వెర్రి వాడు... తన తొడలకు ఆ లేపనం పూసుకోకుండా అసక్తుడయ్యాడు. మనమే కాదు... వాళ్లు కూడా ప్రేమ లేపనంతో సిద్ధంగా ఉంటారు. ఉడుకుడుకు నీళ్లతో తలపై చివరి వెంట్రుక నుంచి అరికాలి చిటికెల వేలు వరకూ ప్రేమ లేపనం పూస్తారు. అంతకు ముందు తిప్పిన స్టీలు కుళాయిలే... కన్నీరు కార్చేవి. ఇప్పుడూ అవే స్టీలు చక్రాలు... కుడివైపు తిప్పితే వేడి ప్రేమలు... మరో చక్రాన్ని ఎడమ వైపు తిప్పితే చల్లని భరోసాలు. ఈ జుగల్‌బందీ ప్రేమ పన్నీటిలో తానమడతాం. అంతకు ముందు చుక్కలతో వెక్కిరించిన చందురుడు అసూయతో ప్లేటులో వొత్తిగిల్లి పడుకునుంటాడు. ఆ ప్రేమకు పప్పులు పచ్చడైపోయి మన కన్నీటితో తడిసి కంచం మసకబారుతుంది. ఇంతకు ముందు ఎన్నిసార్లు తినలేదు. అయినా... ఆ రోజు ఆ ఇడ్లెన్లు యుద్ధం గెలిపించిన సైనికుల్లా తలలెగరేస్తూ కనిపిస్తాయి. "ఇంతే ఈ రెండే.. ఈ రెండూ తినండి. మళ్లీ వేయను" అంటూ గాజులు బతిమిలాడతాయి. నిజం చెప్పద్దూ... ఆ గాజులకి సాష్టాంగ ప్రణామాలు చేయాలనిపిస్తుంది. "బలే వారే అన్నగారు. రెండంటే రెండే తినండి. ఇదిగో నేనూ తింటున్నాను" అని వేళ్ల మీద మొలిచిన వెంట్రుకలు అంటూంటే..."అప్పటికప్పుడు చచ్చిపోయి ఈ దంపతులకు పుడితే బాగుండురా" అని కన్నీళ్లు మనసుకు మాత్రమే చెబుతాయి. సంవత్సరాలుగా ఆనకట్ట లేక తెగని గోదావరి లోలోపల సుడులు తిరుగుతూంటే..."ఈ వర్షాలకి గోదారి మాంచి ఊపు మీదుంది. వెళ్దాం రండి. హాయిగా తిరిగినట్టు ఉంటుంది" అని ఆహ్వానిస్తే... గుండెల్లో గోదారినీ అందులో కలిపేద్దామని వాళ్లతో వెళ్తామా... అక్కడికి వెళ్లాక ఆ నదీమ తల్లిని చూసాక అదేంటో... గుండె భారం దిగిపోతుంది. అది అఖండ గోదావరిని చూసినందుకు అనుకుంటామా... కానే కాదు... "పెదనాన్న గారూ... ఇన్ని నీళ్లు చూస్తే బలే బాగుంది కదా... అసలెక్కడి నుంచి వస్తాయి అన్నేసి నీళ్లు" అని ఓసారి... "అసలు ఈ ఆనకట్టలు ఎవరు వేసారు" అని మరోసారి నా చేతి వేళ్లలో తన చేతి వేళ్లు జొప్పించి అడుగుతున్న ఆ బాలుడ్ని చూసాక తెలిసొచ్చి వాడు మన చేతిని వదలకుండా గట్టిగా పట్టుకుంటాం చూడండి అప్పుడు ఈ గుండె భారం దిగిపోతుంది. "నువ్వు వొస్తున్నావని చిలక చీటీ తెచ్చిందిలే... మైనా మాట మోసుకొచ్చిందిలే" అని శివసాగర్‌ని ఆ ఆదివాసీ అమ్మాయి అడిగినట్లుగా... నాకిష్టమైన బీరకాయ కూరని వడ్డిస్తూంటే మాత్రం... "పట్టణాల్లో బందీలైన ప్రేమవాసీలు వీళ్లు" అనిపించింది. వీళ్లతో కలిసి త్రీడీలో నారసింహ అవతారాన్ని చూసామని భ్రమలు పోతాం కదా...! నిజానికి వీళ్లు అచ్చమైన మానవావతారాలని రెండు గంటల సైన్మా తర్వాత తెలుసుకుంటాం. రెండు రోజులు... 48 గంటలు... 2880 నిమిషాలు... లక్షా 72 వేల 800 సెకన్లు ఒక్క క్షణంలో గడిచిపోతుంది. ఇక బయలుదేరాలి కదా... ఎవరి గూట్లోకి ఆ పక్షులు చేరాలి కదా... ఏడుపు రాదు. దుఃఖం పొంగిపొర్లదు. వెళ్లిపోవాలా అనే వేదన ఉండదు. వెళ్తున్నాం. బతకడం కోసం కాదు... జీవించడం కోసం... యుద్ధం కోసం కాదు.. శాంతి కోసం... హృదయానికి పట్టిన మకిలిని వదిలించుకుని గుండెలు పొంగుతూండగా... ఈ 48 గంటలు ఇచ్చిన ధైర్యం చేయి పట్టుకుని పోరాడేందుకు వెళ్తున్నాం. ఈ పోరాటం కత్తులతో కాదు.... హృదయ కవాటాలతో...

సెల్: 99120 19929

జౌళి పరిశ్రమపై అమెరికా సుంకం సమ్మెట

రాజన్ క్షీరసాగర్
అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు

అమెరికా జౌళి ఉత్పత్తుల దిగుమతులపై 50శాతం సుంకాన్ని విధించింది. ఇది 2025 ఆగస్టు 27వ తేదీ నుంచి అమలవుతోంది. దాదాపు 48 బిలియన్ డాలర్ల విలువైన జౌళి ఉత్పత్తులపైన సుంకం దెబ్బతగులుతుంది. భారతదేశం నుంచి అమెరికాకు భారతదేశం జౌళి ఉత్పత్తుల మొత్తం ఎగుమతుల్లో 6శాతం మాత్రమే ఎగుమతి అవుతుంది. జౌళి పరిశ్రమలో ఎగుమతులు 1.5శాతం మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎగుమతుల తరహా విధానపై ఆధారపడకుండా దేశీయ ఆర్థికవ్యవస్థను పటిష్ట పరచేదిగా ఉండాలి.

దేశం స్వాతంత్ర్య పోరాటంలో పత్తి నుంచి దారం వడికేవారు. దాని నుంచి వస్త్రాలను ఉత్పత్తి చేసేవారు. నూలు వడికే రాట్నాన్ని స్వాతంత్ర్యపోరాటంలో మహాత్మాగాంధీ ఒక పోరాట చిహ్నంగా ప్రచారంగా రూపొందించారు. మిల్లు కార్మికులు పత్తి నుంచి తీసిదాన్ని వస్త్రంగా తయారు చేస్తారు. ఆనాడు ఐక్య మహారాష్ట్రలో బట్టలు నేసేవారు. స్వాతంత్ర్య పోరాటానికి ఆద్యులయ్యారు. ఇదే పత్తిని కొనుగోలు చేయడంలో జరిగే దోపిడీని నివారించడానికి రైతులు నిరసన ప్రదర్శనలు జరిపారు. చివరకు బ్రిటీష్ ప్రభుత్వంపై ఒత్తిడిచేసి మొదటిసారిగా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీని ఏర్పాటు చేయించారు. స్వాతంత్ర్య సిద్ధించిన తర్వాత పత్తి ఆధిపత్య స్కీమును ఏర్పాటు చేయడానికి మహారాష్ట్ర అంగీకరించింది. అయితే ప్రపంచీకరణ దశలో ఇదే పత్తి ఉత్పత్తిచేసే రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. దీంతో పత్తిని పండించే రైతులలో చాలామంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కాటన్ దిగుమతులు పెరగడంవల్ల పత్తి పండించే రైతులు ఎలాంటి సమస్యలతో ఎలాంటి సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వస్తుందన్నది పెద్దప్రశ్న అయింది. అప్పుడే కేంద్రప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 11శాతం ఉండగా దాన్నిపూర్తిగా రద్దు చేసింది.

పత్తిపంట గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆర్థిక ఊతం. పత్తి పంట ప్రత్యక్షంగా 60 లక్షల మందికి, పరోక్షంగా నాలుగు కోట్ల మందికి ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ 4కోట్ల మందిలో ప్రాసెసింగ్, వ్యాపారం, జౌళి పరిశ్రమల యజమానులు, వీటిలో పనిచేసేవారు ఉన్నారు. ప్రపంచంలో పత్తిపంటలో 25శాతం భారతదేశం పండిస్తుంది. 120.55 లక్షల హెక్టార్ల పొలాల్లో ప్రపంచంలో పత్తి పండించే ప్రాంతంలో 36శాతం ఉంటుంది. ప్రపంచంలో అత్యధికంగా పత్తి పండించేది భారతదేశం. ప్రభుత్వ విధానాన్ని నిర్లక్ష్యం చేయడం, మార్కెట్ వైఫల్యాన్ని భారత దేశ పత్తి రైతులు ఎదుర్కొంటూ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నారు. 11శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయడం తప్పితే మరేమీ రైతులకు ప్రయోజనం కల్పించలేదు. అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలకు, పారిశ్రామిక ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ రైతులను పట్టించుకోవడం లేదు. పత్తి ఎక్కువగా పండించే ప్రాంతాల్లో మరట్వాడా, విదర్భ రైతుల ఆత్మహత్యలు పరిమితిలేకుండా ఎక్కువగా ఉన్నాయి. పత్తి ఉత్పత్తి రైతులలో సంక్షోభం చాలా తీవ్రతరంగా ఉంటుంది. మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు కమిటీ పత్తి "చంపే పంట" పత్తి పండించడంలో ఎక్కువమంది రైతుల ఆత్మహత్య కేసులు ఉన్నాయి. ఈ పరిస్థితికి కారణాలేమిటనేది విశ్లేషిద్దాం.

ఈ పరిస్థితికి వ్యతిరేకంగా తీసుకునే చర్యలు రైతుల మనుగడకు ముప్పు కలిగిస్తున్నది. రైతులు చేసే డిమాండ్లను, భవిష్యత్తులో కలిగే నష్టాన్ని నివారించడానికి విధానపరమైన మార్పులను తీసుకోవడం అవసరం. తద్వారా ఇండియా సార్వభౌమత్వం, రైతుల జీవనభృతికి లోటులేకుండా ఉండే పరిస్థితి లేదు.

23రకాల వ్యవసాయ ఉత్పత్తులకు కనీసమద్దతు ధరను (ఎమ్ఎస్‌పీ) కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పద్ధతి ఎమ్ఎస్‌పీని నిర్ణయిస్తుంది. వాస్తవ ఉత్పత్తి, వాటి వ్యయం + 50శాతం లాభాల మార్జిన్‌ను (సీ2+50శాతం) ఫార్ములా జాతీయ రైతుల కమిషన్ చైర్మన్ (స్వామినాథన్ కమిషన్) స్వామినాథన్ సిఫారసు చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలకు ఇండియాలో రైతు ఉద్యమం డిమాండ్ చేసింది. 2021 డిసెంబరు 9న ఆందోళనకారులతో కేంద్ర ప్రభుత్వం కమిషన్ ప్రకటించిన ధరతో రాతపూర్వక హామీని ప్రభుత్వం ఇచ్చింది. ఈ కమిషన్ 23 సమావేశాలను నిర్వహించిందేకానీ ఎలాంటి చర్య ప్రకటించలేదు. రైతుల హక్కులను చట్టబద్ధం చేయకుండా ప్రభుత్వం తప్పించుకుంది. ఫలితంగా రైతులకు ఏ మాత్రం స్థిరత్వం, భద్రత లేకుండాపోయింది. మార్కెట్ ధరలలో ఎగుడు, దిగుడులలో ఉండకతప్పదని రైతులు భావించారు. ప్రభుత్వవర్గాల సమాచారం ఆధారంగా, ఎమ్ఎస్‌పీ మధ్యతరహా పత్తికి 2025-26 సంవత్సరానికి క్వింటాలుకి రూ.7,710లను ప్రకటించింది. అయితే పత్తిపంట పండించిన రైతులకు క్వింటాలుకు రూ.2,360లు తక్కువగా ఉంది. ఈ నష్టాన్ని రైతులు భరించితీరాలి. దేశవ్యాప్తంగా రైతులు చేసిన ఉత్పత్తికి రూ.2024-25లో సీసీఐ 52.5లక్షల మెట్రిక్ టన్నులను ప్రభుత్వం కొనుగోలు చేసింది. 2024-25లో జరిగిన ఉత్పత్తికి రైతులకు నష్టం వచ్చింది. 52,500,000 క్వింటాళ్ల పత్తికి క్వింటాలుకు రూ.2365లు అమ్ముడైంది. అంటే మొత్తం రూ.124,162,500,000 ఆదాయం (రూ.12,416.25కోట్లు) లభించింది. ఈ నష్టాన్ని రైతులు భరించారు. మొత్తం పత్తి ఉత్పత్తిలో ఇది 34శాతమే. ఇతర రైతులు తమ పత్తి ఉత్పత్తిని ప్రభుత్వం కొనుగోలుచేసిన రేటుకంటే తక్కువ రేటుకు అమ్మడమైంది. పత్తి ఉత్పత్తిని విక్రయించడానికి సీ2+50శాతం ఫార్ములాను అమలు చేయలేదు. ఒకవేళ ఎమ్ఎస్‌పీ రేటు వచ్చినట్లయితే రైతులకు స్థిరంగా రూ.36,518.38కోట్లు కంటే ఎక్కువగా లభిస్తుంది. ముడిఉత్పత్తి బట్టి ఉత్పత్తి 154.41లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తి ఆధారంగా పైన పేర్కొన్న ఆదాయం లభించింది. (కేంద్ర ప్రభుత్వ పత్రిక ప్రకటనను 2025 ఏప్రిల్ 8వ తేదీన విడుదల చేసింది. సీసీఐ 2024-25 సీజన్‌లో 52.5లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని కేంద్ర కొనుగోలు చేసింది. మొత్తం పత్తి ఉత్పత్తిలో 34శాతం).

ఎమ్ఎస్‌పీ, పత్తి ఉత్పత్తులకు సిఫారసు చేసిన సీ2+50శాతం ధరకు మధ్య తేడా ఎంతగానో ఉందని పైన పేర్కొన్న వివరాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పద్ధతి ప్రకారం, ఏ2+ఎఫ్ఎల్ ఆధారంగా ఎమ్ఎస్‌పీ ధర రైతులకు ఏమాత్రం న్యాయమైంది కాదు. ఎమ్ఎస్‌పీ ప్రకారం, రైతులు పండించిన మొత్తం పత్తి ధరకు వాస్తవంగా మార్కెట్‌లో విక్రయించే ధరకు చాలా తేడా ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో సగటు ధర రూ.5500 నుంచి రూ.66,500 వరకు లభిస్తున్నది. 2024-25లో క్వింటాలుకు రూ.6000లు లభించినప్పటికీ ఆ సంవత్సరం రూ.36,903 కోట్లు నష్టం వస్తుంది. గత 11ఏళ్ల కాలంలో పత్తిని పండించే రైతులకు భారీగా నష్టం వచ్చింది. హెక్టారుకు రూ.2024-25లో నష్టం రూ.33వేలు వచ్చింది. మోదీ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఏడాదికి రూ.6000లు ఇస్తున్నామని తనసుతాను పొగుడుకుంటారు.

కేంద్ర ప్రభుత్వం స్వామినాథన్ కమిషన్‌ను అమలు చేసినట్లయితే ప్రతి పత్తి పండించే రైతుకు వార్షిక ఆదాయం రూ.25వేలు హెక్టారుకు లభిస్తుంది. అయితే ప్రధాని కిసాన్ నిధి రూ.6000 ఇచ్చినందువల్ల ఏ ప్రయోజనం ఉండదు. దిగుమతి సుంకాన్ని రద్దు చేసినట్లయితే వచ్చే పరిణామాలను చూద్దాం. 2025 ఆగస్టు 19న 11శాతం పత్తికి దిగుమతి సుంకాన్ని రద్దుచేయడం విధ్వంసకర విధానం అవుతుంది. సెప్టెంబరు చివరి వరకు మాత్రమే ప్రాథమికంగా ప్రకటించిన సుంకం రద్దు కేవలం సెప్టెంబరు వరకే అమలవుతుంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగస్టు 27న దిగుమతి సుంకాన్ని 50శాతం పెంచారు. ఈ నిర్ణయాన్ని డిసెంబరు 31వరకు అమలు చేయాలి. ట్రంప్ ఆగస్టు 28న మరొకసారి ప్రకటించారు. దేశీయ పత్తి రైతులపైన ఈ ప్రభావం విధ్వంసకరంగా ఉంటుంది. నూతన పత్తి చేతికివచ్చే సమయానికిముందే ట్రంప్ నిర్ణయం ప్రకటించారు. ఇది ఇండియన్ మార్కెట్‌లో సబ్సిడీ ఇచ్చే పత్తి అవుతుంది. ప్రత్యేకించి అమెరికా పత్తికి సబ్సిడీని ఎక్కువగా ఇస్తారు. దిగుమతి చేసుకునే అమెరికా పత్తి బహుశ: తక్కువ ధరలకు అంటే 20-25శాతం లభిస్తుంది. అమెరికాలో అక్కడి ప్రభుత్వం పత్తి పండించే రైతులకు అత్యధిక సబ్సిడీలు ఇవ్వడం వలన రైతులు స్థిరంగా ఉండి ప్రతి ఏటా పత్తిని పండిస్తున్నారు. ఫలితంగా అమెరికా రైతులు ప్రపంచ మార్కెట్‌లో కూడా ప్రవేశిస్తున్నారు. దీనివల్ల ఏ మాత్రం ప్రయోజనం కలగని పోటీని సృష్టిస్తున్నారు. 1995-2020 మధ్య కాలంలో అమెరికా ప్రభుత్వం పత్తి రైతులకు రూ.3,52,880 కోట్లు సబ్సిడీలు అమెరికా ప్రభుత్వం అందచేసింది. 2024లోనే అమెరికా ప్రభుత్వం 81.840 కోట్లు రైతుకు లభించింది. ఫలితంగా ప్రభుత్వం ప్రకటించే సబ్సిడీలు అమెరికా పత్తి రైతులు తక్కువ ధరకు కూడా అమ్ముకోగలుగుతున్నారు. దీనివల్ల అక్కడి రైతులు ఇండియా మార్కెట్‌ను కూడా స్వాధీనం చేసుకునే అవకాశం ఉన్నది. అక్కడ పత్తి ఉత్పత్తి ఆర్థికంగా కూడా రైతుకు ప్రయోజనం కలిగిస్తుంది. వచ్చే శతాబ్దిలోనూ సబ్సిడీలు ఇచ్చి రైతులకు ఎక్కువ ఆదాయం లభించే మాదిరిగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. సబ్సిడీలు కూడా 5.29లక్షల కోట్లు సబ్సిడీలు అమలు జరపనున్నారు. అయితే ఇండియా ప్రభుత్వం అమలుచేసే పద్ధతి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాన్ని అమలు చేస్తుందని చెప్పాలి. నూతన సీజన్‌లో మార్కెట్‌కువచ్చే పత్తికి ప్రకటించిన సబ్సిడీ కనీసం రైతు ప్రతినిధులతో లేదా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండా ప్రకటించారు. ఇది రైతు ప్రయోజనాలకైనా దాడిచేయడమే అవుతుంది.

న్యాయ విరుద్ధమైన విధానం నుంచి పత్తి రైతులను విముక్తి చేయాలంటే కార్మిక సంఘాలు, రైతు సంఘాలు కలిసి ఈ డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై వత్తిడిచేసి సాధించాలి. గుత్త కార్పొరేట్ కంపెనీలు జౌళి పరిశ్రమలోనూ, వాణిజ్యంలోనూ ప్రోత్సాహకాలను అందిస్తామని ప్రకటించడం పత్తి రైతులను నాశనం చేసినట్లే అవుతుంది. అందువల్ల కేంద్రం ప్రోత్సాహకాలపేరుతో చౌక ధరలకు పత్తి దిగుమతులను అనుమతించరాదు.

సెల్: 9860488860

లులూ మాల్ వద్దు - సైన్సు సిటీ ముద్దు



డాక్టర్ సి ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

ప్రజలు ఎన్నుకున్న ఏ ప్రభుత్వమైనా ప్రజల కోసం పని చేయాలి. ప్రభుత్వానికి చెందిన ఆస్తులన్నీ ప్రజలకు చెందినవేనని గుర్తించాలి. ప్రజల ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడే ధర్మకర్త పాత్ర ప్రభుత్వానిది. అయితే మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ప్రజల కోసం వినియోగించాల్సిన అత్యంత విలువైన ప్రభుత్వ భూములను ఇష్టానుసారం తమకు అనుకూలమైన ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం నేడు పరిపాటిగా మారింది. ఈ చర్యల్లో భాగంగానే రాష్ట్రంలో అత్యంత కీలకమైన విశాఖ నగరంలోని బీచ్‌రోడ్డులో ఉన్న 13.74 ఎకరాల భూమిని ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా ఏకపక్షంగా లులూ అనే అంతర్జాతీయ కార్పోరేట్ వ్యాపార సంస్థకు దారాదత్తం చేస్తూ నిర్ణయం తీసుకున్నది. లులూ అనేది ఒక ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్. అబుదాబీ కేంద్రంగా పని చేస్తున్న ఆ సంస్థ వేల కోట్ల వ్యాపారాలు సాగించే ప్రైవేటు సంస్థ. ఆ లులూ సంస్థకు విశాఖ నగరంలోని వాల్తేరు హార్బర్ పార్కు వద్ద ఆర్కే బీచ్ ఎదురుగా ఉన్న సుమారు రూ.3500 కోట్ల విలువైన 13.74 ఎకరాల భూమిని 99 సంవత్సరాల పాటు లీజుకు అంటే (శాశ్వతంగానే అనుకోవాలి) ఇస్తూ ఏపీ పరిశ్రమల శాఖ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జీవో ప్రకారం లులూ సంస్థ మొదటి మూడు సంవత్సరాలు ప్రభుత్వానికి ఎటువంటి లీజు చెల్లించాల్సిన పనిలేదు. నిర్మాణం పూర్తయిన తర్వాత నుంచి చదరపు అడుగుకు ఏడాదికి కేవలం రూపాయిన్నర మాత్రమే లీజు చెల్లించేలా నిబంధనలు రూపొందించారు. ఈ లెక్కన ప్రభుత్వానికి సంవత్సరానికి వచ్చే లీజు ద్వారా వచ్చే సొమ్ము కేవలం రూ. 4.51 కోట్లు మాత్రమే. ఇది ప్రజల సొమ్మును అప్పనంగా లులూకు దోచిపెట్టడమే అవుతుంది.

నిజానికి ప్రభుత్వపు అవసరాలు, ప్రజల అవసరాలకు భూములను వినియోగించుకునేందుకు, అమ్మే హక్కు ప్రభుత్వాలకు ఉంటుంది. అయితే ఆ విషయంలోనూ అనేక నియమ నిబంధనలు ఉన్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ భూమిని అభివృద్ధి చేయాలన్నా, లేక విక్రయించాలనుకున్నా ముందుగా టెండర్లను ఆహ్వానించాలి, వేలం వేయడం ద్వారా ప్రభుత్వానికి అధికంగా ఆదాయం కల్పించే వారికి ఆ భూములను అప్పగించవచ్చు. విశాఖ నగరంలో లులూకు కేటాయించిన భూమి విషయంలో ఈ ప్రక్రియకు స్వస్తి పలికారు. ప్రభుత్వ పెద్దల తుది నిర్ణయమే ఆదేశంగా అధికారులు భూమిని కేటాయించేశారు. 2018 లోనే అప్పటి చంద్రబాబు ప్రభుత్వం లులూ సంస్థకు ఈ భూమిని కేటాయించగా వారు ఎటువంటి పనులు ప్రారంభించలేదు. తదుపరి వచ్చిన వై.సి.పి ఆ కేటాయింపులను రద్దు చేసింది. ఇదంతా ఒక ఎత్తయితే లూలూకు కేటాయించిన భూమి సముద్ర తీరానికి అత్యంత సమీపంలో ఉంది. సముద్ర తీర ప్రాంతంలో ఏ రకమైన నిర్మాణాలు చేపట్టాలన్నా తీర నియంత్రణ జోన్ (సీ.ఆర్.జెడ్) నిబంధనల మేరకు జరగాలి. సీ.ఆర్.జెడ్ నిబంధల మేరకు బీచ్‌కు సమీపంలో 500 మీటర్ల వరకూ ఎటువంటి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టరాదు. సముద్ర మట్టాలు పెరిగే అవకాశం, తీరంలో కోత, వరదలను నివారించే క్రమంలో అక్కడ చేపట్టే నిర్మాణాల విషయంలో అనేక ఇతర నిబంధనలు పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. పర్యావరణం విషయంలోనూ అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. చుట్టు పక్కల ఉన్న అనేక నివాస సముదాయాలకు తీవ్రమైన ఇబ్బంది ఎదురవుతుంది. లులూ అతిపెద్ద మాల్ కావడం వలన బీచ్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయి. 2012 లో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ విభాగం జారీ చేసిన భూకేటాయింపుల విధానం ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు యథేచ్ఛగా బదలాయించకూడదు. ఒకవేళ ప్రజాప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమైతే, భూమిని బదలాయించడం తప్పనిసరి అని తేలితే ఆ భూమికి ఉన్న మార్కెట్ ధర మీద కనీసం 10 శాతం అద్దె లభించేలా ఉండాలి. ఈ అంశాలన్నిటినీ పరిశీలిస్తే విశాఖ సముద్ర తీరానికి, ఆర్‌కె బీచ్‌కు అతి సమీపంలో ఉన్న సదరు భూమిని సుమారు రూ.1,086 కోట్ల పెట్టుబడితో నిర్మించే లులూ షాపింగ్ మాల్‌కు కేటాయించే హక్కు ప్రభుత్వానికి లేదు. కూటమి ప్రభుత్వం ఈ నిబంధనలన్నీ సముద్రంలోకి కలిపేసి లులూకు వంత పాడటం నగర ప్రజలను వంచించడమే. అసలు ఒక ప్రైవేటు వ్యాపార సంస్థకు ప్రభుత్వ భూములను ఎందుకు కట్టబెట్టాలనేది మౌలిక ప్రశ్న. ఇప్పటికే హైదరాబాద్, కొచ్చి సహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో లులూ సంస్థకు మాల్స్ ఉన్నాయి. అక్కడి ప్రభుత్వాలు ఆ సంస్థకు ప్రభుత్వ భూములను ఇవ్వలేదు. ఒక వ్యాపార సంస్థగా ఎక్కడైనా ప్రైవేటు వ్యక్తుల దగ్గర భూమిని కొనుగోలు చేసి మాల్స్ కట్టుకుని వ్యాపారం చేసుకోవచ్చు. ఇందుకు ఎవ్వరూ అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదు. నగరంలో ఉన్నటువంటి పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్సులకు ప్రభుత్వాలు భూములను ఇవ్వలేదు. షాపింగ్ మాల్ స్వచ్ఛంద సంస్థ కాదు. నిర్వాహకులకు వచ్చే ఆదాయాన్ని ప్రజలకు, ప్రభుత్వానికి ఎటువంటి అదనపు ఆదాయం రాదు. సీఎం చంద్రబాబు లులూ గ్రూప్ చైర్మన్ యూసఫ్ ఆలీ కలిసిన రెండు రోజుల్లోనే అత్యంత విలువైన ప్రభుత్వ భూములను కారు చౌకగా కేటాయించడం ముమ్మాటికీ తప్పే. అన్ని రకాల నిబంధనలను ఉల్లంఘించి లులూకు భూములను కేటాయించిన ప్రభుత్వ పెద్దలు తాము చేస్తున్న పని యువతకు ఉద్యోగాలు కల్పించడం కోసమేనంటూ పేర్కొనడం ప్రజలను మోసగించడమే. లులూ అనేది వస్తువులను అమ్మి భారీ ఎత్తున వ్యాపారం చేసే సంస్థ అని అందరికీ తెలుసు. అందులో కొత్తగా వస్తు ఉత్పత్తి ఏమీ ఉండదు. అంటే ఆ సంస్థ ద్వారా వచ్చేవి చిన్నా చితక సేల్స్‌మెన్ ఉద్యోగాలు మాత్రమే. అవి కూడా వందల్లోనే ఉంటాయి. కాబట్టి ప్రభుత్వం చెబుతున్న ఉపాధి కల్పన అనేది నేతిబీరలోని నెయ్యి చందమే అవుతుంది. లులూ అనే పెద్ద మాల్ వస్తే నగరంలోని వందలాది చిన్న చిన్న వ్యాపార సంస్థలు దెబ్బ తింటాయి. వాటిల్లో ఇప్పటికే పని చేస్తున్న వేలమంది సేల్స్‌మెన్‌లు తమకు ఉన్న చిన్నపాటి ఉపాధి మార్గాన్ని కూడా కోల్పోతారు. బీచ్ రోడ్డులో ఉపాధిని పొందుతున్న చిరు వర్తకులు, చిల్లర వ్యాపారులు తమ ఉపాధిని శాశ్వతంగా కోల్పోతారు. మొత్తం మీద లులూ వస్తే అందులో లభించే ఉద్యోగ అవకాశాల కన్నా కోల్పోయే ఉద్యోగాలే ఎక్కువ. కాబట్టి ఉపాధి కల్పన కోసం అనే ప్రభుత్వ వాదనల్లో పస లేదు. కాబట్టే ప్రభుత్వ భూమిని తమ ఇష్టానుసారంగా పంచిపెట్టిన ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగానే పరిగణించాలి. లులూ సంస్థ చరిత్రను పరిగణలోకి తీసుకున్నా అది నష్టాలతోనే నడుస్తోంది. మలేసియాతో పాటు ఇతర దేశాల్లో ఉన్న లులూ మాల్స్ కార్యకలాపాలన్నీ క్రమంగా నిలిచిపోతున్నాయి. అటువంటి దివాళా తీసిన సంస్థకు ప్రభుత్వం భూమి రూపంలో సంతర్పణ చేయడానికే ఈ ప్రయత్నాలనే వాదనా ఉన్నది. కాబట్టి ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించాలి. ప్రజల భవిష్యత్తు అవసరాలకు, పర్యావరణానికి కీలకమైన ప్రాంతంలో ఉన్న సదరు భూమిని లులూకు కేటాయిస్తూ విడుదల చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలి.

ఈ నేపథ్యంలోనే విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక రాష్ట్రం ప్రభుత్వం ముందు కీలకమైన ప్రత్యామ్నాయ మార్గాన్ని ఉంచుతున్నది. విశాఖ ప్రజలు, నగరానికి నిత్యం వేలాదిగా వచ్చే పర్యాటకుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, విశాఖపట్నం గౌరవాన్ని పెంచేలా లులూకు కేటాయించిన స్థలంలో సైన్సు సిటీని అభివృద్ధి చేయడం సముచితమైన పని అవుతుంది. మన రాష్ట్రంలో ప్రత్యేకంగా సైన్సు సిటీ లేదు. భావి భారత పౌరులైన మన విద్యార్థుల్లో అనేక శక్తులు ఇమిడి ఉన్నాయి. నేడు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల, గూగుల్‌ను నడుపుతున్న సుందర్ పిచాయ్ వంటి వారు మన మధ్య పుట్టి పెరిగి ప్రభుత్వ సంస్థల్లోనే విద్యాభ్యాసం చేసిన వారే. వీరి తరహాలోనే వందల మంది భవిష్యత్తులో ఎదగాలి. ఇందుకు మన రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే సైన్సు సిటీ అవసరం ఉంది. మన చిన్నారులు మంచి పౌరసమాజంగా రూపొందాలంటే వారిలో మనోవికాసాన్ని ప్రోదిగొలిపే సైన్సును ప్రోత్సహించాలి. కాబట్టి ఆ స్థలంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో సైన్సు సిటీని ఏర్పాటు చేసి ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తుందని ఆశిద్దాం.

కన్వీనర్, విశాఖ ప్రజా వనరుల పరిరక్షణ వేదిక
సెల్: 9059837847

దేశంలో తగ్గిన జననాలు

న్యూదిల్లీ: దేశంలో జననాల రేటు తగ్గినట్లు శాంపిల్ రిజిస్ట్రేషన్ స్టాటిస్టికల్ సర్వే తెలిపింది. జనాభాలో ప్రతి వెయ్యిమందికి ఒక ఏడాదిలో జన్మించే చిన్నారుల సంఖ్యను సీబీఆర్‌గా లెక్కిస్తారు. 2022లో 19.1శాతం ఉండగా, 2023లో 18.4కి పడిపోయింది. 2022తో పోలిస్తే ఏడు పాయింట్లు తగ్గినట్లు తాజాగా సర్వే తెలిపింది. దేశంలోని మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) రెండేళ్లలో మొదటిసారి 2023లో 1.9కి పడిపోయింది. 2021, 2022లో భారతదేశ టీఎఫ్ఆర్ 2.0 వద్ద స్థిరంగా ఉంది. ఇటీవల భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం విడుదల చేసిన నివేదిక ప్రకారం... బీహార్‌లో సీబీఆర్ అత్యధికంగా 25.8 గా, తమిళనాడులో అత్యల్పంగా 12గా ఉంది. 18 రాష్ట్రాలు... కేంద్రపాలిత ప్రాంతాలు 2.1 భర్తీస్థాయి టీఎఫ్ఆర్ కంటే తక్కువ టీఎఫ్ఆర్‌ను నివేదించాయని నివేదిక తెలిపింది. దేశంలో ముడి మరణాల రేటు 2023లో 6.4గా ఉందని, ఇది 2022తో పోలిస్తే 0.4పాయింట్ల తగ్గుదల అని పేర్కొంది. 2020-2022, 2021-2023 మధ్య కాలంలో శిశు మరణాల రేటు జాతీయ స్థాయిలో ఒక పాయింట్ తగ్గింది.

అలాగైతే భరణం ఇవ్వక్కర్లేదు: హైకోర్టు

చెన్నై: భార్యకు ఆస్తులు, ఆదాయం భర్త కంటే ఎక్కువగా ఉంటే... భర్త ఆమెకు భరణం చెల్లించాల్సిన అవసరం లేదని మద్రాసు హైకోర్టు తీర్పుచెప్పింది. ఓ కేసులో భార్యకు భర్త భరణం ఇవ్వాలంటూ ఫ్యామిలీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. భర్త కంటే అధికంగా ఆస్తులు, ఆదాయం కలిగి ఉన్న మహిళ... భర్త నుంచి భరణం కోరజాలదని కోర్టు స్పష్టం చేసింది. చెన్నైకి చెందిన వైద్య దంపతుల మధ్య విభేదాలు తలెత్తడంతో విడాకులు కోరుతూ చెన్నై ఫ్యామిలీ కోర్టులో కేసు వేశారు. వారికి ఇంటర్మీడియట్ పూర్తిచేసిన ఒక కొడుకు ఉన్నాడు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు... భర్త తన భార్యకు నెలకు రూ.30 వేలు భరణంగా ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ భర్త మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. భర్త పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం... పిటిషనర్ భార్యకు అధికంగా ఆస్తులు, ఆదాయం ఉన్నాయని, ఆమె స్కానింగ్ సెంటర్ నడుపుతున్నారని, అందుకు సంబంధించిన పత్రాలను పిటిషనర్ దాఖలు చేశారని పేర్కొంది. కాబట్టి పిటిషనర్ తన భార్యకు భరణం ఇవ్వాల్సిన అవసరం లేదని తీర్పుచెప్పింది.

మహిళల వీడియో... పైలట్ అరెస్ట్

న్యూదిల్లీ: మహిళలను రహస్యంగా వీడియో తీస్తున్న పైలట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బహిరంగ ప్రదేశాలలో మహిళల వీడియోలను పైలట్ అభ్యంతరకరంగా రికార్డు చేస్తుండగా ఓ మహిళ గుర్తించింది. ఆమె వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకునే సరికి నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. దాంతో అక్కడున్న సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. దేశ రాజధాని దిల్లీలోని కిషన్‌గఢ్ ఏరియాలోగల శని బజార్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్పై కెమెరాతో పైలట్ మహిళలను అభ్యంతరకరంగా చిత్రీకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మోహిత్ ప్రియదర్శిగా గుర్తించారు. అతడు ఓ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో పైలట్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అతడి నుంచి స్పై కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. వీడియోలను ఎవరికైనా పంపించాడా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నామన్నారు.

శిల్పా శెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు

న్యూదిల్లీ: బాలీవుడ్ నటి శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా దంపతులకు రూ.60 కోట్ల మోసం కేసులో లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ముంబైకి చెందిన వ్యాపారి, లోటస్ క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ డైరెక్టర్ దీపక్ కొఠారీ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. 2015 నుంచి 2023 మధ్య కాలంలో వ్యాపార విస్తరణ పేరుతో శిల్పా దంపతులు తమ వద్ద రూ. 60.4 కోట్లు తీసుకున్నారని, కానీ ఆ డబ్బును తమ వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించారని దీపక్ కొఠారీ ఈ ఏడాది ఆగస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిల్పా-రాజ్ దంపతులు 'బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్' అనే హోం షాపింగ్ కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కొఠారీ, 2015లో రెండు విడతల్లో రూ. 31.9 కోట్లు, రూ. 28.53 కోట్లు బదిలీ చేశారు. 2016లో శిల్పా శెట్టి వ్యక్తిగత గ్యారెంటీ ఇచ్చినా, అదే ఏడాది ఆమె డైరెక్టర్ పదవికి రాజీనామా చేశారు. 2017లో మరో ఒప్పందం విఫలమవడంతో కంపెనీ దివాళా ప్రక్రియలోకి వెళ్లినట్లు తెలిసిందని ఆయన పేర్కొన్నారు. దీపక్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు విచారణ నిర్వహించి, మోసం, నమ్మకద్రోహం తదితర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మోసం రూ. 10 కోట్లకు పైగా ఉండటంతో, కేసును జుహు పోలీస్ స్టేషన్ నుంచి ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. కేసు విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు శిల్పా దంపతులపై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు ఆర్థిక నేరాల విభాగ వర్గాలు తెలిపాయి.

బీహార్ ఎన్డీయేలో ముసలం

- సీట్ల పంపిణీపై మల్లగుల్లాలు
- అధిక స్థానాలు కావాలంటున్న చిరాగ్ పాశ్వాన్, మాంఝీ

పట్నా: బీహార్‌లో ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండగా... పాలక ఎన్డీయే కూటమిలో సీట్ల పంపిణీపై విభేదాలు తలెత్తాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధిక సీట్లు (80) గెల్చుకున్నప్పటికీ, జేడీ(యూ) అధ్యక్షుడు నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. అయితే కూటమిలో చిన్న పార్టీలుగా ఉన్న చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్), జితన్ రామ్ మాంఝీ హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్) ఇకపై కేవలం సహకారం అందించే పాత్రకే పరిమితం కారాదని భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ పార్టీలు తమకు ఎక్కువ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాయి. దీంతో ఎన్డీఏలో ముసలం మొదలైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన ఐదు సీట్లను గెల్చుకున్న చిరాగ్ పాశ్వాన్ పార్టీ 6శాతానికి పైగా ఓట్లు సాధించింది. అందుకే ఇటీవల సీట్ల పంపకాల చర్చల సందర్భంగా తన పార్టీకి 40 అసెంబ్లీ సీట్లను చిరాగ్ పాశ్వాన్ డిమాండ్ చేసినట్లు సమాచారం. అయితే 25 సీట్లే ఇవ్వగలమని బీజేపీ పెద్దలు ఆయనకు చెప్పారట. అయినా ఊరుకోకుండా సీట్ల కోసం చిరాగ్ పాశ్వాన్ బేరసారాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక వేళ అన్ని సీట్లు తమకు ఇవ్వకపోతే మొత్తం 243 అసెంబ్లీ సీట్లలో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని చిరాగ్ పాశ్వాన్ హెచ్చరిస్తున్నారు. ఈ విషయాన్ని మీడియా సమావేశాల్లో స్పష్టం చేయడమే కాక, అనేక సందర్భాల్లో పార్టీ సొంత వైఖరిని వెల్లడించారు. కాగా, ఇక నుంచి రాష్ట్ర రాజకీయాలపైనే తన దృష్టి ఉంటుందని ఆయన అనేకమార్లు ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ పోటీ చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. 'బీహార్ ఫస్ట్, బీహారీ ఫస్ట్' అంటూ చిరాగ్ పాశ్వాన్ ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలతో మమేకం అయ్యారు. 'చిరాగ్ కా చౌపల్' వంటి కార్యక్రమాలతో బీహార్‌లో తానూ బలమైన రాజకీయ శక్తినే అనే సందేశాన్ని రాజకీయ వర్గాల్లోకి పంపారు. ప్రస్తుతం కేంద్రంలో, బీహార్‌లో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమిలో జేడీయూ అధినేత, బీహార్ సీఎం నితీశ్‌కుమార్ చక్రం తిప్పుతున్నారు. అటువంటి నితీశ్ పాలనా విధానాలపైనా బహిరంగ విమర్శలు చేసిన నైజం చిరాగ్ పాశ్వాన్ సొంతం. బీహార్‌లో శాంతిభద్రతల నిర్వహణలో నితీశ్ సర్కారు విఫలమైందని ఇటీవలే ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిణామంతో కూటమిలోని ఎల్‌జేపీ మిత్రపక్షాలు బీజేపీ, జేడీయూ, హిందుస్తానీ అవామ్ మోర్చా అసౌకర్యానికి గురయ్యాయి. బీజేపీకి నితీశ్ కుమార్ ఎంత ముఖ్యమో, చిరాగ్ పాశ్వాన్ అంతే ముఖ్యం. అందుకే చిరాగ్ విమర్శలపై అప్పట్లో బీజేపీ ఆచితూచి స్పందించింది. చిరాగ్ పాశ్వాన్ ఎన్నడూ సీఎం పదవి కావాలనే కోరికను బహిరంగంగా వ్యక్తం చేయలేదు. కానీ గత కొన్ని నెలల రాజకీయ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే... భవిష్యత్తులో సీఎం పదవి రేసులో ఉండాలనే లక్ష్యం చిరాగ్‌కు ఉన్నట్టుగా కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు.

కాగా, స్థానికంగా తమకు పట్టున్న గయా, ఔరంగాబాద్‌ల్లోని అన్ని స్థానాలను తమకే కేటాయించాలని మరో సంకీర్ణ పార్టీ హెచ్ఏఎం చీఫ్ జితన్ రామ్ మాంఝీ డిమాండ్ చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆయన 20 సీట్లు కోరుతున్నారు. తమ పార్టీ మద్దతు లేకుండా ఎన్డీఏ విజయం సాధించలేదని ఆయన బహిరంగంగానే ప్రకటించారు. ప్రస్తుతం తమ కూటమిలోని పార్టీలు విడిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీపై పడింది. ఆ పార్టీల డిమాండ్లను సమన్వయంతో పరిష్కరించకపోతే అవి విడిగా పోటీచేసే ప్రమాదం ఉంది. దీంతో కూటమికి అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి దెబ్బ తగిలి విజయావకాశాలు గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు.

మహాఘట్బంధన్ ప్రయత్నాలు ముమ్మరం

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారాన్ని చేపట్టాలని మరోవైపు మహాఘట్బంధన్‌గా ఉన్న ఇండియా ఐక్యసంఘటన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. మహాఘట్బంధన్‌లో కాంగ్రెస్, ఆర్జేడీతో పాటు సీపీఐ, సీపీఎం, సీపీఐ-ఎంఎల్ పార్టీలు భాగస్వాములుగా ఉన్నాయి. ఈ కూటమి ఎక్కువగా యువత, తమ సంప్రదాయ ముస్లిం-యాదవ్ ఓట్ల బ్యాంక్‌పై ఆధారపడింది. ఈ ఎన్నికల్లో తమ కూటమి పార్టీలను సమన్వయం చేయడంలో ఎన్డీఏ విఫలమైతే అది మహాఘట్బంధన్ కూటమికి పూర్తి లాభం చేకూరుస్తుంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌లు రాష్ట్రంలో 'ఓటర్ రైట్స్ మార్చ్' ద్వారా తమ కూటమికి అనుకూల వాతావరణం సృష్టించే ప్రయత్నం చేశారు.

ప్రభుత్వ సాయంలో జాప్యం

దిల్లీ వరద సహాయ శిబిరాన్ని సందర్శించిన కేజ్రీవాల్

న్యూదిల్లీ : దేశ రాజధానిలో వరద బాధితులకు తగిన సహాయ సామగ్రిని అందించాలని ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం దిల్లీ ప్రభుత్వాన్ని కోరారు. ఆహార పంపిణీలో, టెంట్ల ఏర్పాటులో జాప్యం జరిగిందని విమర్శించారు. ఈశాన్య దిల్లీలోని శాస్త్రి పార్క్‌లోని సహాయ శిబిరాన్ని సందర్శించిన సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, భూకంపంతో దెబ్బతిన్న అఫ్గానిస్తాన్‌కు కేంద్ర ప్రభుత్వం సహాయ సామగ్రిని పంపగలిగితే, దిల్లీ వరద బాధితులకు కూడా సకాలంలో సహాయం అందాలని వ్యాఖ్యానించారు. 'ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారని నేను చూస్తున్నాను. వారికి సమయానికి ఆహారం అందడం లేదు. ప్రతిచోటా దోమలు ఉన్నాయి. వర్షం పడుతోంది. కానీ టెంట్లు నిన్ననే ఏర్పాటు చేశారు. ఇది ప్రకృతి వైపరీత్యం. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాము. తగిన ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ బాధ్యత' అని కేజ్రీవాల్ విలేకరులతో అన్నారు.

దిల్లీ అంతా నీటి ఎద్దడి సమస్యను ఎదుర్కొంటోందని మాజీ ముఖ్యమంత్రి కూడా అన్నారు. 'డ్రెయినేజీల పూడికతీత సకాలంలో జరగలేదు. చాలా ప్రాంతాల్లో మురుగునీటి ప్రవాహం వెనక్కి తగ్గింది. చాలా చోట్ల తాగునీరు లేదు. ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని నేను ప్రభుత్వాన్ని కోరుతున్నాను' అని అన్నారు. 'ఉత్తర భారతదేశం అంతా వరదలతో అతలాకుతలమవుతోంది. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, దిల్లీ ప్రజలకు ఉపశమనం అందించాలని నేను కేంద్రాన్ని కోరుతున్నాను' అని తెలిపారు.

ఒకే దేశం...ఒకే పన్ను అసాధ్యం

నిర్మలా సీతారామన్

న్యూదిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితమైనదని, ఇలాంటి సమయంలో ఒకే పన్ను విధానం తీసుకురావడం అసాధ్యమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్వరూపంలో కేంద్రం తీసుకొచ్చిన సంస్కరణలపై ఆమె శుక్రవారం మాట్లాడారు. సామాన్యులపై పన్ను భారం తగ్గించేందుకే జీఎస్టీ విధానంలో సవరణలు చేసినట్లు తెలిపారు. 'ఇండియాటుడే'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మంత్రి నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేశారు. వన్ నేషన్- వన్ ట్యాక్స్ మంచి ఆలోచనేనని, కానీ...ఆచరణలో అది సాధ్యం కాదని కేంద్రమంత్రి అన్నారు. అభివృద్ధిలో వైవిధ్యాలు ఉన్నప్పుడు ఒకే జీఎస్టీ రేటు అమలు చేయడం అన్యాయమవుతుందన్నారు. మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులకు ఒకే పన్ను రేటు విధించగలమా అని ప్రశ్నించారు. ప్రస్తుతం మన దేశ ఆర్థిక వ్యవస్థ వైవిధ్యభరితంగా ఉంది. అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులు చెల్లించగలుగుతాయని, అభివృద్ధి చెందని రంగాలకు అది భారమవుతుందన్నారు. ఒకవేళ భారత్ అన్ని రంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందితే అప్పుడు ఒకే పన్ను విధానం సాధ్యమవుతుందని నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ సందర్భంగా విపక్ష కాంగ్రెస్ పార్టీపై ఆర్థిక మంత్రి విమర్శలు గుప్పించారు. ఒకప్పుడు జీఎస్టీని గబ్బర్ సింగ్ ట్యాక్స్ అంటూ ఎగతాళి చేసిన వారే... ఇప్పుడు పన్ను సంస్కరణలు చేయగానే ఆ ఘనత తమదని చెప్పుకోవడానికి ఆరాటపడుతున్నారన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 91 శాతం వరకు ఆదాయపు పన్ను విధించిన రోజులు ఉన్నాయని ఆరోపించారు. జీఎస్టీలో సంస్కరణ వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్రానికి కూడా ఆదాయంలో కొంత కోత ఉంటుందని ఆమె తెలిపారు. తమ ప్రభుత్వానికి పౌరుల అవసరాలే ప్రథమ ప్రాధాన్యమని, ఆ తర్వాతే ఆదాయం గురించి ఆలోచిస్తామని చెప్పుకొచ్చారు. టారిఫ్‌ల వల్ల ఎగుమతిదారులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంపైనా కేంద్రం దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతానికి పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని పునరుద్ఘాటించారు.

స్మార్ట్ టీచర్లు చాలా ముఖ్యం

రాష్ట్రపతి ముర్ము

న్యూదిల్లీ : పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థలలో స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఇతర ఆధునిక సౌకర్యాలు వాటి స్వంత ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని, కానీ అతి ముఖ్యమైన విషయం స్మార్ట్ టీచర్లు అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం అన్నారు. ఉపాధ్యాయురాలిగా తన సమయాన్ని గుర్తుచేసుకుంటూ, అది తన జీవితంలో చాలా అర్థవంతమైన కాలం అని ఆమె అభివర్ణించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బోధన, అభ్యాసానికి వారి ఆదర్శప్రాయమైన కృషికి 60 మందికి పైగా విద్యావేత్తలకు విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆమె అవార్డులను ప్రదానం చేశారు. జాతీయ ఉపాధ్యాయ అవార్డులతో 45 మంది ఉపాధ్యాయులను రాష్ట్రపతి ముర్ము సత్కరించారు. ఈ సందర్భంగా తరగతి గదులను మార్చి, పిల్లలను రేపటి సమర్థులయిన, నిజాయితీగల పౌరులుగా తీర్చిదిద్దినందుకు ఉపాధ్యాయులను ఆమె ప్రశంసించారు. సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన రాష్ట్రపతి, మన జీవితాల్లో విద్య ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. 'బాలికల విద్యలో పెట్టుబడి పెట్టడం ద్వారా మన కుటుంబం, సమాజం, దేశ నిర్మాణంలో మనం అమూల్యమైన పెట్టుబడిని పెడతాము. బాలికలకు సాధ్యమైనంత ఉత్తమమైన విద్యను అందించడం మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని ప్రోత్సహించడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గం' అని అన్నారు. ఆహారం, దుస్తులు, ఆశ్రయం లాగానే విద్య ఒక వ్యక్తి గౌరవం, భద్రతకు అవసరమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 'విద్య ఒక సమర్థుడిని తయారు చేస్తుంది. పేద నేపథ్యాల నుంచి వచ్చిన పిల్లలు విద్య శక్తితో పురోగతి ఆకాశాన్ని తాకగలరు. ప్రేమ, అంకితభావం కలిగిన ఉపాధ్యాయులు పిల్లల పయనానికి బలాన్ని ఇవ్వడంలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. ఉపాధ్యాయులకు లభించే అతిపెద్ద బహుమతి ఏమిటంటే, వారి విద్యార్థులు వారిని జీవితాంతం గుర్తుంచుకుంటారు. కుటుంబం, సమాజం, దేశానికి ప్రశంసనీయమైన కృషి చేస్తారు' అని అన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వాన్ని నిర్మించడం ఉపాధ్యాయుని ప్రాథమిక కర్తవ్యమని రాష్ట్రపతి అన్నారు. 'స్మార్ట్ బ్లాక్ బోర్డులు, స్మార్ట్ తరగతి గదులు, ఇతర ఆధునిక సౌకర్యాలు వాటి స్వంత ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. కానీ అతి ముఖ్యమైన విషయం స్మార్ట్ టీచర్లు. స్మార్ట్ టీచర్లు అంటే తమ విద్యార్థుల అభివృద్ధి అవసరాలను అర్థం చేసుకునే ఉపాధ్యాయులు. స్మార్ట్ టీచర్లు ప్రేమ, సున్నితత్వంతో అధ్యయన ప్రక్రియను ఆసక్తికరంగా, ప్రభావవంతంగా చేస్తారు. అలాంటి ఉపాధ్యాయులు విద్యార్థులను సమాజం, దేశం అవసరాలను తీర్చగల సామర్థ్యం కలిగి ఉంటారు' అని ఆమె అన్నారు. జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) ప్రాముఖ్యత గురించి మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచ జ్ఞాన సూపర్ పవర్‌గా మార్చడం దీని లక్ష్యమని అన్నారు. అవార్డు గ్రహీతలలో ఆంధ్ర ప్రదేశ్‌లోని మైలవరంలోని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు బోధకుడు ఎం.దేవానంద కుమార్ ఉన్నారు. ఆయన తన వినూత్న బోధనా పద్ధతులకు అవార్డును అందుకున్నారు. అదేవిధంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ సెంట్రల్ యూనివర్సిటీలో సైకాలజీ బోధకుడు అయిన ప్రోశాంతో క్ర సాహా, 14 సంవత్సరాలకు పైగా విద్యా సేవతో ఫోరెన్సిక్ సైకాలజీ, న్యూరోసైకాలజీలో తన నైపుణ్యానికి గుర్తింపు పొందారు. అవార్డుల ప్రదానోత్సవానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతీయ అవార్డు గ్రహీతలతో సంభాషించారు.

మంత్రి చేతికి టెస్లా తొలి కారు

ముంబై: భారత మార్కెట్లోకి అడుగుపెట్టిన విద్యుత్ కార్ల దిగ్గజం టెస్లా సంస్థ దేశంలో తొలి కారును డెలివరీ చేసింది. తెలుపు రంగు టెస్లా 'మోడల్ వై' కారును మహారాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రతాప్ సర్‌నాయక్ కొనుగోలు చేశారు. ముంబైలోని 'టెస్లా ఎక్స్‌పీరియెన్స్ సెంటర్'లో సంస్థ ప్రతినిధులు ఈ కారు తాళాలను మంత్రికి అందజేశారు. మంత్రి ప్రతాప్ మాట్లాడుతూ దేశంలో తొలి టెస్లా కారు కొనుగోలు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. పర్యావరణహిత వాహనాలను అందుబాటులోకి తెచ్చేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని పేర్కొన్నారు. విద్యుత్ వాహనాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే తాను ఈ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా సంస్థ ఇటీవలే భారత్‌లో విక్రయాలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే.

పళనిస్వామిపై పెరుగుతున్న ఒత్తిడి

చెన్నై: వచ్చే ఏడాది ప్రారంభంలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకోసం అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో తమిళ రాజకీయాల్లో జయలలిత నెచ్చెలి శశికళ మళ్లీ రంగంలోకి దిగారు. ఆమె సరికొత్త రాజకీయ క్రీడ ప్రారంభించారు. ఇప్పటికే ఎన్డీయే నుంచి పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్ తదితరులు బయటకు వచ్చేశారు. ఈ సమయంలో అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీమంత్రి సెంగొట్టయన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పళనిస్వామికి డెడ్‌లైన్ విధించారు. పార్టీకి దూరమైన పన్నీర్‌సెల్వం, టీటీవీ దినకరన్ సహా ఇతర నాయకులను కలుపుకుపోవడానికి పళనిస్వామికి ఇష్టం లేదని, ఇది జయలలిత ఆశయాలకు విరుద్ధమని చెప్పారు. అందరిని కలుపుకువెళ్లాలని, అలా జరగకపోతే జయలలిత ఆశయాలు సాధించలేమని చెప్పారు. పార్టీ నుంచి వెళ్లిపోయిన వారిని... బహిష్కరించిన నాయకులను 10 రోజుల్లో తిరిగి చేర్చుకోవాలని, లేదంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

రంగంలోకి హైపర్ సోనిక్ క్షిపణులు

కేంద్రం యోచన

న్యూదిల్లీ: పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత సైనిక దళాలకు అత్యాధునిక ఆయుధాలు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రణాళికను మోదీ సర్కారు ఆవిష్కరించింది. దాదాపు 15 ఏళ్ల వ్యవధిలో ఈ లక్ష్యాలు పూర్తి చేసేలా కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందుకోసం భారీ మొత్తంలో వెచ్చించేందుకు సిద్ధమైంది. కనీసం 500కు తగ్గకుండా హైపర్‌సోనిక్ క్షిపణులను దళాలకు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విజన్ డాక్యుమెంట్ ప్రకారం పాత టీ-72 యుద్ధట్యాంక్‌లను 1800 అత్యాధునిక ఫ్యూచర్ ట్యాంక్‌లతో భర్తీ చేయనున్నారు. మరో 400 తేలికపాటి ట్యాంక్‌లను దళాలకు అందించనున్నారు. ట్యాంక్‌పై నుంచి ప్రయోగించే 50 వేల యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్స్, 6 లక్షల శతఘ్ని గుండ్లు, మానవ రహిత విమానాలు సమకూర్చుకోనుంది. వీటితోపాటు 700 రోబోటిక్ కౌంటర్ ఐఈడీ సిస్టమ్‌లను రంగంలోకి దించాలని నిర్ణయించింది. నౌకాదళం కోసం సరికొత్త ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్, 10 అత్యాధునిక ఫ్రిగెట్‌లు, ఏడు అడ్వాన్స్‌డ్ కార్వెట్టీలు, నాలుగు ల్యాండ్ డాక్ ప్లాట్‌ఫార్మ్స్, హెలికాప్టర్లకు ప్లాన్ చేస్తోంది. వీటితో పాటు అణుశక్తితో నడిచే యుద్ధ నౌకలు, ఎలక్ట్రోమాగ్నెట్ ఎయిర్‌క్రాఫ్ట్ లాంచ్ సిస్టమ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాయుసేన కోసం 75 హై ఆల్టిట్యూడ్ సూడో శాటిలైట్లు, 150 స్టెల్త్ బాంబర్ డ్రోన్లు, 100 రిమోట్‌తో పనిచేసే విమానాలు, గైడెడ్ ఆయుధాలు, 20 స్ట్రాటోస్ఫియరిక్ ఎయిర్ షిప్‌లు సమకూర్చనుంది. 21వ శతాబ్దంలో ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యాన్ని తీర్చి దిద్దాలని లక్ష్యంగా పెట్టుకొంది. ఇవి కాకుండా యాంటీ స్వార్మ్ డ్రోన్ వ్యవస్థలు, లేజర్ ఆయుధాలు, మానవ రహిత విమానాల కోసం ఎయిర్ టూ సర్ఫేస్ మిసైళ్లు, అత్యాధునిక టార్గెటింగ్ పాడ్స్ వంటివి ఉన్నాయి. ఆయుధాలను మరింత అభివృద్ధి చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీని వాడతామని రక్షణశాఖ పేర్కొంది. రోబోటిక్స్, కృత్రిమ మేధ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుద్ధ భూములను మార్చేస్తున్నాయని అభిప్రాయపడింది.

రైల్వేమంత్రికి రాహుల్‌గాంధీ లేఖ

న్యూదిల్లీ: డిబ్రూఘర్ నుండి న్యూదిల్లీ వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను రాయ్‌బరేలి జంక్షన్‌లో ఆపాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కోరారు. ఈ మేరకు రాహుల్‌గాంధీ రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్‌కి లేఖ రాసినట్లు ఆయన సన్నిహితుడు, అమేథీ ఎంపీ కిషోరి లాల్ శర్మ శుక్రవారం ధృవీకరించారు. 20503/20504, 20505/20506 నంబర్లు గల రైళ్లు రాయ్‌బరేలి జంక్షన్‌లో ఆగేలా ఏర్పాటు చేయాలనే ప్రజల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకోవాలని రాహుల్ రైల్వే మంత్రిని కోరారు. రాజధాని ఎక్స్‌ప్రెస్ రాయ్‌బరేలి మీదుగా వెళుతుందని, కానీ జంక్షన్‌లో ఆగడం లేదని అన్నారు. తమ ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు, ముఖ్యంగా దేశ రాజధాని దిల్లీకి వెళ్లేందుకు వీలుగా రాయ్‌బరేలీ స్టేషన్‌లో ఆగాలని తన నియోజకవర్గం ప్రజలు చాలాకాలంగా కోరుతున్నట్లు శర్మ తెలిపారు. ఈ డిమాండ్ చాలాకాలంగా పెండింగ్‌లో ఉందని, ఆమోదించడం ద్వారా తన నియోజకవర్గ ప్రజల ప్రయాణం సులభతరం అవుతుందని అన్నారు.

ముడా కేసులో సిద్దరామయ్యకు ఊరట



బెంగళూరు: ముడా కేసులో కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు భారీ ఊరట లభించింది. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపుల కేసులో సిద్దరామయ్య, ఆయన కుటుంబ సభ్యులపై వచ్చిన ఆరోపణలన్నీ నిరాధారమైనవి, అసత్యమైనవని జస్టిస్ పీఎన్ దేశాయ్ నేతృత్వంలోని ఏకసభ్య విచారణ కమిషన్ తేల్చి చెప్పింది. దీంతో సిద్దరామయ్యకు కమిషన్ నివేదిక ఉపశమనం కలిగించింది. కర్నాటకలోని ముడా భూముల వ్యవహారంలో సిద్దరామయ్య, అతని కుటుంబ సభ్యులకు 14 స్థలాలు అక్రమంగా కేటాయింపులు జరిపినట్టు బీజేపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఈ కేసు విచారణలో సిద్దరామయ్యపై వచ్చిన ఆరోపణలు అసత్యమని, వాటికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేవని, కనీసం చట్ట ఉల్లంఘన కూడా జరగలేదని పీఎన్ దేశాయ్ కమిషన్ నివేదికలో పేర్కొంది. డీ-నోటిఫై అయిన భూములను ముడా తిరిగి వినియోగించుకున్నందుకు భూమి యజమానులకు పరిహారంగా స్థలాలు కేటాయించడమైందని, ఇది చట్ట ప్రకారమే జరిగిందని నివేదిక స్పష్టం చేసింది. తాజాగా ఈ విషయాన్ని న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. గురువారం జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం విధాన సౌధలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జస్టిస్ పీఎన్ దేశాయ్ నేతృత్వంలోని కమిషన్ సమర్పించిన నివేదికకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. మరోవైపు కొందరు ముడా అధికారుల పనితీరుపై కమిషన్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. 2020 నుంచి 2024 మధ్య పనిచేసిన కొంతమంది కమిషనర్లు నిబంధనలకు విరుద్ధంగా, తమకు ఇష్టమొచ్చినట్లు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించారని పేర్కొంది. ఈ అక్రమాలపై సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

ముంబైలో భద్రత కట్టుదిట్టం

గణేశ్ నిమజ్జనానికి 21 వేల మంది పోలీసుల గస్తీ

ముంబై : గణేశ్ నిమజ్జనానికి ముంబై పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకను సజావుగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు నగర వ్యాప్తంగా 21 వేల మంది పోలీసులను మోహరించనున్నారు. దీంతో పాటు అదనంగా డ్రోన్‌లు, ఏఐ సాంకేతికతను వినియోగించనున్నారు. శనివారం నిమజ్జన కార్యక్రమం నేపథ్యంలో మొత్తంగా 12 మంది అదనపు పోలీస్ కమిషనర్లు, 40 మంది డీసీపీలు, 61 మంది ఏసీపీలతో పాటు 3 వేల మంది ఆఫీసర్లు, 18 వేల మంది పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు, ట్రాఫిక్ సంబంధిత సూచనలు, రూట్, రియల్ టైమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను పర్యవేక్షించేందుకు ఈ ఏడాది తొలిసారిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అలాగే ముంబై మహానగరంలోని అనేక బీచ్‌లు, ఇతర నీటి వనరులతో పాటు బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) ఏర్పాటు చేసిన కృత్రిమ నిమజ్జన ప్రదేశల్లో దాదాపు 1.8 లక్షలకు పైగా గణేశ్ విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బీఎంసీతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నిమజ్జన ప్రాంతాల్లో లైఫ్ గార్డ్స్ కూడా ఉంటారని వివరించారు. రియల్ టైం ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వంటివి తెలుసుకొనేందుకు అదనంగా 10 వేల సీసీ టీవీ కెమెరాలతో నగరంలో నిమజ్జన ప్రదేశాలపై నిఘా ఉంచనున్నట్లు పోలీసులు తెలిపారు. అనేక కీలక ప్రదేశాల్లో డ్రోన్ నిఘాతో ప్రజల కదలికలను పర్యవేక్షించనున్నారు. ఈ సమయంలో భద్రతాపరమైన కారణాలను దృష్టిలో ఉంచుకొని ప్రైవేట్ డ్రోన్‌ల వాడకాన్ని నిషేధించారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

ఖైరతాబాద్ గణపతిని దర్శించుకున్న సీఎం

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఖైరతాబాద్ "శ్రీ విశ్వశాంతి మహాశక్తిగణపతి" ని దర్శించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఖైరతాబాద్ గణపతి ఉత్సవాలు 71 ఏండ్లు పూర్తి చేసుకోవడం గర్వనీయమన్నారు. దేశంలోనే గణేశ్ ఉత్సవాలంటే ఖైరతాబాద్ గణపతి అని చర్చించుకునేలా ఉత్సవాలను నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీని అభినందించారు. దేశంలో ఏ రాష్ట్రంలో, ఏ నగరంలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వలేదని, కానీ మన రాష్ట్రంలో గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ అందించింది భక్తితో ఉత్సవాలు నిర్వహించుకునే అవకాశం కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ అధికారులను సమన్వయం చేస్తూ పరిష్కరించుకుంటూ ఉత్సవాలకు ఆటంకం కలగకుండా చూశామని పేర్కొన్నారు. అన్ని మతాలను గౌరవిస్తూ హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. నిమజ్జనాలకు ఇబ్బంది కలగకుండా ట్యాంక్ బండ్ తో పాటు ఇతర ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని పూర్తి చేసుకోవాలని అందరికీ విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం కమిషన్ విచారణ నుండి తప్పించేకునేందుకు

కావాలనే డ్రామాలు చేస్తున్న కేసీఆర్ కుటుంబం



విశాలాంధ్ర - హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ విచారణ నుండి తప్పించేకునేందుకు కేసీఆర్ కుటుంబం కావాలనే డ్రామాలు చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అనుమానం వ్యక్తం చేశారు. ఎలాంటి విషయమైన ప్రజలను నమ్మించే అలవాటు కేసీఆర్ కుటుంబానికి ఉందని చెప్పారు. గురువారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ మొత్తానికి ఈ ఎపిసోడ్‌లో కవిత ఒక మంచి పని చేసిందన్నారు. హరీష్‌రావు, సంతోష్ రావులు డబ్బులు ఎలా దండుకున్నారు, ఎలా దోచుకున్నారో కవిత చెప్పిందన్నారు. కవితని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోమని, ఈ విషయం ఏఐసీసీ ఆదేశం లేకుండా ఇంత క్లియర్‌గా చెప్తానా అని అడిగారు. అవినీతి మరకలు ఉన్న వాళ్ళని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోమని, ధనం, పవర్ కోసమే కవిత కేటీఆర్ పంచాయితీలు అని అభిప్రాయపడ్డారు. కవిత ఇప్పుడు మాట్లాడుతున్న విషయాలు ఏనాడో మాట్లాడితే సెల్యూట్ చేసే వాళ్ళమన్నారు. బీసీ బిడ్డలకు నోటిదాకా వచ్చిన ముద్దను తినకుండా చేసింది. కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు అంటూ ధ్వజమెత్తారు. వారం పది రోజుల్లో పార్టీలోని అన్ని కమిటీలు వేస్తామని, అలాగే మిగిలిన కార్పొరేషన్ పదవులు వచ్చే నెలలో భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. లోకల్ బాడీ ఎన్నికల కంటే ముందే కార్పొరేషన్ పదవులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. జిల్లా ప్రెసిడెంటు కోసం జాతీయ నాయకత్వం ఒక ప్రాసెస్ నిర్వహిస్తోందన్నారు. డీసీసీ అధ్యక్షుల నియామకానికి కాస్త సమయం పడుతుందని, అక్టోబర్లో పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ కార్యకర్తలకు ఇన్సూరెన్స్ కార్యక్రమాన్ని మొదలు పెడతామన్నారు. అభ్యర్థుల ఎంపికలో డీసీసీల పాత్ర పెంచబోతున్నామని, రేవంత్ రెడ్డికి నాకు మంచి కెమిస్ట్రీ ఉందన్నారు. ఈ సంవత్సర కాలంలో సీఎం, మంత్రులు చాలా సహకరించారని పేర్కొన్నారు. నా హయంలో ఇన్ని కార్యక్రమాలు జరగడం, దానిలో నేను భాగస్వామ్యం కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నా మని, ప్రజల కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకోమని గవర్నర్‌ను కోరామని తెలిపారు. సామాజిక న్యాయం మా పార్టీ మూల సిద్ధాంతమని, ఇపుడు నా జీవితంలో మహత్తర అవకాశం దొరికిందని, బీసీ డిక్లరేషన్ ప్రకటించిన నాకే పీసీసీ చీఫ్‌గా అవకాశం వచ్చిందని అన్నారు. మంత్రులతో ముఖాముఖి దేశవ్యాప్తంగా నాకు మంచి పేరును తెచ్చిందని, మంత్రులతో ముఖాముఖి కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇతర రాష్ట్రాల్లో మొదలు పెడుతున్నాయని అన్నారు. మీనాక్షీ నటరాజన్ ఇంచార్జీగా రావడం మా అదృష్టమని, పాదయాత్రకు మంచి స్పందన వస్తోందన్నారు. క్రమశిక్షణ విషయంలో నిక్కచ్చిగా వెళ్లగలిగామని, కాంగ్రెస్ పార్టీలో బ్రేకులే కాదు సడెన్ బ్రేకులు కూడా ఉంటాయన్నారు. రాజ్ గోపాల్ రెడ్డి విషయంలో కొంత కొంత కన్ఫ్యూజన్ ఉందని, ఉన్నది ఉన్నట్టు మాట్లాడడం కోమటిరెడ్డి బ్రదర్స్‌కి అలవాటని స్పష్టం చేశారు. బీసీలు కొన్ని రోజులు కులాన్ని పక్కన పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సీబీఐలో అనేక లొసుగులు ఉన్నాయని, సీబీఐ కంటే మరో మార్గం లేదని పేర్కొన్నారు. సీబీఐతో కాకుండా రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తే బద్నాం చేసేవారన్నారు. కాళేశ్వరం విషయంలో సీబీఐ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. దానం నాగేందర్ రిజైన్ చేసి పోటీ చేస్తానని చెప్తున్నాడు కానీ నాగేందర్ సభ్యత్వం పోతుందని అనుకోవడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ రేవంత్ నాయకత్వంలోనే ఎన్నికలకు వెళ్తామని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పదవి ఇస్తామంటే వద్దని చెప్పాన, నాకు కులమంటే అభిమానమే కానీ కుల పిచ్చి లేదని స్పష్టం చేశారు.

తెలంగాణలో విద్యకు మహర్ధశ : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో విద్యకు మహర్దశ అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వీడియో సందేశం ద్వారా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మన మహబూబ్‌నగర్ పిల్లలు విద్యలో వెనక పడకూడదని భావించి, మహబూబ్ నగర్‌లో విద్యాభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టామన్నారు. అందులో భాగంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు, అలాగే ప్రతి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి శతశాతం అనే కార్యక్రమాన్ని రూపొందించినట్లు విద్యార్థులకు డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం విద్యా నిధి ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గత పది సంవత్సరాల కాలంలో జరగని అభివృద్ధి విద్యలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేసి చూపించామని, క్రీడల్లో రాణించే విధంగా, సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులను భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కేవలం అందుకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అందరూ సమన్వయంతో కలిసి విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేయాలని, ఏ అవసరం వచ్చినా విద్యాభివృద్ధికి ముందుండి క్రియాశీలకంగా పనిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి...

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా మైదానంలోని ఇండోర్ స్టేడియంలో యోనెక్స్ సన్ రైస్ 11వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, పాఠశాల స్థాయి నుంచే వారికి ఇష్టమైన క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. మన మహబూబ్‌నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్‌తో పాటుగా క్రీడా హబ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారన్నారు. ఒలింపిక్ క్రీడలలో మన రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో క్రీడాకారుల ను పరిచయం చేయాలని, వారు దేశానికి పతకాలు తీసుకురావా లని ముఖ్యమంత్రి ఆకాంక్షిస్తున్నారని, అందుకే సిఎం కప్ లాంటి కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులలో దాగిన నైపుణ్యాన్ని వెలికితీసే ప్రయత్నం చేశారన్నారు. వచ్చే ఒలింపిక్ క్రీడలలో మన రాష్ట్రం నుంచే కాకుండా మన జిల్లా నుంచి కూడా క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలన్నారు. రానున్న రోజుల్లో జాతీయ స్థాయిలో నిర్వహించే క్రీడలను మహబూబ్ నగర్ నగరం నిర్వహించడానికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్ నగర్ జిల్లాలో మౌలిక వసతుల కల్పన కోసం, క్రీడాకారుల సదుపాయాల కోసం 11.5 కోట్లు మంజూరు చేసిందన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, హెచ్డిఎస్ మెంబెర్ బెజగం రాఘవేందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఖాజా పాషా, అంజద్, రాషెద్ ఖాన్, రాజినికాంత్, రవి తదితరులు పాల్గొన్నారు.

వినాయక లడ్డుని కైవసం చేసుకున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాని

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్ లో గత 31 సంవత్సరాలుగా వడ్డెర సంఘం ఆధ్వర్యంలో వినాయకుని ప్రతిష్టింప చేస్తున్నారు. వినాయకుడి నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజు మొదలుకొని, చివరి రోజు వరకు రాజీవ్ గాంధీ నగర్ వడ్డెర సంఘం సభ్యులు,యువకులు గణనాథుడికి ఎంతో నిష్టతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తారు.ఇందులో భాగంగానే చివరి రోజు లడ్డు వేలంలో బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఎత్తరి నాని గణపయ్య మహా ప్రసాదాన్ని 1,10,000... ఒక లక్ష పదివేల రూపాయలకు దక్కించుకున్నారు. ఎంతో నిష్టతో భక్తిశ్రద్ధలతో నిత్యం గణపయ్య మా ప్రసాదాన్ని దక్కించుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఎత్తరి నాని, వడ్డెర సంఘం సభ్యులు పేర్కొన్నారు.

కోదండరామ్‌ను కలిసిన నాయకులు

విశాలాంధ్ర - తుర్కయంజల్ : టి జె ఎఫ్ అధ్యక్షులు నూతనంగా ఎన్నుకోబడిన ఎమ్మెల్సీ తెలంగాణ ఉద్యమకారులు ప్రొఫెసర్ కోదండరాం జన్మదిన సందర్భంగా తార్నాకలోని తన నివాసంలో కోదండరాంను టి జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జెనిగె విష్ణువర్ధన్, జోగు అంజయ్య, ఉమ్మడిరంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంతం యాది రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపల్ అధ్యక్షులు అందే కార్ బాబూలాల్, నాంపల్లి సుదర్శన్ వర్మలు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అవినీతి అక్రమాలపై విచారణ జరపాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాల నరసింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి ప్రజల సొమ్మును కాపాడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ డిమాండ్ చేశారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా సమితి సమావేశం కొండికంటి పద్మావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం.బాలనరసింహ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి బ్యాంక్ చైర్మన్, కొద్దిమంది అధికారుల కాసుల వేటలో కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ పూర్తిగా అవినీతిమయంలో కూరుకుపోయిందని మండిపడ్డారు. బ్యాంకులో ఒక్కరిద్దరి ఉన్నత స్థాయి అధికారులు సొంత నిర్ణయాలతో చలామణి అవుతూ ఉద్యోగులను సైతం వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. పే స్కేల్ లేని ఉద్యోగులను బదిలీలు చేయడానికి ప్రభుత్వ నిబంధనలు లేకున్న కూడా బదిలీలు చేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఉద్యోగులు బదిలీలు అయితే అనేక సమస్యలు ఉత్పన్నమైతే రైతులు ఇబ్బందులకు గురి అవుతారని అన్నారు. డీసీబీ బ్యాంకులో జరిగినటువంటి అన్ని పనులు కొనుగోళ్లపైన సమగ్రమైన విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల డిసిసిబి బ్యాంక్ పరిధిలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. రైతులకు అండగా ఉన్న బీసీసీబి బ్యాంకు వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశలో చర్యలు ఉన్నాయని ఆరోపించారు. కోట్ల రూపాయల అవినీతి జరిగినట్లు ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ప్రాథమిక సహకార సంఘాలకుపూర్తిస్థాయిలో చైర్మన్ లను కేటాయించకపోవడం చేత రైతులకు తగిన సహాయం అందడం లేదని అన్నారు. కనుక జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని విచారణ చేపట్టి బ్యాంకులో జరుగుతున్న అవినీతి అక్రమల అరికట్టాలని డిమాండ్ చేశారు. పార్టీ గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు మహాసభలను పూర్తి చేసుకున్నామని ఈ మహాసభలలో ప్రజలకు సంబంధించిన అనేక అంశాలను తీర్మానాలు చేశామని తీర్మానాల అమలుకై ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమవుతామని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 11 నుండి 17 వరకు జరుగుతున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల్లో భాగంగా విస్తృతంగా సాయుధ పోరాట అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ సభలు సమావేశాలు ర్యాలీలు నిర్వహించాలని అన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు, డిసిసిబి మాజీ డైరెక్టర్ యం.నరేందర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి బి బాలకిషన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సురేష్, డి.రాము, గోవర్ధన్, బాగీ కృష్ణ యాదవ్, జిల్లా సమితి సభ్యులు శ్రీను, చాంద్ భాషా, ఆంజనేయులు, మహేష్, దేవానంద్, సత్యనారాయణ రెడ్డి, భార్గవి, శివ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : గత 9 రోజుల నుంచి ప్రత్యేక పూజలు అందుకొని గంగమ్మ ఒడికి చేరుతున్న వేళ నిర్వహించే నిమజ్జన వేడుకలను ప్రశాంతమైన వాతవరణంలో నిర్వహించుకోవాలని మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ తెలిపారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు కార్యాలయం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిమజ్జన ఉత్సవాలను ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం లడ్డువేలం పాటలో గ్రామానికి చెందిన చాకలి సాయికుమార్ రూ.2.51 లక్షలకు లడ్డును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ రవియాదవ్, మాజీ సర్పంచ్ రాజయ్య యాదవ్, మాజీ జెడ్పీటీసీ కంజర్ల భాస్కర్, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు వినాయకులు గంగమ్మ ఒడికి తరలివెళ్తున్నాయి. అన్నదాన కార్యక్రమాలను ఉత్సవ నిర్వహకులు ఏర్పాటు చేశారు.

వరద ప్రభావిత రాష్ట్రాలను కేంద్రం ఆదుకోవాలి

విశాలాంధ్ర, బషీర్ బాగ్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎలాంటి వివక్ష చూపకుండా వరద ప్రభావిత రాష్ట్రాలకు వెంటనే నిధులు అందించి ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం తాలిబాన్ పాలిత ఆఫ్ఘనిస్తాన్‌కు సహాయం పంపుతున్నప్పటికీ, వరదలతో బాధపడుతున్న తెలంగాణ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, ఉత్తర్‌ఖండ్‌లోని తన సొంత పౌరులకు ప్రత్యేక సహాయ ప్యాకేజీని ప్రకటించడంలో విఫలమవడం దురదృష్టకరం అన్నారు. లిబర్టీ, ఆప్ రాష్ట్ర కార్యాలయంలో వరద ప్రభావిత రాష్ట్రాలకు ప్రజలు సహాయం అందించి ఆదుకోవాలని ఆప్ గోడపత్రికను ఆప్ రాష్ట్ర నాయకులూ బుర్ర రాము గౌడ్, విజయ్ మల్లంగి, నర్సింగ్ యమునా గౌడ్, జిల్లోజు హేమ, జావీద్ షరీఫ్, దర్శనం రమేష్, రాకేష్ రెడ్డి, తదితరులతో కలసి డాక్టర్ దిడ్డి సుధాకర్ విడుదల చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ, పంజాబ్‌తో పాటు కొన్ని రాష్ట్రాల్లో భారీ వర్షాల కారణంగా లక్షల ఎకరాల్లో పంటలు, ఇళ్లు దెబ్బతిన్నాయని, ప్రజలు జీవనోపాధి కోల్పోయరని తెలిపారు. అరవింద్ కేజ్రీవాల్ పై కక్షతో ఆప్ పాలిత పంజాబ్ సంక్షోభం పట్ల మోదీ ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శిస్తుందని ఆరోపించారు. వినాశకరమైన వరద బాధితుల సహాయార్థం ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ, రాష్ట్ర వ్యాప్తంగా విరాళాలు స్వీకరిస్తుందని, ప్రజలు ఉదారంగా స్పందించి సహాయ సహకారాలు అందించాలని డాక్టర్ దిడ్డి సుధాకర్ విజ్ఞప్తి చేశారు.

9న ఇందిరా పార్క్‌లో సాధన దీక్ష

విశాలాంధ్ర, బషీర్ బాగ్: వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో వైశ్యుల ఆత్మగౌరవం- హక్కుల సాధనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా కొరకు చేపట్టే "సాధన దీక్ష" ను విజయవంతం చేద్దామని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్తా తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన ఇందిరా పార్కు (ధర్నా చౌక్)లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాధన దీక్ష కార్యక్రమం ఉంటుందని తెలిపారు. రాజకీయల కతీతంగా నిర్వహించే సాధన దీక్షకు వైశ్యులు అందరూ తరలివచ్చింద విజయ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జనాభా దామాషా ప్రకారం వైశ్యులకు స్థానిక సంస్థలలో రాజకీయ వాట కల్పించాల్సిందేనని అన్నారు. సంఘం పేరు చెప్పుకొని కొంతమంది పదవులు అనుభవించి వైశ్య జాతికి కోసం , వైశ్యులలో పేదల కోసం ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదని అన్నారు.

వైశ్య వికాస వేదిక సంఘం ఏర్పడి దాదాపు 8 సంవత్సరాలు నుండి పూర్తిగా పేద వైశ్యుల కోసం నీ బాధ్యత తోటి పనిచేస్తున్న ఏకైక సంస్థని అన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక కోశాధికారి కండె రాం నరేష్, ట్రస్ట్ సభ్యులు కొత్త రవి, కొత్తూరు వీరేందర్, విద్యావంతుల వేదిక సభ్యులు బుద్ధ ప్రవీణ్, శ్రీకాకోళ్ల రాజు గుప్త, మనోహర్, గజవాడ సత్యనారాయణ, మురళి, వేణు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AND J.M.F.C AT RAMANAGARA

EX NO. 33 of 2024

DECREE HOLDER : 1. Sri. A.S. Anandaraju S/o Siddaiah, Aged about 38 years, R/at No. 19, 14/A Cross, Viewars J.P. Nagara, Sarakki Gate, Kanakapura Main Road-72
2.Sri. H.R. Ravikeerthi S/o Rajashekarappa, Aged about 61 Years, R/at Malappanahalli, 8th Cross, Kalidasa Road, Chitradurga District. V/s

JUDGMENT DEBTORS : 1.M/s DREAMLAND VENTURES (P) LTD,
Office located at # 4, New No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara Bengaluru-560 027. Represented by Directors
2.Sri. Chinnappa Sreenivasa Reddy aged about 49 Years. 3.Sri.Lal Ahammad Khan Pattan. Aged about 51 years 4.Sri. Avva Venkata Rama Rao aged about 47 years. JUDGMENT DEBTORS No.2 TO 4 Having office at # 4, New No.100, Plot No. 48, 2nd Floor, K H Road, Sudhamanagar, Bengalore-27.
5. SRI. G. DHARMA PRAKASH S/o H.Govindappa. aged about 56 Years, Authorized signatory Office at #4 New 100, Plot No.48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru-560 027.

NOTICE

Whereas, the above named decree holder filed this execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.
The Notice sent through court as well as RLAD, But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court 9/10/25 at about 11.00 AM., either personally or through counsel and to file objection if any, if you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the Schedule property residential vacant bearing site No. 52. Katha No. 34, formed in Sy. No. 14 and 15 measuring East to West: 60 Feet. North to South: 40 Feet, in Total Measuring 2400 sq Feet, area formed in 14 and 15 situated at Lakshmisagara Village, Bidadi Hobli, Ramanagara Taluk: and District, vide conversion order No. ALN (R) CR-49/2008-2009 dated 12-02-2009, Issued by the deputy commissioner, Ramanagara District and layout plan approved by the Bangalore Mysore infrastructure carder Area Planning Authority (BMICAPA) /09/052/2011-12, bounded on
East by : Plot No. 5,
West by : Proposed 10 M Wide Road,
North by : Plot No. 53, South by : Plot No. 51.
Given as per the orders and seal of this Hon'ble court, on this 2nd day of September 2025 at Ramanagara

By Order of the Court
Sd/- Sheristedar
Civil Judge (Sr DVN) & CJM Court, Ramanagara

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AND J.M.F.C. AT RAMANAGARA

EX NO. 34 of 2024

DECREE HOLDER : 1. Sri.S.Ramesh S/o Rajanna, Aged about 48 years, 2. Smt. R. Radhika W/o S. Ramesh, Aged about 35 years, Bothe are R/at No.7, 9th Cross, Gullappa Road, Ramaswamy Palya, Kammanahalli Main Road, Bengaluru -560033. Presently Residing at:No.78, Ground Floor, Fortune Garden City, Layout Billakempanahalli, Railway Gate, Billakempanahalli, Bidadi Hobli, Ramanagara Taluk and District -562159. -V/s-

JUDGMENT DEBTORS : 1.M/s DREAMLAND VENTURES (P) LTD,
Office located at # 4, New No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara Bengaluru-560 027. Represented by Directors
2.Sri. Chinnappa Sreenivasa Reddy aged about 50 Years. 3.Sri.Lal Ahammad Khan Pattan. Aged about 51 years 4.Sri. Avva Venkata Rama Rao aged about 48 years. JUDGMENT DEBTORS No.2 TO 4 Having office at # 4, New No.100, Plot No. 48, 2nd Floor, K H Road, Sudhamanagar, Bengalore-27.
5. SRI. G. DHARMA PRAKASH S/o H. Govindappa. aged about 56 Years, Authorized signatory Office at # 4 New # 100, Plot No.48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru -560 027.

NOTICE

Whereas, the above named decree holder filed this execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.
The Notice sent through court as well as RLAD, But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court 9/10/25 at about 11.00 AM., either personally or through counsel and to file objection if any, if you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the Schedule property residential vacant bearing site No. 183. Katha No. 34, formed in Sy. No. 49 measuring East to West: 40 Feet. North to South: 30 Feet, in Total Measuring 1200 sq Feet, area formed in 49 situated at Lakshmisagara and Bheemenahalli village, Bidadi Hobli, Ramanagara Taluk: and District, vide conversion order No. ALN (R) CR-54/2008-2009 dated 12-02-2009, issued by the deputy commissioner, Ramanagara District and layout plan approved by the Bangalore Mysore infrastructure carder Area Planning Authority (BMICAPA) /09/052/2011-12, bounded on East by : Site No.166,
West by : Proposed 10 M Wide Road
North by : Plot No.184, South by : Plot No.182,
Given as per the orders and seal of this Hon'ble court, on this 2nd day of September 2025 at Ramanagara

By Order of the Court
Sd/- Sheristedar
Civil Judge (Sr DVN) & CJM Court, Ramanagara

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AND J.M.F.C. AT RAMANAGARA

EX NO. 36 of 2024

DECREE HOLDER : 1.Smt. Noorjahan W/o Yousuff Khan Aged about 60 years, R/at No.1177, 6th Cross, Sulthan Palya, R.T. Nagara, Bengaluru-560032. -V/s-

JUDGMENT DEBTORS : 1.M/s DREAMLAND VENTURES (P) LTD,
Office located at # 4, New No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara Bengaluru-560 027. Represented by Directors
2.Sri. Chinnappa Sreenivasa Reddy aged about 50 Years. 3.Sri.Lal Ahammad Khan Pattan. Aged about 51 years 4.Sri. Avva Venkata Rama Rao aged about 48 years. JUDGMENT DEBTORS No.2 TO 4 Having office at # 4, New No.100, Plot No. 48, 2nd Floor, K H Road, Sudhamanagar, Bengalore-27.
5. SRI. G. DHARMA PRAKASH S/o H. Govindappa. aged about 58 Years, Authorized signatory Office at # 4 New # 100, Plot No.48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru -560 027.

NOTICE

Whereas, the above named decree holder filed this execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.
The Notice sent through court as well as RLAD, But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court 9/10/25 at about 11.00 AM., either personally or through counsel and to file objection if any, if you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the Schedule property residential vacant bearing site No.184, Katha No. 34, formed in Sy. No. 49 and 50 measuring East to West: 40 Feet. North to South: 30 Feet, in Total Measuring 1200 sq Feet, area formed in Sy. No. 49 and 50 situated at Bheemanahalli Village, Bidadi Hobli Ramanagara Taluk: and District, vide conversion order No. ALN (R) CR-47/2008-2009 dated 12-02-2009, Issued by the deputy commissioner, Ramanagara District and layout plan approved by the Bangalore Mysore Infrastructure carder Area Planning Authority (BMICAPA) /09/052/2011-12, bounded on
East by : Plot No.165,
West by : Road, North by : Plot No.185,
South by : Plot No.183,
Given as per the orders and seal of this Hon'ble court, on this 2nd day of September 2025 at Ramanagara

By Order of the Court
Sd/- Sheristedar
Civil Judge (Sr DVN) & CJM Court, Ramanagara

IN THE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AND J.M.F.C. AT RAMANAGARA

EX NO. 35 of 2024

DECREE HOLDER : 1. Sri. Omprakash, S/o Puttaswamy. Aged about 49 years, R/at A.B. Halli, Bharathi Nagara Post, Maddur Taluk. Mandya District. -V/s-

JUDGMENT DEBTORS : 1.M/s DREAMLAND VENTURES (P) LTD,
Office located at # 4, New No. 100, Plot No. 48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara Bengaluru-560 027. Represented by Directors
2.Sri. Chinnappa Sreenivasa Reddy aged about 49 Years. 3.Sri.Lal Ahammad Khan Pattan. Aged about 51 years 4.Sri. Avva Venkata Rama Rao aged about 47 years. JUDGMENT DEBTORS No.2 TO 4 Having office at # 4, New No.100, Plot No. 48, 2nd Floor, K H Road, Sudhamanagar, Bengalore-27. 5. SRI. G. DHARMA PRAKASH S/o H. Govindappa. aged about 56 Years, Authorized signatory Office at #4 New 100, Plot No.48, 2nd Floor, K.H. Road, Sudhama Nagara, Bengaluru -560 027.

NOTICE

Whereas, the above named decree holder filed this execution petition before this Hon'ble court based on the judgment and decree passed in the original suit, for obtaining the deed in respect of the execution petition schedule property.
The Notice sent through court as well as RLAD, But you have been deliberately evaded the same. Hence, you are hereby informed through this notice to take notice and to appear before this Hon'ble Court 9/10/25 at about 11.00 AM., either personally or through counsel and to file objection if any, if you fail to appear, on that day, the above execution petition will be heard and determined in your absence as exparte.

SCHEDULE

All that piece and parcel of the Schedule property residential vacant bearing site No. 01. Katha No. 34, formed in Sy. No. 14, measuring East to West: 62 Feet. North to South: 36 Feet, in Total Measuring 2232 sq Feet, area formed in Sy. No. 14 situated at Lakshmisagara Village, Bidadi Hobli, Ramanagara Taluk: and District, vide conversion order No. ALN (R) CR-54/2008-2009 dated 12-02-2009, issued by the deputy commissioner, Ramanagara District and layout plan approved by the Bangalore Mysore infrastructure carder Area Planning Authority (BMICAPA) /09/052/2011-12, bounded on East by : Road, West by : Site No.55, North by : Private Property, South by : Site No.2, Given as per the orders and seal of this Hon'ble court, on this 2nd day of September 2025 at Ramanagara

By Order of the Court
Sd/- Sheristedar
Civil Judge (Sr DVN) & CJM Court, Ramanagara

న్యాక్ ట్రైనర్‌కు జాతీయ అవార్డు రావడంపై మంత్రి హర్షం

రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహలతను అభినందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌ను అత్యుత్తమ స్కిల్ డెవల్మపెంట్ వేదికగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, న్యాక్ వైస్ చైర్మన్ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి చేస్తున్న కృషికి ఫలితం దక్కుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు విద్యార్థుల్లో స్కిల్ డెవల్మపెంట్ పెంపొందించాలనే లక్ష్యంతో ఇప్పటికే ప్రజా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్ ఏర్పాటు చేస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్ వేదికగా,జిల్లాల్లో న్యాక్ ద్వారా శిక్షణ ఇవ్వడమే కాకుండా.. 100 శాతం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నాక్ వైస్ ఛైర్మన్, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేందుకు మంత్రి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. ఈ నేపథ్యంలోనే.. టీచర్స్ డే పురస్కరించుకొని న్యాక్ ట్రైనర్ స్నేహలతకు రాష్ట్ర పతి చేతుల మీదుగా జాతీయ అవార్డు రావడం పట్ల మంత్రి తన హర్షం వ్యక్తం చేశారు. మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ఎంటర్ ప్రెన్యూర్షిప్ విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా శుక్రవారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ టీచర్స్ అవార్డు అందుకున్న న్యాక్ ట్రైనర్ స్నేహలతకు ఫోన్ చేసి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆమె న్యాక్ ద్వారా నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లా, కరీంనగర్, జగిత్యాల పట్టణాల్లో నిరుద్యోగ యువతకు సర్టిఫికెట్ కోర్సులు, ఉద్యోగ అవకాశాలు కల్పించే వృత్తివిద్యా కోర్సులను అందిస్తూ, ఉత్తమ బోధన అందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కిందని కొనియాడారు. దేశ వ్యాప్తంగా 13 మంది ఈ వార్డుకు ఎంపికైతే తెలంగాణ నుండి న్యాక్ ఇన్‌స్ట్రక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హన్మకొండకు చెందిన నక్క స్నేహలతకు అవార్డు రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వ కారణం అన్నారు. నైపుణ్యాలకు ఉత్తమ వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్‌ను బలోపేతం చేస్తున్నామని పేర్కొన్న మంత్రి, ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు దక్కడంతో న్యాక్ ఫ్యాకల్టీ, సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపిందన్నారు. స్నేహలతను ప్రోత్సహించిన న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. రాష్ట్ర పతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్నేహలతకు న్యాక్ డైరెక్టర్ జనరల్ (డీజీ), ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ అభినందనలు తెలిపారు.

గణపతి లడ్డును దక్కించుకున్న బూడిద వెంకటేష్

విశాలాంధ్ర - జవహర్ నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం, 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో నిర్వహించిన 9 రోజుల గణపతి నవరాత్రుల్లో భాగంగా భక్తి శ్రద్ధలతో నిత్య పూజాలందున్న గణపతి వద్ద లడ్డు వేలం పాట నిర్వహించడం జరిగింది.కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు బూడిద వెంకటేష్ లడ్డు వేలంపాటలో 57,116 ధరకు వెంకటేష్ కుటుంబ సభ్యులు 11 కేజీల గల గణపతి లడ్డు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ సారి గణనాధుని లడ్డు దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జవహర్ నగర్ బస్తీ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో గణపతి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

విశ్వకర్మ జయంతికి ప్రభుత్వం సెలవు ప్రకటించాలి

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాటేదాన్ శాంతినగర్‌లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అని రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అధ్యక్షులు పులిగిల్ల శ్రీనివాసాచారి అన్నారు. ఈ మేరకు భక్తులు, విశ్వకర్మ బంధువులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పులిగిల్ల శ్రీనివాసాచారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశ్వకర్మ జయంతిని అధికారికంగా గుర్తించి సెలవును ప్రకటించిందని, రాష్ట్రప్రభుత్వం సైతం అధికారికంగా సెలవు ప్రకటించాలన్నారు. విరాట్ విశ్వకర్మ సృష్టికర్త అని, అలాంటి సృష్టికర్త మార్గదర్శకత్వంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ జీవితాన్ని గొప్పగా సాగించాలన్నారు. విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని ఈ నెల 17వ తేదీన యజ్ఞం కార్యక్రమాలను సైతం నిర్వహించనున్నట్లు వివరించారు. అందులో భాగంగా ఉదయం 7 గంటలకు విశ్వకర్మ పూజ, విశ్వకర్మ యజ్ఞం, మహాసభ, మహాప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు కులబాంధవులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు పులిగిల్ల శ్రీనివాసాచారి, దేవాలయ కమిటీ సభ్యులు పులిగిల్ల జ్ఞానేశ్వర్‌చారి, ఆలయ ప్రధాన కార్యదర్శి కాసోజు మాధవా చారి, రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు రాంపల్లి రవీంద్రచారి, మారోజు నరేంద్రచారి, వెంకటస్వామి చారి, విశ్వకర్మ యువజన సంఘం అధ్యక్షులు సిహెచ్ జగన్‌మోహన్ చారి, యజ్ఞకమిటీ అధ్యక్షులు వడ్ల ఆంజనేయులుచారి, ప్రధాన కార్యదర్శి సిహెచ్ దిలీప్ చారి, కార్య నిర్వాహణ అధ్యక్షులు వైనోజు మహేష్‌చారి, ఉపాధ్యక్షులు పసునూరి చండీశ్వర్, అంతారం కృష్ణచారి, పులిగిల్ల గోవింద్‌చారి, గౌరోజు శ్రీధర్‌చారి, కాసోజు విశ్వంచారి, కోశాధికారి సంతోష్‌చారి, పులిగిల్ల రమేష్‌చారి, నారోజు రాజేంద్రచారి, పాల్గొన్నారు.

జామియా మస్జీద్‌లో అసారే ముబారక్ కార్యక్రమం

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: మొహమ్మద్ ప్రవక్త జయంతి ని పురస్కరించు కొని శుక్రవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ ఫరూక్ నగర్ లోని జామే మస్జీదులు ఇమామ్ సయ్యద్ షాబుద్దీన్, సయ్యద్ అజరుద్దీన్ హాఫెజ్ ఆధ్వర్యంలో ఘనంగా ఆ సారే ముబారక్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముస్లిం మత పెద్దలు సయ్యద్ రావుఫ్ అలీ హాఫెజ్, మునవర్ అలీ హాఫేస్, షఫీ హాఫెజ్, సయ్యద్ నదీమ్ హాఫెజ్, షోయబ్ అత్తరి హాఫిజ్, యాకూబ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రావుఫ్ అలీ హాఫెజ్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త స్తుతించిన పవిత్ర జలం త్రాగితే అన్ని రోగాలు నయమవుతాయని అన్నారు. శాంతి సహనానికి సఖ్యతకు, మహమ్మద్ ప్రవక్త బోధనలు చిహ్నం అని అన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త వెంట్రుకలను ప్రదర్శించారు. వీటిని తిలకించేందుకు ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు, యువకులు, పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

నాగమయ్య కుంట శ్యామ్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద జరిగిన అన్నప్రసాద కార్యక్రమలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగేశ్ ముదిరాజ్ పాల్గొన్న దృశ్యం
- విశాలాంధ్ర - జూబ్లీహిల్స్

కార్మికుల హక్కులు అడిగితే దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులా?

విధులు బహిష్కరించి జనరల్ ఆసుపత్రి ఎదుట కార్మికుల ఆందోళన

విశాలాంధ్ర - హైదరాబాద్ : కార్మికుల హక్కులు అడిగితే దౌర్జన్యం దాడులు చేయడమే కాక అక్రమ కేసుల్లో ఇరికించే విధంగా తప్పుడు ఫిర్యాదులు చేస్తారా అని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్రాంచ్ నేతలు మండిపడ్డారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కార్మికులపై శానిటేషన్ ఇన్స్పెక్టర్స్ వేధింపులు ఆపాలని ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ నేతృత్వంలో గురువారం జరిగిన ఆందోళన నేపథ్యంలో సి హెచ్ ఓ రాంనాయక్,యస్ హెచ్ ఓ నరేందర్‌లు కుట్రపూరితంగా యూనియన్ లీడర్ సురేష్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు రాత్రి మహబూబ్ నగర్ టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పై మోపిన అక్రమ కేసు ఫిర్యాదు చేశారని ఫిర్యాదును నిరసిస్తూ శుక్రవారం ఉదయం జనరల్ ఆసుపత్రి కార్మికులు కార్మికులను వేధింపులకు గురి చేస్తున్న సి హెచ్ ఓ రాం నాయక్, యస్ హెచ్ ఓ నరేందర్ లను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ రెండో రోజు మళ్ళీ విధులు బహిష్కరించి ఆసుపత్రి ఎదుట బేఠాయించి ఆందోళన కొనసాగించారు. కార్మికుల ఆందోళన దగ్గరికి ఆసుపత్రి ఆర్, యం, ఓ డాక్టర్ సమత చేరుకొని కార్మికులతో చర్చలు జరిపి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర సృష్టికి ఆందోళన విషయం తీసుకెళ్లామని ఎలాంటి సమస్య ఉన్న సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని చెప్పడంతో కార్మికులు ఆందోళన విరమించి విధుల్లో చేరారు. అనంతరం మహబూబ్‌నగర్ రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సి.హెచ్.ఓ రామ్ నాయక్, ఎస్‌హెచ్‌ఓ నరేందర్‌ల వేధింపులపై కార్మికులు ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి బ్రాంచ్ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) మాట్లాడుతూ రోగుల మలమూత్రాలు ఎత్తిపోస్తూ చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులను సిహెచ్‌ఓ రామ్ నాయక్ ఎస్‌హెచ్‌ఓ నరేందర్‌లు పని కట్టుకొని ఉద్దేశపూర్వకంగా నరకయాతనకు గురి చేస్తున్నారని అన్నారు. గతంలోను సి హెచ్ ఓ రామ్ నాయక్ పై అవినీతి అక్రమాలు, ఆసుపత్రి సూపరిండెంట్ ఆర్ఎంఓ లాంటి అధికారులను సైతం అనుచిత ఆరోపణలు చేస్తూ కించపరిచిన ఆరోపణలు ఉన్నాయని, ఫోర్త్ క్లాస్ ఉద్యోగులను చిన్న చూపు చూస్తూ చెప్పరాని మాటలతో హింసించిన సంఘటనలు అనేకమని అన్నారు. వీటిని ఎప్పటికి ఎప్పుడు ప్రశ్నిస్తూ కార్మికుల పక్షాన నిరంతరం ఎన్ని ఆటంకాలు, కుట్రలు, ప్రలోభాలు పన్నిన వారి ఆగడాలను ఎండగడుతున్నందునే ఏఐటీయూసీ మెడికల్ యూనియన్ నేత పి.సురేష్‌పై కక్ష పెంచుకొని దాడులు దౌర్జన్యాలతో అక్రమ కేసుల్లో ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని, అందులో భాగంగానే కరెంటు సమస్యలపై మాట్లాడదానికి వెళ్లిన యూనియన్ లీడర్ సురేష్ పై పక్క ప్రణాళికతో దాడి చేశారన్నారు. వైద్య శాఖ అధికారులు తక్షణమే సంఘటనపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి బ్రాంచ్ నాయకులు, కార్మికులు చెన్నయ్య, నరసింహ, మొగులన్న, రంగయ్య, దేవానంద్, శ్రీశైలం, శేఖర్, శంకర్, బాల్ రాజ్, శంకర్ నాయక్, గోపాల్ నాయక్, రాఘవేందర్, గొండెలి యాదయ్య, యాదగిరి, భీమయ్య, నరేష్, శ్రీను,మన్యం,ప్రవీణ్, లోకేష్, బాల్ కోటి, అంజలయ్య, వెంకటేష్, మహేష్, బుచ్చన్న, పద్మ, సత్యమ్మ, వసంత, నాగమ్మ, లక్ష్మమ్మ,అలివేలు, ఇందిరా, ఎల్లమ్మ, కవిత, బాలమని, నాగమణి, అనిత, సంధ్య, చంద్రకళ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే నెంబర్‌వన్ మున్సిపాలిటీగా తుర్కయంజల్

విశాలాంధ్ర - తుర్కయంజల్ : రాష్ట్రం లోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ మారబోతుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఇంజాపూర్‌లోని మైత్రి మీడోస్, నీలాద్రి కాలనీ, ఆపిల్ కాలనీ, తిరుమల నగర్ కాలనీ, హనుమాన్ దేవాలయం గణేష్ మండపాలను కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడు చూడని అభివృద్ధిని మేము చూస్తున్నాము అని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారనీ 40000 పైగా మెజారిటీ ఇచ్చి నన్ను గెలిపించుకున్నారనీ ఇప్పటికే 150 కోట్లకు పైగా నిధులతో మున్సిపాలిటీని శరవేగంగా అభివృద్ధి చేస్తునాన్నని మరో 74 కోట్ల నిధులను నియోజకవర్గం లోని మున్సిపాలిటీలకు ఇవ్వాలని ముఖ్యమంత్రిని కోరడం జరిగిందనీ అన్నారు. ఎల్ బి నగర్ నియజకవర్గం జిహెచ్ఎంసీ ప్రాంతంలో అనేక కాలానిల దుస్థితి చూసి చలించిపోయానని, ఈ విషయాన్నీ అసెంబ్లీలో ప్రస్థావిస్తానని తెలిపారు. ఔటర్ వెలుపల తుర్కయంజాల్ పరిధిలో అన్ని రోడ్లను నాలుగు లెన్ల రోడ్లుగా మారుస్తానని చెప్పడం జరిగింది. ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాది అని అన్నారు. తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయం లాగే మునగనూరులో ఒక పెద్ద ఆలయాన్ని నిర్మిస్తున్నాము అని, ఈ ఆలయానికి తిరుమలగా నామకరణం చేయబోతున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా సమస్యలు తీర్చడంలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ అధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చివరిరోజు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్నికి ముఖ్య అథితిగా హజరైన వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విష్ణుశ్ మాట్లాడుతూ విగ్నేశ్వర కన్నుల పండుగను ఆనందంగా గణపతి నవరాత్రులు నిత్య నూతనంగా నిష్ట నమ్రతతో మనకు విగ్నేశ్వరుని ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుతూ, యూత్ కమిటీ సభ్యులను అభినందించారు. నవరాత్రి ఉత్సవాల చివరి రోజు లడ్డు వేలం పాట వేశారు. ఈ ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు పల్లపు రమేష్ ఆధ్వర్యంలో నిర్వంచారు. పెద్ద లడ్డు ను 50000 వేలకు పల్లపు వెంకటేష్ కైవసం చేసున్నారు. చిన్న లడ్డు ను 36000 వేలకు పల్లపు పరమేష్ కైవసం చేసుకున్నారు.

జీఎస్టీ తగ్గింపుతో రాష్ట్రాలకు భారం

విశాలాంధ్ర - మొయినాబాద్ : జీఎస్టీ రేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రాలపై తీవ్ర భారం పడుతుందని... ఇది కేవలం బీహార్ ఎన్నికల స్టంట్ అని చేవెళ్ల యువజన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గౌండ్ల నిరంజన్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ కొత్త జీఎస్టీ సంస్కరణలు అమలు చేసిన తర్వాత రాష్ట్రాలు ఎదుర్కొనే ఆదాయ నష్టాన్ని ఎలా పూడుస్తారనే విషయాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్పష్టం చేయడం లేదని విమర్శించారు. జీఎస్టీ రేట్ల కోతల వల్ల రాష్ట్రాలు తమ పన్ను వసూళ్లలో రూ.8వేల కోట్ల నుంచి రూ.10 వేల వరకు నష్టపోతాయని చెప్పారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జీఎస్టీ స్లాబ్ల మార్పు కేవలం బీహార్ ఎన్నికల స్టంట్ అని ఆరోపించారు. 2017లో జీఎస్టీనీ ప్రవేశపెట్టినప్పుడు అప్పటి ప్రదాని మోడీ వేద మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 7 సంవత్సరాల తరువాత స్లాబ్లలో కొంత తగ్గింపు చేసి దానిని ఎన్నికల ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని మం డిపడ్డారు. అయినప్పటికీ పన్ను తగ్గింపులు పేద, రైతులు, మధ్యతరగతి కుటుంబాలకు కొంత ఉపశమనం ఇస్తాయని అభిప్రాయంతో స్వాగతిస్తున్నట్లు చెప్పారు. నిజమైనా ప్రజా సంక్షేమం కోసం జీఎస్టీ స్లాబ్లను మరింత తగ్గించి రైతులు, పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఎక్కువగా లాభం చేకూర్చే విధంగా చేయాలని నిరంజన్ గౌడ్ డిమాండ్ చేశారు.

‘పీజే జ్యువెలర్స్’ దినదినాభివృద్ధి చెందాలి

విశాలాంధ్ర-దుండిగల్: అతివలతో పాటు అందరినీ ఆకట్టుకునేలా పీజే జ్యువెలర్స్ దినదినాభివృద్ధి చెందాలని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గం కొంపల్లి జాతీయ రహదారిలో నూతనంగా ఏర్పాటుచేసిన “పీజే జ్యువెలర్స్”ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కలిసి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ఆధునిక డిజైన్లతో అతివలతో పాటు అందరినీ ఆకట్టుకునేలా పీజే జ్యువెలర్స్ మంచి పేరు సంపాదించాలని, దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చింతల దేవేందర్ రెడ్డి, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, దప్పు కిరణ్, నాయకులు, శ్యామ్, యాదగిరి, నిర్వాహకులు పద్మజ, పవన్ కుమార్, స్వప్న, నవీన్ కుమార్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ధన్వంతరి ఇంటర్నేషనల్ సంస్థ (డీఎఫ్ఐ) ఆస్తులు అమ్మి బాధితులకు న్యాయం చేయాలని ధన్వంతరి అగ్రీవ్డ్ ఇన్వెస్టర్స్ అసోసియేషన్ (డీఏఐ) కోరింది. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఏఐ అధ్యక్షులు అన్నం రాజు నాగరాజు, మాజీ అధ్యక్షులు ఆత్రేయ శర్మ, సెక్రటరీ అచ్యుతనంద రంగారావు, వైస్ ప్రెసిడెంట్ సుసర్ల నర్సింహమూర్తిలు మాట్లాడుతూ బాధితులకు అనుకూలంగా నాంపల్లి ఏంఎస్జే కోర్ట్ తీర్పు వెలువరించిందని, తీర్పు అనుకూలంగా రావడానికి కృషి చేసిన సీసీఎస్ డీసీపీ శ్వేతా, ఏసీపీ ఆదినారాయణలకు కృతజ్ఞతలు తెలి పారు. సీసీఎస్ ఆఫీసర్స్ సలహా, సూచనల మేరకు ఈ అసోసియేషన్ స్థాపించి డీఎఫ్ఐ సంస్థలో పెట్టు బడి పెట్టి మోసపోయిన వివిధ సంస్థలను, వ్యక్తులను ఒక తాటిపై తీసుకొచ్చి 400 మంది సభ్యులతో అసోసియేషన్ ఏర్పడిందని వివరించారు. 1700 మంది బాధితులు 220 కోట్ల పైగా పెట్టుబడులు పెట్టి మోసపోయామని చెప్పారు. ఇందులో చాలా మంది వృద్ధులని పేర్కొన్నారు. ఎన్నో ప్రయాసలు ఓర్చి దాచుకున్న సొమ్మును అధిక వడ్డీ ఆశపడి కి డీఎఫ్ఐ లో పెట్టుబడి పెట్టి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ధన్వంతరి సంస్థ వారు బాధితులతో సామరస్య పూర్వకంగా పరిష్కార దిశగా ప్రయత్నం చేయాలని డీఏఐ కోరింది. బాధితులకు మూలధనంతోపాటు వడ్డీ సొమ్ము చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

విశాలాంధ్ర - షాద్‌నగర్ రూరల్: మన జీవితంలో తల్లిదండ్రుల తర్వాత ముఖ్యమైన స్థానం ఉపాధ్యాయులదే అని వారు మనకు చదువుతో పాటు మంచి విలువలు కూడా నేర్పిస్తారని ఉపాధ్యాయులు లేకపోతే జ్ఞానం అనే వెలుగు మన జీవితాల్లో చేరేది కాదని వారు చూపే మార్గమే మన విజయానికి పునాది అవుతుందని నిజమైన చరిత్ర సృష్టికర్త ఉపాధ్యాయుడే అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవాని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తనకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులతో పాటు నియోజకవర్గంలోని గురువులను సన్మానించి పాదాభివందనం చేసి ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన ఆదర్శప్రాయుడైన విద్యావేత్త అయిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటామని అన్నారు. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులు ముఖ్య పాత్ర పోషిస్తారని గురువులు జీవితంలో మంచి చెడులు చెప్పి జీవిత పాఠాల నేర్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర- దుండిగల్: పేద ప్రజలకు ఉచిత సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి గాండిమైస్సమ్మ డబుల్ బెడ్ రూం నందు మల్లారెడ్డి హాస్పిటల్ వైద్య బృందం బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మేగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం క్యాంపులో పలువురి పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయన చేతుల మీదుగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అనేక బస్తీలు కాలనీలు ఉన్నాయని, చాలామంది పేదలు అనారోగ్యానికి గురైనా, ప్రైవేట్ దవఖానలో మెరుగైన వైద్యం చేయించుకునే స్థితిలో లేరని, వారందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అక్బర్, సాదు యాదవ్, కాలనీ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ఏఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు రేవంత్ ముదిరాజ్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో ప్రభుత్వ పాఠశాలల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి సేవలు సమాజ నిర్మాణానికి, విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడంలో అపారమైనవని తెలిపారు. భారతదేశ మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ఆయన ఒక గొప్ప విద్యావేత్త, ఆదర్శ ఉపాధ్యాయుడు, దేశానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కృషి పట్ల గౌరవం చూపించాలనే ఆలోచనతోనే రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మనందరికీ గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షునిగా శ్రీనివాసు

విశాలాంధ్ర - మొయినాబాద్ : మొయినాబాద్ మండల ప్రధానోపాధ్యాయ సంఘం అధ్యక్షునిగా కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల విద్యాధికారి మల్లయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గెజిటెడ్ సంఘంలో ప్రధాన కార్యదర్శిగా తొల్కట్ట జిల్లా పరిషత్ ఉన్నత ఉపాధ్యాయులు రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని, విద్యార్థుల భవిష్యత్తుకు, అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు.

భారీ ధర పలికిన వినాయక లడ్డు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గల్లిక గణేష్ ఉత్సవ కమిటీ నేతాజీ నగర్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక నవరాత్రి పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా లడ్డు వేలంపాటలో గణేశుని లడ్డూ భారీ ధర పలికింది. మొదటి లడ్డు గుంటి యాదగిరి సాగర్ రూ. 2,10,000లకు దక్కించుకోగా, రెండవ లడ్డు దయాకర్ సాగర్ 1,08,000 కి కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు లడ్డును వారికి అందచేసి అభినందనలు తేలిపారు. అనంతరం వినాయక అనుగ్రహం వారి కుటుంబ సభ్యులకి ఎల్లవేళలా వుండాలని పూజలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, భక్తులు భారీ ఎత్తున పాల్గొని విజయవంతం చేసినందుకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

యువతకు ఆదర్శం సురవరం

పాఠ్యాంశంగా సుధాకరరెడ్డి చరిత్ర

సంస్మరణ సభలో నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు మాజీ సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సురవరం చరిత్రను పాఠ్యాంశంగా చేర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీపీఐ కర్నూలు జిల్లా సమితి అధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ భవనంలో సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముందుగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి... నివాళులు అర్పించారు. అనంతరం.నారాయణ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డితో కలిసి ఉద్యమాల్లో పనిచేయడమే కాకుండా తన కుటుంబానికి బంధుత్వం సైతం ఉందన్నారు. ఆయన నిండుకుండలాంటి వారని, కష్టం వచ్చినా తొణకని వ్యక్తిత్వమని పేర్కొన్నారు. మంచి ఉపన్యాసకుడే కాకుండా పోరాట యోధుడన్నారు. రాజకీయాల్లో స్పష్టమైన వైఖరితో ఉండే వాడన్నారు. ఆయన జీవితం తెరచిన పుస్తకమని, ఆయన జీవిత చరిత్ర పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. ఇలాంటి మహనీయుల చరిత్ర రాబోయే తరానికి అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో 302 మంది ప్రజాప్రతినిధులపై అంటే 47 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. అమెరికాకు వ్యతిరేకంగా చైనా, ఉత్తర కొరియా, రష్యా ఏకం కావడంతో ట్రంప్‌కు వణుకు పుట్టిందన్నారు. కమ్యూనిస్టులు కలిస్తే ప్రపంచం గడగడలాడుతుందన్నారు. సుధాకర్‌రెడ్డి కర్నూలులో విద్యార్థి ఉద్యమాలు ప్రారంభించి... సీపీఐ ప్రధాన కార్యదర్శి స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా, బడుగు బలహీన వర్గాలకు, మహిళలకు అండగా ఉంటూ పార్లమెంటు సభ్యుడిగా రెండుసార్లు విజయం సాధించినా నిరాడంబర జీవితం గడిపారన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాదిరిగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా సుధాకర్‌రెడ్డి చరిత్రను మరచిపోకుండా చర్యలు తీసుకోవాలని, కర్నూలు నగరంలో ఆయనను గుర్తుంచుకునేలా చర్యలు తీసుకోవాలని, అందుకు జిల్లా ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు.

పేదల పక్షాన నిలిచిన నేత: గఫూర్

ధనిక కుటుంబంలో పుట్టినా పేదల పక్షాన నిలిచిన వామపక్ష యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సీపీఎం సీనియర్ నాయకుడు ఎంఏ గఫూర్ కొనియాడారు. కర్నూలు నుండి విద్యార్థి ఉద్యమాలు ప్రారంభించిన సురవరం పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారని, అంతకుముందు ప్రపంచయువజన సమాఖ్యకు ఉపాధ్యక్షుడిగా పనిచేశారన్నారు. నిత్యం పేద బడుగు బలహీన వర్గాలకు అండగా పోరాడారన్నారు. చిరునవ్వుతో అందరినీ పలకరించడం సురవరం సుధాకర్‌రెడ్డి, సీతారాం ఏచూరి సొంతమన్నారు.

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ సురవరం గొప్పనేత అని, ఆయన ఎంతోమందికి ఆదర్శప్రాయుడన్నారు. పార్టీలు, సిద్ధాంత విభేదాలు ఉన్నా.. వ్యక్తిగత జీవితంలో ఎంతో ప్రేమగా ఉండేవారన్నారు. నిత్యం పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా కార్మిక, కర్షక వర్గాలకు అనుకూలంగా తాను నమ్మినసిద్ధాంతం కోసం చివరి వరకు కట్టుబడిన వ్యక్తి అన్నారు. కర్నూలు నగరంలో సురవరం పేరుచిరస్థాయిగా నిలిచిపోయేలా చేపట్టే ఎటువంటి కార్యక్రమానికైనా తనవంత సహాయసహకారాలు అందిస్తానన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమాలతోపాటు కర్నూలు జిల్లా మలగవెల్లిలో భూపోరాటం చేసి 1100 ఎకరాలు పేదలకు పంపిణీ చేయడంలో సురవరం కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. పత్తికొండ, డోన్ తాలుకాలో నాటి పెత్తందారీ విధానం, ముఠాకక్షలకు వ్యతిరేకంగా సురవరం అనేక ఉద్యమాలు చేశారన్నారు. సురవరం మిత్రులు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురవరం గీతామాధురి, సీపీఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, నాయకులు పి.భీమలింగప్ప, కె.రామాంజనేయులు, ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబు, పి.రామకృష్ణారెడ్డి, నాగన్న, సుంకన్న, బస్తిపాడు రామకృష్ణారెడ్డి, కేవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కళాకారులు అభ్యుదయ, విప్లవగేయాలు ఆలపించారు.

పేదలకు వైద్య విద్య దూరం చేస్తారా?

- ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గపు చర్య
- వెంటనే ఉపసంహరించకుంటే ఉద్యమిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరిస్తూ మంత్రి మండలి నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమైన చర్యని... ఇది పూర్తిగా వైద్య రంగాన్ని ప్రైవేటుకు ధారాదత్తం చేసే విధానమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తీవ్రంగా విమర్శించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఇప్పటికే విద్యారంగం పూర్తిగా ప్రైవేటుమయమైందని, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో నడుస్తున్నాయని తెలిపారు. దీనికితోడు వైద్యకళాశాలలు కూడా ప్రైవేటుపరమైతే పేద విద్యార్థులకు పూర్తిగా వైద్య విద్య దూరమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు పూర్తిగా ప్రైవేటీకరణ జబ్బు పట్టుకుందని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తుండగా..దానిని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోపోగా..మిత్తల్ ఏర్పాటు చేసే ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేటాయించాలంటూ రాష్ట్రానికి చెందిన ఎంపీలు కేంద్రానికి విజ్ఞప్తి చేసే స్థాయికి దిగజారారని, దీంతో ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించే దిశగా చంద్రబాబు ప్రభుత్వ ఆలోచనలున్నట్లు స్పష్టమవుతోందన్నారు. తక్షణమే 10 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుడతామని రామకృష్ణ హెచ్చరించారు.

అబూజ్‌మడ్ అడవుల్లో ఎదురు కాల్పులు

మహిళా మావోయిస్టు మృతి... ఆయుధం స్వాధీనం

విశాలాంధ్ర-చింతూరు: చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడ, నారాయణపూర్, పూర్వ బస్తర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో శుక్రవారం మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టులు సమావేశమయ్యారని తెలుసుకున్న ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, డీఆర్‌జీ దళాలు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందారు. ఆమె మృతదేహంతో పాటు 303 రైఫిల్, 2 బీజీఎల్ లాంచర్, మారణాయుధాలు, రోజువారీ ఉపయోగించే సామాగ్రిని భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇంకా గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు.

పత్రికల భవిష్యత్తుకు ఢోకా లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా ఎంతగా విస్తరించినప్పటికీ పత్రికల మనుగడకు ఢోకా లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పేర్కొన్నారు. వాస్తవాలతో పూర్తిస్థాయి సమాచారం అందించే వార్తాపత్రికల్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విశాలాంధ్ర దినపత్రిక 73వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం విజయవాడలోని విశాలాంధ్ర కార్యాలయం చంద్రం బిల్డింగ్స్‌లో ఘనంగా జరిగింది. విశాలాంధ్ర న్యూస్ ఎడిటర్ మధుసూదనరావు అతిథులను సభా వేదికపైకి ఆహ్వానించగా, స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి చావా రవి అధ్యక్షత వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, విశాలాంధ్ర విజ్ఞానసమితి కార్యదర్శి జల్లి విల్సన్, జనరల్ మేనేజర్ హరినాథ్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్ మనోహరనాయుడు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ సుదీర్ఘ చరిత్ర గల విశాలాంధ్ర... పాఠకులకు వాస్తవ సమాచారం అందిస్తూ తనదైన శైలిలో పత్రికారంగంలో దూసుకుపోతోందన్నారు. ఎన్నో ఆటుపోట్లు అధిగమించి నిష్పక్షపాతంగా వార్తలు అందిస్తూ 73సంవత్సరాలుగా కొనసాగుతోందని, 100 వసంతాలు పూర్తి చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉన్నది ఉన్నట్లుగా వార్తలు ప్రచురించి ప్రజలకందించడంలో విశాలాంధ్ర ముందుందని, పాఠకులు విశాలాంధ్ర పత్రిక అవసరాన్ని గుర్తిస్తున్నారని తెలిపారు. హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని సోషల్ మీడియా వేగంగా విస్తరిస్తున్నా పత్రికా రంగానికి ఆదరణ తగ్గలేదని తెలిపారు. వాస్తవిక కోణంలో పూర్తి స్థాయి సమాచారం ప్రజలకు అందించడంలో పత్రికారంగం కీలకంగా ఉందన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఆ రంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. వివిధ ప్రత్యేక సంచికలు ముద్రించడంతో ముద్రణాపరంగా ఆటంకాలు తొలిగిపోయి మరింతగా ముందుకు వెళ్లడానికి అవకాశం ఉందన్నారు. దోనేపూడి శంకర్ మాట్లాడుతూ జిల్లాలో నాటి ఆనవాళ్లు, చారిత్రక అంశాలను గుర్తించి ప్రత్యేక సంచిక ద్వారా ఆ సమాచారాన్ని అందించడం శుభపరిణామన్నారు. వార్తల సమాచారంతో పాటు ఇలాంటి చారిత్రాత్మక ఘట్టాలు పాఠకులకు అవసరమని, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా విలేకరులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరో మరణం సంభవించకూడదు

తురకపాలెం సందర్శనలో ముప్పాళ్ల నాగేశ్వరరావు

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాకు డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం తురకపాలెంలో మరో మరణం సంభవించకుండా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు అనుమానితులుగా గుర్తించిన వారికి ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. మరణించిన కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆయన కోరారు. తురకపాలెంలో అంతుచిక్కని మరణాలు సంభవిస్తున్న నేపథ్యంలో సీపీఐ బృందం శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించింది. స్థానిక ప్రజలను కలిసి గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ మూడు మాసాల కాలంలో తురకపాలెంలో సుమారు 28 మంది మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. వారం రోజులుగా జిల్లా యంత్రాంగంతో పాటు అన్ని విభాగాలు మంచినీరు, పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రతపై అధ్యయనం చేస్తున్నారని, సమస్యకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామంలో మంచినీరు పరిశుభ్రంగా రావడం లేదంటూ స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత విభాగం సకాలంలో స్పందించలేదనే విషయం స్పష్టమవుతోందని తెలిపారు. తురకపాలెం గ్రామంలో నెలకొన్న సమస్య రాష్ట్రంలో మరో ప్రాంతంలో పునరావృతం కాకుండా ఒక సమగ్ర సర్వే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ తురకపాలెంలో మరణాల వెనుక నిర్లక్ష్యానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మంచినీటి సరఫరాపై తక్షణమే సర్వే నిర్వహించాలని, గుంటూరు నగరంతో పాటు జిల్లాలో లైసెన్స్ లేకుండా నీటిని సరఫరా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు తక్షణం సురక్షితమైన మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల సత్యనారాయణ, నగర సహాయ కార్యదర్శి రావుల అంజిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందారపు యశ్వంత్(శశి), సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ధూపాటి వెంకటరత్నం, విరిగినేని వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు నూతలపాటి చిన్నా, పీపీ జగన్నాథం, ఏఐఎస్ఎఫ్ నాయకులు అమర్నాథ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

'ఆపరేషన్ బుడమేరు' కోసం 11న సీపీఐ ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ: ఆపరేషన్ బుడమేరు అమలు హామీని నిలబెట్టుకోవాలని సీపీఐ ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లా కార్యదర్శులు దోనేపూడి శంకర్, నార్ల వెంకటేశ్వరరావు, మన్నవ కృష్ణ చైతన్య, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. విజయవాడలోని దాసరిభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. చినుకు పడితే ప్రజలు వణికిపోయే పరిస్థితి ఉందన్నారు. ఆపరేషన్ బుడమేరు అమలు, ముంపు నివారణకు సముచిత నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బుడమేరు పరివాహక ప్రాంతంలో ఆక్రమణలు తొలగించకుండా... ఏలూరు కాలువ ఎనికేపాడు యూటీను అభివృద్ధి చేయకుండా... 20 వేల క్యూసెక్కుల నీరు పోయే సామర్థ్యాన్ని పెంచకుండా... పూడిక తీయకుండా... వరద ముంపు నివారణ ఎలా సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏ కొండూరు మండలం దుర్గం కొండల్లో పుట్టిన బుడమేరు పులి వాగు చెంద్రగూడెం చిననందిగామ వెలగలేరు రెగ్యులేటర్ వరకు ప్రవహించి బుడమేరు డైవర్షన్ కెనాల్ (బిడిపిఎస్) దాని సామర్థ్యాన్ని 35 వేల క్యూసెక్కులకు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. విజయవాడ ఎగువ భాగం 250 ఎకరాలు బుడమేరు పరివాహక ప్రాంతం ఆక్రమణలకు గురైందని, నగరం పరివాహక ప్రాంతంలో 3,052 నిర్మాణాలు ఉన్నాయని ప్రభుత్వ సర్వే చెబుతోందని గుర్తుచేశారు. ఆపరేషన్ బుడమేరు తక్షణ అమలును కోరుతూ సీపీఐ ఎన్టీఆర్ కృష్ణ ఏలూరు జిల్లాల సమితి అధ్వర్యంలో ఈనెల 11న ధర్నాచౌక్‌లో జరిగే నిరసనలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని బుడమేరు బాధితులకు నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా యువజన సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి లంక గోవిందరాజులు పాల్గొన్నారు

అవి తప్పుదారి పట్టించేవి: భారత్

న్యూదిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఇటీవల భారత్‌పై చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని... అవి తప్పుదారి పట్టించేవని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ శుక్రవారం మండిపడ్డారు. నవారో వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. భారత్, అమెరికాల మధ్య సంబంధాలు ఎంతో కీలకమని ఈ సందర్భంగా జైస్వాల్ పేర్కొన్నారు. 'ఈ రెండు దేశాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పంచుకుంటున్నాయి. మన ఉమ్మడి ప్రయోజనాలు, ప్రజాస్వామ్య విలువలు ఇందులో ఉన్నాయి' అని వెల్లడించారు. పరస్పర గౌరవం, ఉమ్మడి ప్రయోజనాల ఆధారంగా రెండు దేశాల మధ్య సంబంధాలు ముందుకు సాగుతాయని తాను ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అలస్కాలో జరుగుతున్న సంయుక్త సైనిక విన్యాసాలు ఇందుకు నిదర్శనమని చెప్పారు. రెండు దేశాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయని... అమెరికాతో సంబంధాలను బలోపేతం చేసుకునేందుకు భారత్ కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

గాజాలో మానవతా సంక్షోభాన్ని తక్షణమే ముగించాలి

81 దేశాల శాస్త్రవేత్తల పిలుపు - ఉమ్మడి ప్రకటనపై 4వేలకుపైగా సంతకాలు

న్యూదిల్లీ: గాజాలో దుర్భర పరిస్థితులపై ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తంచేశారు. కనివిని ఎరుగని రీతిలో నెలకొన్న మానవతా సంక్షోభాన్ని అంతం చేసేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని 4,459 మంది పిలుపునిచ్చారు. వీరిలో 14 మంది నోబెల్ గ్రహీతలు, ఐదుగురు ఫీల్డ్ మెడలిస్టులు, 20 మంది బ్రేక్‌త్రూ పురస్కార గ్రహీతలు, 34 మంది డిరాక్ పురస్కార విజేతలు, నలుగురు ఉల్ఫ్ పురస్కార గ్రహీతలు ఉన్నారు. గాజాలో ఇజ్రాయిల్ విధ్వంసం సృష్టించిందని, అక్కడ ఆహారం, మందుల కొరత, పౌర మౌలిక వసతులు, విద్యవ్యవస్థను నాశనం చేసిందంటూ ఉమ్మడి ప్రకటనలో ఆవేదన వ్యక్తంచేశారు. మానవ సృష్టిత మానవతా సంక్షోభాన్ని తక్షణమే అంతం చేయాలని ఇజ్రాయిల్ ప్రభుత్వాన్ని కోరారు. 2023 అక్టోబరులో హమాస్ దాడిని ఖండించారు. బందీల అమానవీయ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. వారిని తక్షణమే హమాస్ విడుదల చేయాలని కోరారు. గాజాలో భయానక పరిస్థితులకు అనేక ఘటనలు దారితీశాయని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ దాడుల్లో పసి పిల్లలు సహా 60వేల మందికిపైగా అమాయక పలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారని ఉమ్మడి ప్రకటన పేర్కొంది. మానవతా ఎమర్జెన్సీ నెలకొన్నదని, ప్రపంచ దేశాలు, అనుకూల అంతర్జాతీయ వ్యవస్థలు వెంటనే జోక్యం చేసుకొని ఈ విపత్తు అంతానికి కృషి చేయాలని పిలుపునిచ్చింది. గాజాలో మానవతా విపత్తును అంతం చేయాలని కోరుతూ ఈ ప్రకటనపై ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు 81 దేశాలకు చెందిన 4,459 మంది సంతకాలు చేశారు. అత్యధికంగా ఇటలీ నుంచి 924 మంది సంతకాలు చేయగా, స్పెయిన్ (449), అమెరికా (429), ఫ్రాన్స్ (326), భారత్ (310), బ్రెజిల్ (267), బ్రిటన్ (247), జర్మనీ (186), స్విట్జర్లాండ్ (138) జపాన్ (112), నెథర్లాండ్స్ (104) మెక్సికో (86), ఇజ్రాయిల్ (85), కెనడా (85) బెల్జియం (75) దేశాల ప్రముఖులు సంతకాలు చేశారు. అలాగే అర్జెంటైనా, పోర్చుగల్, గ్రీస్, చిలీ, పోలండ్, స్వీడెన్, కొయేషియా, చెక్ రిపబ్లిక్, చైనా, దక్షిణాఫ్రికా, స్లోవేనియా, బంగ్లాదేశ్, నార్వే, ఐస్లాండ్, దక్షిణ కొరియా, ఆస్ట్రియా, ఇరాన్, పాకిస్థాన్, టర్కీ రష్యా, సౌదీ, పలస్తీనా, కొలంబియా, క్యూబా సహా 81 దేశాల శాస్త్రవేత్తలు, ప్రతిష్ఠాత్మక అవార్డు గ్రహీతలు గాజాకు మద్దతిచ్చారు.

కూటమి ప్రభుత్వంలో ప్రజాధనం దోపిడీ

మాజీ సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు సంపద సృష్టిస్తానని చెప్పి...తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆస్తులను పప్పుబెల్లాల మాదిరిగా కమీషన్ల కోసం దోచిపెడుతున్నారని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆరోపించారు. తమ హయాంలో నెలకొల్పిన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుబట్టారు. ఇది రాష్ట్రానికి శాశ్వతంగా చేస్తున్న అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'ప్రజల ఆస్తులను దోచుకున్న వ్యక్తిగా ఇదివరకే మీకు పేరు ఉంది. దీనితో చరిత్రహీనుడిగా మీరు నిలిచిపోతారు చంద్రబాబుగారూ...ప్రజలకోసం కాకుండా దోపిడీకోసం నిర్ణయాలు తీసుకోవడానికే మీరు మంత్రివర్గ సమావేశాలు పెట్టుకుంటున్నట్టుగా మీ తీరు ఉంది' అని ఆరోపించారు. ఐదేళ్లలో తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 17 కాలేజీల్లో 5 చోట్ల కాలేజీలు పూర్తయ్యి, క్లాసులు కూడా జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం అమాంతంగా విలువ పెరిగిన ఆ కాలేజీల భవనాలు, భూములు కొట్టేయడానికే చంద్రబాబు పథకం వేశారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు సంజీవని లాంటి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని... 15 నెలల కాలంలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.4,500 కోట్లకు గాను, కేవలం రూ.600 కోట్లు మాత్రమే ఇచ్చి... దాదాపు రూ.4,000 కోట్లు ఎగ్గొట్టడం ద్వారా పేదవాడి ఆరోగ్య భద్రతను భ్రష్టు పట్టించారన్నారు. దేశంలో అనేక ఆరోగ్య బీమా సంస్థల నుంచి క్లెయిముల పరిష్కారంలో వస్తున్న ఇబ్బందులు తెలియనివా? లాభాలు లేకుండా వారు ఇన్సూరెన్స్ వ్యాపారం చేస్తారా? అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నిర్ణయాలను రద్దు చేస్తామని, తిరిగి కళాశాలలను ప్రభుత్వ రంగంలోకి తెచ్చుకుంటామని తెలిపారు.

ప్రతిభ వెలికితీసేది గురువులే

- నేను ఇప్పటికీ నిత్య విద్యార్థినే
- పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు చదువే గొప్ప ఆస్తి
- గురుపూజోత్సవంలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేది, వారిలో నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది ఉపాధ్యాయులేనని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. అందుకే గురువులను జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమన్నారు. విజయవాడ ఏ1 కన్వెన్షన్‌లో శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొని రాష్ట్రంలోని 175 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారని గుర్తు చేసుకున్నారు. నేను నిత్య విద్యార్థిని. ప్రతి రోజు ఏదో ఒకటి నేర్చుకుంటా. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు. లోకేశ్ చదువు గురించి నా భార్యే చూసేది. ఆ క్రెడిట్ ఆమెదే. డీఎస్సీ అంటే ఎప్పుడూ జాప్యం చేయను. సమయానికి భర్తీ చేస్తా. ఒకప్పుడు టీచర్ల బదిలీలు జెడ్పీ చైర్మన్ చేతిలో ఉండేవి. టీచర్ల బదిలీల్లో కౌన్సిలింగ్ ప్రక్రియ తెచ్చింది నేనే. కొన్ని ఉద్యోగాల్లో పురుషుల కంటే మహిళలే ఎక్కువ సంపాదిస్తున్నారు. తల్లికి వందనం పేరుతో పిల్లలు చదువుకునేందుకు అండగా ఉన్నాం. ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం ఇస్తున్నాం. ఏ విషయంలోనైనా కొంత నిర్లక్ష్యం చేస్తానేమో కాని, విద్యాశాఖను మాత్రం నిర్లక్ష్యం చేయనని సీఎం స్పష్టం చేశారు.అందుకే మెగా డీఎస్సీపై తొలి సంతకం పెట్టానన్నారు.

ఉద్యోగులకు ఏ ఇబ్బందీ రానివ్వను

నేను ఉండగా ఉద్యోగులకు ఇబ్బంది రానివ్వను చంద్రబాబు పేర్కొన్నారు. ఉద్యోగుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సేవలు అందిస్తున్నాం. టీచర్లు కూడా తమ సిలబస్‌ను రీరైట్ చేసుకోవాలి. పిల్లలకు ఎలాంటి సిలబస్ అవసరమో, దానికనుగుణంగా మార్పులు అవసరం. టెక్నాలజీ విషయంలో నేటితరం పిల్లలు చాలా ఫాస్ట్‌గా ఉన్నారు. సమాజంలో జరిగే మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలు ఉండాలి. ఉపాధ్యాయులు కూడా నిత్యం అప్‌డేట్ కావాలి. పిల్లలకు విద్యాబుద్ధులతోపాటు, విలువలు నేర్పాలి. అంతిమంగా పిల్లల్లో సృజనాత్మకతను పెంచే బాధ్యత గురువులదేనని సీఎం స్పష్టం చేశారు. అలాగే భారత్‌లో ఉన్న కుటుంబ విలువలు ప్రపంచంలో ఎక్కడా లేవని, భార్యాభర్తలు పరస్పరం గౌరవించుకోవడం... పిల్లల కోసం కష్టపడటం ఏ దేశంలోనూ లేదన్నారు. ఈ విలువలు కాపాడుకుంటే చాలు...మన పిల్లలు ఏదైనా సాధిస్తారని సీఎం ఉద్ఘాటించారు.

చుక్కా రామయ్యపై గౌరవం పెరిగింది

ఐఐటీ కోచింగ్ విషయంలో చుక్కా రామయ్య కచ్చితంగా ఉండేవారు. పదివేల మంది దరఖాస్తు చేస్తే వందమందికి ఐఐటీ శిక్షణ ఇచ్చేవారు. వందకు వందమందినీ ఐఐటీకి పంపేవారు. అదీ ఆయన గొప్పతనం. ముఖ్యమంత్రిగా నేను సిఫార్సు చేసినా సీటు ఇవ్వబోనని చెప్పేవారు. అందుకే చుక్కా రామయ్య అంటే గౌరవం పెరిగింది. ఆయన కోచింగ్ ప్రత్యేకత గురించి అడిగి తెలుసుకున్నానని గుర్తు చేశారు.

రాజకీయాలకు దూరంగా విద్యారంగం: మంత్రి లోకేశ్

ప్రభుత్వ విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచామని విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ చెప్పారు. పుస్తకాల సంచులపై ప్రముఖుల ఫొటోలు ముద్రించామని, ప్రభుత్వ పథకాలకు సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ పేర్లు పెట్టామని తెలిపారు. విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. లీప్ మోడల్‌ను అందరం కచ్చితంగా అమలు చేయాలి. మెగా పేరెంట్-టీచర్ సమావేశాలు ఏర్పాటు చేశాం. పిల్లలను యోగా, క్రీడలు, ఎన్‌సీసీ వైపు ప్రోత్సహిస్తున్నామని వివరించారు. చంద్రబాబు అంటేనే డీఎస్సీ...డీఎస్సీ అంటే చంద్రబాబు అన్నారు. ఆయన ఆధ్వర్యంలో 13 డీఎస్సీ నోటిఫికేషన్లు ఇచ్చి 1,83,000 టీచర్ పోస్టులు భర్తీ చేశారని గుర్తు చేశారు. తాజా డీఎస్సీపై 70 కేసులు పెట్టినా వెనక్కి తగ్గలేదని, న్యాయపరమైన సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని లోకేశ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, జిల్లా శాసనసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.